Postel No. MBN/08/2016-2018



పురాతనమైన సమస్తరోగాలకు
ఆయుర్వేద చికిత్స
మూల వ్యాధి, తెల్లమచ్చలు,చర్మవ్యాధులతోపాటు అన్ని రకాల రోగాలకు వనమూలికలతో వైద్యంచేయబడును.
శ్రీ దత్తత్రిలింగేశ్వరాలయము
నారాయణపేట రోడు,ఊట్కూర్‌మండలం
మహబూబ్‌నగర్ జిల్లా సెల్ 9640418895



# వార్తాతరంగాలు

జాతీయ తెలుగు దిన పత్రిక

website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar సంపుటి :24 సంచిక :298 సంపాదకులు: కోటకొండ ఎడ్ల విజయరాజు శనివారం 21 ఫిబ్రవరి 2026 పేజీలు :12 వేల రూ5 /-


# పరిషత్ లు రద్దు దిశగా అడుగులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 21:**తెలంగాణ రాష్ట్రంలోని స్థానిక సంస్థల పరిపాలనా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేసే దిశగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం అత్యంత కీలకమైన అడుగులు వేస్తోంది. రాష్ట్రంలోని ఎంపీటీసీ, జడ్పీటీసీ వ్యవస్థలను పూర్తిగా రద్దు చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తోంది. ఒక వేళ ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చితే, తెలంగాణ రాజకీయాల్లో ఇది ఒక పెను సంచలనంగా మారొచ్చు. తెలంగాణలో ప్రస్తుతం అమల్లో ఉన్న మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థలో ఎంపీటీసీ, జడ్పీటీసీల పాత్రపై ప్రభుత్వం సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించింది. ఈ వ్యవస్థ రద్దు చేయాలనే ఆలోచన వెనుక మూడు బలమైన కారణాలు కనిపిస్తున్నాయి. ఈ వ్యవస్థ ద్వారా ప్రజల చేత ఎన్నికైన ప్రతినిధులకు క్షేత్రస్థాయిలో సరైన అధికారులు కానీ, నిర్దిష్టమైన



బాధ్యతలు కానీ లేవని ప్రభుత్వం అభిప్రాయపడుతోంది. కేవలం పదవులు ఉండి, నిధులు, విధులు లేకపోవడం వల్ల ఆశించిన అభివృద్ధి జరగడం లేదని సర్కారు భావిస్తోంది. ఎంపీటీసీ, జడ్పీటీసీ వ్యవస్థలను రద్దు చేయడం ద్వారా భవిష్యత్‌లో ఈ స్థానాలకు ప్రత్యేకంగా ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరమే ఉండదని ప్రభుత్వం యోచిస్తోంది. ఇది ప్రభుత్వ ఖజానాపై భారాన్ని తగ్గించమే కాకుండా తరచూ వచ్చే ఎన్నికల కోడ్ అడ్డంకులను కూడా నివారిస్తుందని అంటున్నారు. ప్రస్తుతం వ్యవస్థల వల్ల పాలనాపరంగా పెద్దగా ఉపయోగం లేదని ప్రభుత్వం ప్రాథమికంగా ఒక నిర్ధారణకు వచ్చినట్టు తెలుస్తోంది. ఈ ప్రతిపాదనపై స్పష్టత రావడానికి ఫిబ్రవరి 23న జరిగే రాష్ట్ర కేబినెట్ సమావేశం అత్యంత కీలకమైంది. ఈ సమావేంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ వ్యవస్థల రద్దుపై ప్రభుత్వం చర్చించే ఛాన్స్ ఉంది. ఈ లోగా ఈ అంశంపై ఒక సమగ్ర నివేదికను సమర్పించాలని - మిగతా3లో

# గ్రామ పంచాయితీలకు రూ.387 కోట్లు విడుదల..

**హైదరాబాద్:**తెలంగాణలోని గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. 15వ ఆర్థిక సంఘం నిధుల్లో భాగంగా 3వ విడతగా రూ. 387.53 కోట్లు విడుదల కావడంతో గ్రామీణ సంస్థలకు భారీ ఊరట లభించింది. ఇటీవల పంచాయతీ ఎన్నికలు ముగియడంతో పెండింగ్ గ్రాంట్ల విడుదలకు లైన్ క్లియర్ కాగా, ఇప్పటివరకు మూడు విడతల్లో కలిపి మొత్తం రూ. 1,034.42 కోట్లు రాష్ట్రానికి జమయ్యాయి. ఈ నిధులను ప్రధానంగా పారిశుద్ధ్యం,




తాగునీరు, మౌలిక వసతుల కల్పన వంటి అత్యవసర పనులకు వినియోగించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# ఆ ఒక్కరూ ఎవ్వరు...?

**హైదరాబాద్, ఫిబ్రవరి 21:**తెలంగాణలో ఖాళీ అవుతున్న రెండు రాజ్యసభ స్థానాలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఈ నెల 26న నోటిఫికేషన్ విడుదల కానుండగా, మార్చి 16న పోలింగ్ జరగనుంది. ప్రస్తుతం కాంగ్రెస్ తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న అభిషేక్ మను సింఘ్వీతో పాటు, బిఆర్ఎస్ సభ్యుడు కె.ఆర్. సురేష్ రెడ్డి పదవీకాలం ముగియనుంది. దీంతో కాంగ్రెస్ పార్టీలో ఈ రెండు స్థానాల కోసం పోటీ ప్రారంభమయింది. ఇప్పటి వరకూ సీనియర్ నేతలను పట్టించుకోలేదని, ఈసారైనా పార్టీ విధేయులకు రాజ్యసభర స్థానాలను ఇవ్వాలన్న డిమాండ్ ఎక్కువగా వినపడుతుంది. పదేళ్ల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా పార్టీకోసం కష్టపడిన వారికి ఇప్పటి వరకూ ఛాన్స్ ఇవ్వకపోవడాన్ని తప్పు పడుతుంది.శాసనసభలో ప్రస్తుత పార్టీల బలాబలాలను పరిశీలిస్తే, అధికార కాంగ్రెస్ పార్టీ ఈ రెండు స్థానాలను సునాయాసంగా కైవసం చేసుకునేలా కనిపిస్తోంది. రాజ్యసభ ఎన్నికల గెలుపు లెక్కల ప్రకారం, రెండు స్థానాలు ఖాళీగా ఉన్నప్పుడు ఒక్కో అభ్యర్థి గెలవడానికి దాదాపు 40 నుంచి 41 మొదటి ప్రాధాన్యత ఓట్లు అవసరం. అసెంబ్లీలో కాంగ్రెస్‌కు ఉన్న 64 మంది స్వంత ఎమ్మెల్యేలతో పాటు, ఇతర పార్టీల నుండి చేరిన - మిగతా3లో

# కొత్త నేతలను వెతికే పనిలో కాంగ్రెస్

**హైదరాబాద్, ఫిబ్రవరి 21:**తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పగ్గాలు చేపట్టిన తర్వాత నుంచి వరుసగా సాధిస్తున్న రాజకీయ విజయాలు, పాలనాపరమైన సంస్కరలపై కాంగ్రెస్ అధిష్ఠానం ప్రత్యేక దృష్టి పెట్టింది. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరిగిన అసెంబ్లీ ఉపఎన్నికలు, గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ ఘన విజయం సాధించడం పట్ల ఏఐసీసీ అగ్రనాయకత్వం హర్షం వ్యక్తం చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని మంత్రుల బృందం గురువారం ఢిల్లీలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రంలో చేపట్టబోయే భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగావచ్చే అసెంబ్లీ ఎన్నికలపై కూడా ఫోకస్ పెట్టినట్టు స్పష్టం చేసింది. పదివేల కంటే ఎక్కువ ఓట్ల తేడాతో ఓడిపోయిన వారిని ఇన్‌ఛార్జ్ బాధ్యతల నుంచి తప్పించాలని ఆదేశించారు. తెలంగాణలో గత రెండేళ్లలో పార్టీ సాధిస్తున్న పురోగతిని సమీక్షించడానికి ముఖ్యమంత్రి, మంత్రులు, పీసీసీ



అధ్యక్షుడిని ఢిల్లీకి పిలిపించిన అధిష్ఠానం, దాదాపు రెండు గంటలపాటు లోతైన చర్చలు జరిపింది. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక మొదలు కొని ఇటీవల ముగిసిన స్థానిక సంస్థల ఎన్నికల వరకు కాంగ్రెస్ సాధించిన ఫలితాల పట్ల మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ సంతృప్తి వ్యక్తం - మిగతా3లో

# అగ్రి షో వంటి కార్యక్రమాలు ప్రభుత్వం నిర్వహిస్తే మేలు జరుగుతుంది

**ఎన్టీఆర్ మైదానంలో ఏర్పాటు చేసిన అగ్రి షోను సందర్శించిన హరీశ్ రావు**

**తెలంగాణలో యూరియా కొరతను నివారించాలని డిమాండ్**

**రైతులకు ఆధునిక పరికరాలను సబ్సిడీపై ఇవ్వాలని డిమాండ్**



రైతుబడి అగ్రి షో వంటి కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తే రైతులకు మేలు జరుగుతుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ మైదానంలో ఏర్పాటు చేసిన అగ్రి షోను ఆయన సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ, తెలంగాణలో యూరియా కొరతను నివారించాలని డిమాండ్ చేశారు. రైతులకు ఆధునిక పరికరాలను సబ్సిడీపై ఇవ్వాలని అన్నారు.సాగు పనిముట్లకు రాయితీపై రైతుల పక్షాన అసెంబ్లీలో చర్చిస్తామని హరీశ్ రావు వెల్లడించారు. అగ్రి వంటి కార్యక్రమాలు రైతులకు అన్ని రకాలుగా దోహదపడుతాయని అన్నారు. ఈ అగ్రి షో కార్యక్రమంలో రైతుబడికి చెందిన రాజేందర్ రెడ్డి మాజీ మంత్రి హరీశ్ రావుపై ప్రశంసలు కురిపించారు. హరీశ్ రావు మంత్రిగా ఉన్న సమయంలో స్వయంగా తనకు ఫోన్ చేసి సాగర్‌లో స్థానిక పరిపాలన లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, దీని మీద వార్తలు రాస్తే దాని ఆధారంగా చర్యలు తీసుకుంటానని తనకు చెప్పారని గుర్తుచేసుకున్నారు. అప్పుడు నాగార్జున సాగర్ ప్రాజెక్టు కింద పాలన ఉండేదని అన్నారు. ఆ సమయంలో తాను రెండు మూడు వార్తలు రాశానని, మిగతా మీడియా కూడా స్పందించి వార్తలు రాసిందని అన్నారు. వాటి ఆధారంగా హరీశ్ రావు నాగార్జున సాగర్‌ను మున్సిపాలిటీగా చేసి స్థానిక పాలన జరిగేలా చేశారని గుర్తు చేసుకున్నారు.

# ‘ఏఐ’ని అదుపుచేసి ముందుకు వెళ్లాలి..

**మానవ సంబంధాలు మంటగలిసిపోతాయేమో: వెంకయ్యనాయుడు ఆందోళన**

**విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉండకుండా ఏఐని కట్టడి చేయాలన్న మాజీ ఉప రాష్ట్రపతి**

కృత్రిమ మేధ(ఏఐ)ని అదుపుచేసి ముందుకెళ్లాల్సిన అవసరం ఉందని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. ఏఐ వస్తే మానవ సంబంధాలు మంటగలిసిపోతాయేమోననే భయం తనకు ఉందని అన్నారు. విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉండకుండా ఏఐని కట్టడి చేయాల్సి ఉందని అన్నారు. విజయవాడలోని పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జరిగిన పూర్వ విద్యార్థుల సంఘం స్వర్ణోత్సవ సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, - మిగతా3లో



# ఏఐ సమ్మిట్ వద్ద యూత్ కాంగ్రెస్ నిరసనలపై కేటీఆర్ మండిపాటు

**అంతర్జాతీయ సదస్సులను రాజకీయ ప్రదర్శనలకు ఉపయోగించడంపై కేటీఆర్ మండిపాటు**

**ఇది దేశ ప్రతిష్ఠను దెబ్బతీసే చర్య అని వ్యాఖ్య**

**ఇలాంటి వేదికల్లో హుందాగా వ్యవహరించాలని సూచన**

ఢిల్లీలో జరుగుతున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ - 2026 వేదిక వద్ద యూత్ కాంగ్రెస్ నాయకులు చేసిన నిరసనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. ఇలాంటి అంతర్జాతీయ సదస్సులను రాజకీయ ప్రదర్శనలకు ఉపయోగించడం దేశ ప్రతిష్ఠను దెబ్బతీసే చర్య అని అభివర్ణించారు. అంతర్జాతీయ సదస్సులు దేశ ప్రతిభను, సామర్థ్యాన్ని ప్రపంచానికి చూపించే వేదికలని అన్నారు. ఇలాంటి వేదికల్లో హుందాగా వ్యవహరించాలని చెప్పారు. రాజకీయ విభేదాలు సహజమే



అయినా... అభిప్రాయ భేదాలను వ్యక్తపరచడానికి సరైన సమయం, సరైన వేదిక ఉండాలని కేటీఆర్ అన్నారు. గ్లోబల్ ఈవెంట్‌లలో ఇలాంటి నిరసనలు చేపట్టడం వల్ల భారత్‌పై అంతర్జాతీయంగా ప్రతికూల అభిప్రాయం ఏర్పడే ప్రమాదం ఉందని విమర్శించారు. ఈ సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగిస్తున్న సమయంలోనే యూత్ కాంగ్రెస్ నాయకులు నిరసన చేయడం చాలా విచిత్రంగా ఉందని వ్యాఖ్యానించారు.



# ప్రియాంక గాంధీని కలిసిన ఉప ముఖ్యమంత్రి భట్టి

**కుమారుడి వివాహానికి ఆహ్వానం**

**న్యూఢిల్లీ:**ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, ఎంపీ ప్రియాంక గాంధీ ని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు శనివారం కుటుంబ సభ్యులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. మార్చి 5వ తేదీన హైదరాబాద్లో జరగనున్న ఆయన కుమారుడు సూర్య విక్రమాదిత్య వివాహ వేడుకకు విచ్చేసి, నూతన వధూవరులను ఆశీర్వదించాలని కోరుతూ, వివాహ పత్రికను అందజేసి సాదరంగా ఆహ్వానించారు.

# నేను పార్టీ అధ్యక్షుడిని అయ్యే నాటికి పార్టీ పరిస్థితి క్లిష్టంగా ఉంది

**పార్టీలో కొందరి నుంచి వ్యతిరేకత ఎదుర్కొన్నానని తెలిపిన రేవంత్ రెడ్డి**

**నేతలందరినీ కలిసి తన ఆలోచన చెప్పి వారిని ఒప్పించానన్న ముఖ్యమంత్రి**

**అందరి కృషి వల్ల తెలంగాణలో పార్టీ తిరిగి పుంజుకున్నదన్న ముఖ్యమంత్రి**

తాను టీపీసీసీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టే నాటికి పార్టీ పరిస్థితి క్లిష్టంగా ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు రేవంత్ రెడ్డి అన్నారు. పార్టీలో కూడా కొందరి నుంచి వ్యతిరేకత ఎదుర్కొన్నానని, నేతలందరినీ కలిసి తన ఆలోచన చెప్పి వారిని ఒప్పించానని గుర్తుచేసుకున్నారు. వికారాబాద్ జిల్లా అనంతగిరిలో నిర్వహించిన ఏపీ, తెలంగాణ డీసీసీ అధ్యక్షుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీలో తొలి నుంచి భిన్నాభిప్రాయాలు వెలువరించే స్వేచ్ఛ ఉందని అన్నారు. భిన్నాభిప్రాయాలు చెప్పినంత మాత్రాన వారిని వేధించే సంస్కృతి కాంగ్రెస్ పార్టీలో లేదని వెల్లడించారు. మనలో మనం కొట్టుకుంటే పార్టీలో కష్టపడి పనిచేసే లక్షలాది మంది కార్యకర్తలకు అన్యాయం చేసినట్లు అవుతుందని అన్నారు. అందరి కృషి వల్లే తెలంగాణలో పార్టీ తిరిగి పుంజుకున్నదని అన్నారు. డీసీసీ అధ్యక్షులుగా బాగా పనిచేసిన వారికి ఎమ్మెల్యే టిక్కెట్లు ఇచ్చామని, ఎమ్మెల్యే టిక్కెట్లు రాని వారికి ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చామని తెలిపారు. పార్టీ కోసం పనిచేసిన మరో అరవై మందికి కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు ఇచ్చామని



ముఖ్యమంత్రి వెల్లడించారు. పార్టీలో అందరి పనితీరుపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని హెచ్చరించారు. పార్టీ కోసం శ్రమించే వారికి కచ్చితంగా న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు. మెరిట్ ప్రకారమే పార్టీలో అవకాశాలు వస్తాయన్నారు. డీసీసీ పదవి ఎంతో విలువైనదని, దీనిని ఏమాత్రం దుర్వినియోగం చేసుకోవద్దని హితవు పలికారు. మంచి ప్రతిభ కనబరిస్తే ఆ తర్వాత ఎమ్మెల్యే, మంత్రి, ముఖ్యమంత్రి - మిగతా3లో

## సంపాదకీయం

# ఏఐ క్యాపిటల్‌గా భారత్

అమెరికా వాణిజ్య ఆధిపత్యం, చైనా ఒంటెత్తు పోకడలకు భిన్నంగా భారత్ ఒక 'మూడవ మార్గాన్ని' ప్రపంచానికి పరిచయం చేయబోతున్నదని చెప్పవచ్చు. కీలకమైన సంస్థల డేటా సెంటర్లు ఇండియాలో ఏర్పాటు చేస్తుండటంతో అంతర్జాతీ యంగా కూడా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎలా పనిచేయాలి? దాని పరిమితులు పరిధులు కూడా నిర్ణయించే దిశగా అడుగులు వేస్తున్నది. ఈ సదస్సు చివరిరోజున అంటే ఫిబ్రవరి 20వ తేదీన భారత్ 'ఢిల్లీ డిక్లరేషన్' పేరిట ఓ డ్రాఫ్ట్ విడుదల చేయ బోతున్నది. అది భవిష్యత్తులో ఏఐ ఎలా పనిచేయాలన్న విధివిధానాలకు మార్గదర్శకంగా నిలవబోతున్నది. ఇప్పటికే ప్రధాని డీప్ ఫేక్ లాంటి సమస్యలను బహిరంగంగానే లేవనెత్తారు. ఇలాంటి సమస్యలకు పరిష్కారం ఎలా ఉండాలన్నది డిక్లరేషన్‌లో చర్చకు రానున్నది. ఇక ఏఐ కేవలం అభివృద్ధి చెందిన దేశాలకు మాత్రమే పరిమితం కాకు డదని.. ఆఫ్రికా వంటి పేద దేశాలకు కూడా అందేలా చూడాలని పిలుపు ఇవ్వనున్నారు.. మొత్తంగా ఏఐకి భారత్ క్యాపిటల్ అయ్యే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అంతిమంగా భారత్ ఇప్పుడు కేవలం ఒక మార్కెట్ మాత్రమే కాదు.. ఏఐ ప్రపంచానికి మార్గదర్శి లేదా దిక్సూచిగా మారబోతోంది. భారత్ ఏఐ హబ్‌గా మారడానికి ఉన్న అవకాశాలు మరే దేశానికీ లేవన్నది వాస్తవం. దీనికి ప్రధానంగా మూడు కారణాలు ఉన్నాయి. డేటా వైవిధ్యం.. భారత్‌లోని భాషలు, సంస్కృతులు, భౌగోళిక పరిస్థితులు ఏఐ అల్గారిథమ్స్ శిక్షణకు అద్భుతమైన ముడిసరుకు.. ఇక్కడ ఒక ఏఐ మోడల్ సక్సెస్ అయిందంటే, అది ప్రపంచవ్యాప్తంగా ఎక్కడైనా పనిచేయగలదని అంతర్జాతీయంగా పేరొందిన టెక్ కంపెనీలు నమ్ముతున్నాయి. అందుకే అమెరికాలోనే ఉచితంగా ఇవ్వని ఏఐ అత్యాధునిక మోడళ్లను ఇక్కడ ఉచితంగా అందజేస్తున్నాయి. ఇక డెమోగ్రాఫిక్ డివిడెండ్.. ప్రపంచంలోనే అతిపెద్ద యువ జనాభాతోపాటు ఇంగ్లిష్ మాట్లాడే సాంకేతిక నిపుణులు భారత్ సొంతం. ఇది అంతర్జాతీయ సంస్థలను అయస్కాంతంలా ఆకర్షిస్తున్నది. దీంతో పాటు ప్రధానమైన మరో అంశం డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్.. యూపీఐ లాంటి వ్యవస్థల ద్వారా సామాన్యుడిని డిజిటల్ పరిధిలోకి తెచ్చిన అనుభవం భారత్‌కు ఉంది. ఇప్పుడు అదే స్ఫూర్తితో 'ఇండియా ఏఐ మిషన్' సాగుతున్నది. కొన్నేళ్ల క్రితమే భారత ప్రభుత్వం ఒక నిబంధన తెచ్చింది. 'భారతీయుల డేటా (ముఖ్యంగా బ్యాంకింగ్, వ్యక్తిగత వివరాలు) భారత గడ్డపై ఉన్న సర్వర్లలోనే ఉండాలి.' దీంతో గతంలో అమెరికా లేదా సింగపూర్‌లో సర్వర్లు పెట్టుకున్న గూగుల్, ఫేస్‌బుక్, అమెజాన్ వంటి సంస్థలు తప్పనిసరిగా భారత్‌లో డేటా సెంటర్లు నిర్మించా ల్సి వచ్చింది. ఇది ఒక ముందస్తు 'మాస్టర్ ప్లాన్'. అందుకోసమే ప్రస్తుత బడ్జెట్‌లో ప్రభుత్వం డేటా సెంటర్ల కోసం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంది. విదేశీ క్లౌడ్ కంపెనీలు భారత్‌లో డేటా సెంటర్లు పెట్టి ఇక్కడి నుండి ప్రపంచ వ్యాప్తంగా సేవలు అందిస్తే, వారికి 2047 వరకు పన్ను మినహాయింపులు ప్రకటించింది. డేటా సెంటర్లను 'మౌలిక సదుపాయాల' జాబితాలో చేర్చడం వల్ల వీరికి తక్కువ వడ్డీకే రుణాలు దొరుకుతున్నాయి. మైక్రోసాఫ్ట్ సంస్థ హైదరాబాద్, ముంబై, పుణె ప్రాంతాల్లో సుమారు 21.5 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడితో డేటా సెంటర్లను ఏర్పాటు చేస్తున్నది. విశాఖపట్నంలో గూగుల్ తన మొదటి పూర్తిస్థాయి 'ఏఐ హబ్'ను ఏర్పాటు చేయడానికి 15 బిలియన్ డాలర్లు కేటాయించింది. రిలయన్స్, అదానీ వంటి స్వదేశీ దిగ్గజాలు కూడా గిగావాట్ స్థాయి డేటా సెంటర్లను గుజరాత్, మహారాష్ట్ర తోపాటు ఆంధ్ర ప్రదేశ్‌లో నిర్మిస్తున్నాయి. ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌లో డేటా సెంటర్ నిర్వహణ ఖర్చు (ముఖ్యంగా లేబర్, కన్స్ట్రక్షన్) చాలా తక్కువ. భారత్ సౌర విద్యుత్ రంగంలో దూసుకుపోతున్నది. డేటా సెంటర్లకు కావలసిన భారీ విద్యుత్తును గ్రీన్ ఎనర్జీ ద్వారా అందించడం వల్ల అంతర్జాతీయ కంపెనీలకు తమ 'కార్బన్ ఫుట్‌ప్రింట్' తగ్గించుకునే అవకాశం దొరుకు తోంది. 'డేటా ఇస్ ద న్యూ ఆయిల్' అని మనందరికీ తెలుసు.. ఆ చమురును నిల్వ చేసే 'ట్యాంకర్లే' ఈ డేటా సెంటర్లు.. భారత్ ఇప్పుడు ప్రపంచానికి డిజిటల్ గిడ్డంగిగా మారబోతున్నది. ఏఐ వల్ల కలిగే లాభాల కంటే, దాని మిస్ యూజ్ గురించిన ఆందోళనలే ఎక్కువ. అందుకే నియమ నిబంధనల విషయంలో భారత్ కఠినంగా వ్యవహరించనున్నది. భారతీయ వినియోగదారుల డేటా భారత గడ్డపైనే ఉండాలి. విదేశీ సంస్థలు మన డేటాను 'టెస్టింగ్ ల్యాబ్'గా వాడుకోవచ్చు కానీ, దానిని మనకు వ్యతిరేకంగా వాడకుండా చూడాలి. జర్నలిజం రంగంలో ఏఐ వల్ల తప్పుడు వార్తలు వ్యాపించే ప్రమాదం ఉంది. దీనిని అరి కట్టేలా ఏఐ కంటెంట్‌కు 'డిజిటల్ వాటర్‌మార్క్' తప్పనిసరి చేసే దిశగా చట్టాలు రాబోతున్నాయి. ముఖ్యంగా బ్యాం కింగ్, వైద్యం వంటి రంగాల్లో ఏఐ వాడకంపై స్పష్టమైన గైడ్‌లైన్స్ అవసరం. అంతేకాకుండా కొన్ని దశాబ్దాల కిందట భారతదేశం మెడికల్ డ్రగ్ ట్రయల్స్‌కు బలైంది.. గతంలో జరిగిన 'డ్రగ్ ట్రయల్స్' చేదు జ్ఞాపకాలను దృష్టిలో ఉంచుకుని, ఇప్పుడు జరుగుతున్న 'డేటా ట్రయల్స్' విషయంలో ప్రభుత్వం మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉన్నది. ప్రజలు సమాచారాన్ని పంచుకోవడానికి సిద్ధం గా ఉన్నప్పటికీ, ఆ సమాచారం వారి వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.. డేటా సెంటర్లు సహా ఇతర వ్యవస్థల ఏర్పాటుకు ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు ఎన్ని రాయితీలు ఇచ్చినా డేటా దుర్వినియోగం కాకుండా కఠినంగా వ్యవహరించాల్సి ఉన్నది.

# స్టాలిన్‌ను కలిసిన ఓపీఎస్

### తమిళ రాజకీయాల్లో సంచలనం



తమిళనాడు రాజకీయాల్లో మాజీ ముఖ్యమంత్రి ఓ. పన్నీర్‌సెల్వం , ప్రస్తుత ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ భేటీ కావడం రాజకీయ వర్గాల్లో పెను సంచలనంగా మారింది. తమిళనాడు శాసనసభ సమావేశాల సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి ఓ. పన్నీర్‌సెల్వం, ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్‌ను ప్రత్యేకంగా కలిశారు. ఏఐఏడీఎంకే లో చోటు చేసుకున్న అంతర్గత విభేదాల వల్ల ఆ పార్టీ నుంచి బహిష్కరణకు గురైన ఓపీఎస్, తన సొంత వర్గంతో రాజకీయంగా ఒంటరయ్యారు. ఈ క్రమంలో అధికార పక్ష నేతను ఆయన కలవడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. తమిళనాడు శాసనసభలో రెండ్రోజుల పాటు జరిగిన తాత్కాలిక బడ్జెట్ చర్చల సందర్భంగా ఓపీఎస్ మద్దతుదారుడు, ఎమ్మెల్యే ఐయ్యప్పన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ము.క. స్టాలిన్ మళ్లీ విజయం సాధించి, తమిళనాడు ముఖ్యమంత్రి కావాలని ఆయన ఆకాంక్షించారు. అంతేకాకుండా, పురట్చి తలైవర్ ఎంజీఆర్, పురట్చి తలైవి అమ్మ జయలలిత ఆశీస్సులతో స్టాలిన్ మరోసారి ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నట్లు తెలపడం అందరినీ ఆశ్చర్యపరిచింది. శాసనసభ సమావేశాల ముగింపు సందర్భంగా ముఖ్యమంత్రి స్టాలిన్‌ను కలిసిన ఓపీఎస్, అనంతరం మీడియాతో మాట్లాడారు. డీఎంకే ఐదేళ్ల పాలన అత్యంత అద్భుతంగా ఉందని కొనియాడారు. అందుకే ఉదయాన్నే ముఖ్యమంత్రిని కలిసి అభినందనలు తెలిపానని చెప్పారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న పరిస్థితులను బట్టి చూస్తే మళ్లీ డీఎంకే అధికారంలోకి వచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని ఆయన విశ్లేషించారు. తన మద్దతుదారు ఐయ్యప్పన్ అసెంబ్లీలో మాట్లాడిన మాటలు ప్రజల మనోగతానికి ప్రతిరూపమని ఓపీఎస్ సమర్థించారు. మీరు డీఎంకేలో చేరుతారా? అని విలేకరులు అడిగిన ప్రశ్నకు ఓపీఎస్ స్పందిస్తూ.. కొంతకాలం వేచి చూడండి అని బదులిచ్చారు. ఈ సమాధానం ఆయన పార్టీ మారబోతున్నారనే అనుమానాలకు మరింత బలం చేకూర్చింది. మూడు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసి, జయలలిత మరణం తర్వాత ఏఐఏడీఎంకే నుండి బహిష్కరణకు గురైన ఓపీఎస్.. 'ధర్మయుద్ధం' చేసినా, 'హక్కుల పునరుద్ధరణ కమిటీ' పెట్టి పోరాడినా ఆశించిన ఫలితం దక్కలేదు. ఆయన ప్రధాన అనుచరులంతా ఒక్కొక్కరుగా ఇతర పార్టీల్లో చేరిపోగా, ఇప్పుడు ఆయన వద్ద మిగిలింది కేవలం ఎమ్మెల్యే ఐయ్యప్పన్ మాత్రమే. ఎటు వెళ్లాలో తెలియని స్థితిలో, రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికి ఓపీఎస్ డీఎంకే వైపు మొగ్గు చూపుతున్నారా అనే సందేహం రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. దీనికి సంబంధించిన స్పష్టత అతి త్వరలోనే వచ్చే అవకాశం ఉంది.

## కాంగ్రెస్ అగ్నిపరీక్ష గా

# ఐదు రాష్ట్రాల ఎన్నికలు



పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడు, అసోం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికలు వచ్చే ఏప్రిల్/మే నెలల్లో జరగనున్నాయి. చాలా కాలంగా కాంగ్రెస్ పార్టీ గెలుస్తామని అనుకున్న రాష్ట్రాల్లో కూడా ఓడిపోతోంది. రాను రాను ఆ పార్టీ పరిస్థితి దిగజారుతోంది. ఇలాంటి సమయంలో మరో ఐదు రాష్ట్రాల ఎన్నికలు వచ్చాయి. ఈ ఐదు రాష్ట్రాల్లో ముఖాముఖి, కూటములుగా తలపడే పరిస్థితులు ఉన్నాయి. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ వరుస ఓటములతో సతమతమవుతున్న వేళ, ఈ ఎన్నికలు ఆ పార్టీ ఉనికికి ,ప్రతిపక్ష కూట ఐక్యతకు అగ్నిపరీక్షగా మారాయి. పశ్చిమ బెంగాల్‌లో మరోసారి తృణమూల్ కాంగ్రెస్, బీజేపీ మధ్య ముఖాముఖి పోరు నెలకొంది. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ తన సంక్షేమ పథకాలు , బెంగాలీ అస్తిత్వంపై నమ్మకం పెట్టుకోగా, ప్రభుత్వ వ్యతిరేకత, అవినీతి ఆరోపణలను బీజేపీ తన ప్రధాన అస్త్రాలుగా మార్చుకుంది. ఇక్కడ కాంగ్రెస్, వామపక్షాలతో కలిసి పోటీ చేస్తున్నప్పటికీ, ప్రధాన పోటీ మాత్రం టీఎంసీ–బీజేపీ మధ్యే ఉండేలా కనిపిస్తోంది. ముస్లిం ఓట్ల సమీకరణ ఇక్కడ గెలుపోటములను శాసించనుంది. మమతా బెనర్జీ ఎంతో నమ్మకంగా ఉన్నప్పటికీ.. బీజేపీ కూడా గెలిచి చూపిస్తామన్న ధీమాతో ఉంది. తమిళనాడులో అధికార డీఎంకే కూటమి బలంగా ఉన్నప్పటికీ, నటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం రాకతో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. అన్నా డీఎంకే తన కోల్పోయిన వైభవాన్ని చాటుకోవాలని చూస్తుంటే, బీజేపీ తన ఓటు బ్యాంకును పెంచుకోవడానికి తీవ్రంగా శ్రమిస్తోంది. కాంగ్రెస్ ఇక్కడ డీఎంకేపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఉంది. సీట్ల సర్దుబాటు విషయంలో డీఎంకే ఈసారి కఠినంగా వ్యవహరించే అవకాశం ఉండటంతో కాంగ్రెస్‌కు ఇది సవాలుగా మారింది. త్రిముఖ పోరులో డీఎంకేకు లాభం కలుగుతుందన్న అంచనాలు వస్తున్నాయి. సాధారణంగా కేరళలో ఐదేళ్లకోసారి ప్రభుత్వం మారుతుంది, కానీ గత ఎన్నికల్లో పినరయి విజయన్ ఆ సంప్రదాయాన్ని బ్రేక్ చేశారు. ఇప్పుడు వరుసగా మూడోసారి అధికారం దక్కించుకోవాలని ఎల్‌డిఎఫ్ చూస్తోంది. కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ కి ఇది చావో రేవో లాంటి ఎన్నిక. ఒకవేళ ఇక్కడ కూడా కాంగ్రెస్ ఓడిపోతే, జాతీయ స్థాయిలో ఆ పార్టీ నైతిక స్థైర్యం పూర్తిగా దెబ్బతింటుంది. అటు బీజేపీ కూడా క్రైస్తవ ఓటర్లను ఆకట్టుకుంటూ ఇక్కడ బలపడాలని చూస్తోంది. ప్రియాంకా గాంధీ వాయనాడ్ నుంచి ఎంపీగా ఉండటంతో గెలుపు సాధించడం ప్రతిష్టాత్మకంగా మారింది. అసోంలో ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ తిరుగులేని నాయకుడిగా ఎదిగారు. అభివృద్ధి , హిందుత్వ నినాదాలతో బీజేపీ మూడోసారి అధికారంపై కన్నేసింది. కాంగ్రెస్ పార్టీ ఇక్కడ అంతర్గత కుమ్ములాటలతో ఇబ్బంది పడుతోంది. పైగా కీలక నేతలు బీజేపీలో చేరడం ఆ పార్టీకి పెద్ద దెబ్బ. ఏఐయుడిఎఫ్ వంటి పార్టీలతో పొత్తులు కుదిరితేనే కాంగ్రెస్ ఇక్కడ గట్టి పోటీ ఇచ్చే అవకాశం ఉంది, లేదంటే బీజేపీకి మార్గం సుగమం అవుతుంది.పుదుచ్చేరిలో ఎన్. రంగస్వామి నేతృత్వంలోని ఏఐఎన్ఆర్సీ , బీజేపీ కూటమి అధికారాన్ని నిలబెట్టుకోవాలని చూస్తోంది. గతంలో ఇక్కడ కాంగ్రెస్ బలంగా ఉండేది, కానీ నేతల వలసలు ఆ పార్టీని బలహీనపరిచాయి. ఇక్కడ కూడా డీఎంకే మద్దతుతోనే కాంగ్రెస్ తన ఉనికిని చాటుకోవాల్సిన పరిస్థితి ఉంది. చిన్న రాష్ట్రం అయినప్పటికీ, ఇక్కడ గెలుపు కేంద్రంలోని అధికార పార్టీకి ప్రతిష్టాత్మకం.ఈ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి అత్యంత కీలకం. కేరళలో అధికారం దక్కించుకోలేకపోతే, ఆ పార్టీ కేవలం కొన్ని చిన్న రాష్ట్రాలకే పరిమితమయ్యే ప్రమాదం ఉంది. మరోవైపు, బెంగాల్ , తమిళనాడులో ప్రాంతీయ పార్టీలైన టీఎంసీ, డీఎంకేలు గెలిస్తే, ఇండియా కూటమిలో కాంగ్రెస్ ప్రాధాన్యత తగ్గి, మమతా బెనర్జీ , స్టాలిన్ వంటి నేతలు జాతీయ నాయకత్వం వైపు మొగ్గు చూపే అవకాశం ఉంది. 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందు ఈ ఐదు రాష్ట్రాల ఫలితాలు దేశ రాజకీయ గమనాన్ని మార్చనున్నాయి.

# హిట్ అండ్ రన్ రాజకీయాల్లో ప్రతిపక్ష పార్టీలు

"నిజమైన ప్రతిపక్షం ప్రభుత్వానికి శత్రువు కాదు, ప్రజల పక్షాన నిలబడి ప్రభుత్వాన్ని నిలదీసే ఒక జాగృత శక్తి "ప్రజాస్వామ్యం అంటే కేవలం ఎన్నికలు జరగడం, మెజారిటీ వచ్చిన వారు పాలించడం మాత్రమే కాదు. అధికార పక్షం బాధ్యతారాహిత్యంగా వ్యవహరించినప్పుడు కళ్ళెం వేసే ప్రతిపక్షం ఉండటం ఆ వ్యవస్థకు ప్రాణవాయువు వంటిది. కానీ, నేడు తెలుగు రాష్ట్రాల్లో ప్రతిపక్షం అంటే కేవలం ప్రభుత్వ వ్యతిరేక ప్రచారం అనే సంకుచిత అర్థానికి పరిమితమైపోయింది. క్షేత్రస్థాయిలో పోరాటాల కంటే, సోషల్ మీడియా వేదికగా సాగే ట్రోలింగ్ రాజకీయాలే జ్యమేలుతున్నాయి.ఒకప్పుడు ప్రతిపక్షం అంటే ప్రభుత్వానికి వెన్నులో వణుకు పుట్టించే వ్యవస్థ. అసెంబ్లీలో తార్కికమైన చర్చలు, బయట ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటాలు ఉండేవి. ఒక జీవో విడుదల చేయాలంటేప్రభుత్వం పదిసార్లు ఆలోచించేది. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది.ప్రతిపక్షాలు తాము అధికారంలో లేమన్న విషయాన్ని జీర్ణించుకోలేక, ప్రజల కోసం పోరాడటం కంటే తమ ఉనికిని కాపాడుకోవడమే లక్ష్యంగా పెట్టుకున్నాయి. అధికార పక్షంపై వ్యతిరేకత పెంచితే చాలు, తదుపరి అధికారం తమకే దక్కుతుందనే ఒక రకమైన నెగటివ్ పాలిటిక్స్ భ్రమలో ప్రతిపక్షాలు ఉండిపోతున్నాయి. అభివృద్ధిలో లోపాలను ఎత్తిచూపడం కంటే, వ్యక్తిగత విమర్శలు, అసత్య ప్రచారాల ద్వారా ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టడమే ఏకైక అజెండాగా మారిపోయింది. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది.ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ వాతావరణం ప్రజాస్వామ్య స్ఫూర్తిని ప్రశ్నిస్తోంది. గత ఎన్నికల్లో సుమారు 40 శాతం ఓటు బ్యాంకును, కోటి మందికి పైగా ప్రజల మద్దతును పొందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, కేవలం ప్రతిపక్ష హోదా అనే సాంకేతిక కారణాన్ని సాకుగా చూపి సభకు దూరం కావడం ఆ ఓటర్లను వంచించడమే అవుతుంది. ప్రజాస్వామ్యంలో సంఖ్య కంటే గొంతుక ముఖ్యం. పది మంది ఎమ్మెల్యేలు ఉన్నా, వారు సభలో తార్కికంగా మాట్లాడితే ప్రభుత్వం దిగిరాక తప్పదు. కానీ, వైసీపీ నాయకత్వం కేవలం తమపై వస్తున్న కేసుల నుండి రక్షణ పొందడానికో లేదా తమ సొంత రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికో పరిమితమవుతోంది. తమ ఐదేళ్ల పాలనలో జరిగిన తప్పిదాలను సమీక్షించుకుని ప్రజల వద్దకు వెళ్లాల్సింది పోయి, అధికార పక్షం మమ్మల్ని ఇబ్బంది పెడుతోంది అనే విక్టిమ్ కార్డ్ వేసుకోవడం వల్ల ప్రజల్లో సానుభూతి కంటే అసహనమే ఎక్కువగా కనిపిస్తోంది. ప్రస్తుతం వైసీపీ చేస్తున్న పోరాటాలన్నీ ఎక్కువగా కేసుల చుట్టూ, పార్టీ నేతల రక్షణ చుట్టూనే తిరుగుతున్నాయి. సూపర్ సిక్స్ హామీల అమలు , ప్రభుత్వ వైఫల్యాల మీద నిర్మాణాత్మక విమర్శలు చేయడం కంటే, సోషల్ మీడియాలో బురద చల్లడం పైనే ఆ పార్టీ యంత్రాంగం ఎక్కువ దృష్టి పెడుతోంది. రాజకీయం అంటే అధికారం కోసం చేసే ఆరాటం మాత్రమే కాదు, అధికారం లేనప్పుడు ప్రజల కోసం చేసే పోరాటం అన్న సూత్రాన్ని విస్మరించి, కేవలం డిజిటల్ వేదికలకే పరిమితం కావడం వల్ల క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్ నీరసించిపోతోంది. అసెంబ్లీ అనేది ప్రజా సమస్యల చర్చా వేదిక, అక్కడ గొంతు వినిపించకపోతే ప్రతిపక్షంగా తన ఉనికిని కోల్పోయినట్టే అవుతుంది.మరోవైపు, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి పార్లమెంటులో బేషరతుగా మద్దతు ఇస్తూ, రాష్ట్రంలో అదే పార్టీ భాగస్వామిగా ఉన్న కూటమి ప్రభుత్వంపై పోరాడుతున్నామని చెప్పడం ప్రజల్లో తీవ్ర అయోమయానికి దారితీస్తోంది. ఈ ద్వంద్వ వైఖరి పరోక్షంగా అధికార పక్షానికే సహకరించడమే అవుతుంది. ఢిల్లీలో దోస్తీ, గల్లీలో కుస్తీ అన్నట్లుగా సాగుతున్న ఈ రాజకీయం ఆ పార్టీ విశ్వసనీయతను దెబ్బతీస్తోంది. నాయకుడి బలం గెలిచినప్పుడు కాదు, ఓడిపోయినప్పుడు ఎలా నిలబడ్డాడు అనే దానిపైనే ఆధారపడి ఉంటుంది..మరోవైపు, అధికార పక్షాన్ని విమర్శించే క్రమంలో వైసీపీ అనుసరిస్తున్న తీరు అత్యంత వివాదాస్పదంగా మారుతోంది. ప్రజా సమస్యలపై నిర్మాణాత్మక చర్చలు జరపాల్సింది పోయి, ముఖ్యమంత్రిని, మంత్రులను , వారి కుటుంబ సభ్యులను వ్యక్తిగతంగా దూషించడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలని చూడటం అప్రజాస్వామికం. ఇటువంటి చర్యలు రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్యలను సృష్టించడమే కాకుండా, కులాల మధ్య చిచ్చు పెట్టి రాజకీయంగా పబ్బం గడుపుకోవాలనే వ్యూహాన్ని బయటపెడుతున్నాయి. విమర్శలు విధానాల మీద ఉండాలి కానీ, వ్యక్తుల మీద కాదు అనే కనీస రాజకీయ ధర్మాన్ని విస్మరించి, బూతు పురాణాలతో రాజకీయ కలుషితం చేయడం వల్ల ప్రజల్లో అసహనం పెరుగుతోంది. దీన్ని వైసీపీ గుర్తించడం లేదు.తెలంగాణ రాజకీయ యవనికపై ఒకప్పుడు సింహగర్జన చేసిన గులాబీ దళం, నేడు ప్రతిపక్ష పాత్రను పోషించడంలో పూర్తిగా వెనుకబడిపోయింది. మేము ఇంకా సమర్థవంతమైన ప్రతిపక్షంగా అవతరించలేదు అని ఆ పార్టీ కీలక నేత జగదీష్ రెడ్డి స్వయంగా అంగీకరించడం వారి దైన్యస్థితికి అద్దం పడుతోంది. పదేళ్ల పాటు పరిపాలించిన అనుభవం ఉన్న పార్టీ, ప్రజా సమస్యలపై పదునైన బాణాలను సంధించాల్సింది పోయి, ఇంకా బాధ్యతారాహిత్యంతో కాలం గడుపుతోంది. ప్రజలు మిమ్మల్ని ప్రతిపక్షంలో కూర్చోబెట్టింది కేవలం ఫామ్ హౌస్‌లకే పరిమితం కావడానికి కాదు, అసెంబ్లీలో ప్రజా గొంతుకగా నిలవడానికి అని ఇప్పటికీ గుర్తించలేకపోతున్నర్లు. బీఆర్ఎస్ ప్రస్తుతం అనుసరిస్తున్న తీరు క్షేత్రస్థాయిలో ప్రజల కష్టాల్లో పాలుపంచుకోవడం కంటే, సోషల్ మీడియా వేదికగా అబద్ధాలను వందసార్లు ప్రచారం చేసి నిజం చేయాలనే వ్యూహంపైనే ఎక్కువగా ఆధారపడుతున్నట్లుగా కనిపిస్తోంది. ప్రభుత్వంపై వ్యతిరేకత వస్తుందని ఆశించడం రాజకీయాల్లో సహజమే, కానీ ఆ వ్యతిరేకతను తమ వైపు తిప్పుకునే విశ్వసనీయత ను వారు కోల్పోతున్నారు.రాజకీయాలు అంటే కేవలం అధికార మార్పిడి కోసం చేసే కుతంత్రాలు కాకూడదు. అవి ప్రజా సేవ కోసం చేసే యజ్ఞం కావాలి. అప్పుడే తెలుగు రాష్ట్రాల కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయి. తెలుగు రాష్ట్రాలకు ఇప్పుడు కావాల్సింది కేవలం విమర్శించే ప్రతిపక్షం కాదు, పరిష్కారాలను చూపే ప్రతిపక్షం. ప్రభుత్వం చేసే ప్రతి పనిని వ్యతిరేకించడం కాకుండా, అభివృద్ధి పనుల్లో లోపాలను వేలెత్తి చూపిస్తూ, దానికి మెరుగైన ప్రత్యామ్నాయాలను సూచించగలిగే మేధోశక్తి ప్రతిపక్షాలకు ఉండాలి. అసెంబ్లీని గౌరవించడం, సభా మర్యాదలను పాటించడం, ప్రజా సమస్యలపై లోతైన అధ్యయనం చేయడం ద్వారా మాత్రమే ప్రతిపక్షాలు ప్రజల మద్దతును తిరిగి పొందగలవు. రాజకీయం అంటే కేవలం ఎన్నికల మేనేజ్‌మెంట్ కాదు, అది ప్రజల జీవితాలను మార్చే ఒక గొప్ప సాధనం. ఈ నిజాన్ని గుర్తించి ప్రతిపక్షాలు తమ వైఖరిని మార్చుకోకపోతే, భవిష్యత్తులో వారు ప్రజల నుండి మరింత దూరం కావడమే కాకుండా, ప్రజాస్వామ్య వ్యవస్థే ప్రమాదంలో పడే అవకాశం ఉంది. సమర్థవంతమైన ప్రతిపక్షం లేని రాష్ట్రం దిక్సూచి లేని నావ లాంటిది, కాబట్టి తెలుగు రాష్ట్రాల ప్రతిపక్షాలు తమ అస్తిత్వ పోరాటాన్ని పక్కన పెట్టి ప్రజా హితం కోసం పోరాడాల్సిన సమయం ఆసన్నమైంది. లేకపోతే.. ఓటములకు కారణాలు చెప్పుకోవడానికి అలవాటు పడాల్సిందే.

వార్తాతరంగాలు

శనివారం 21 ఫిబ్రవరి 2026

# రేషన్ బియ్యం నాణ్యతలో రాజీ పడొద్దు

## పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర

**హైదరాబాద్ ఫిబ్రవరి 21:** పేద ప్రజలు కూడా సంపన్నులతో సమానంగా సన్నబియ్యంతో భోజనం చేయాలన్న మహత్తర సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం సరఫరా చేస్తున్నట్లు పౌరసరఫరాల శాఖ ప్రధాన కార్యదర్శి మరియు ఎక్స్-ఆఫిషియో కమిషనర్ ఎం. స్టీఫెన్ రవీంద్ర, తెలిపారు. బియ్యం నాణ్యత విషయంలో ఏమాత్రం రాజీ పడకూడదని ఆయన అధికారులను కఠినంగా ఆదేశించారు. హైదరాబాద్‌లోని బాగ్ లింగంపల్లిలో ఉన్న సివిల్ సప్లైస్ గోదామును కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. దాదాపు రెండు గంటలపాటు గోదాములో నిల్వ ఉన్న బియ్యం సంచులను యాదృచ్ఛికంగా తెరిపించి నాణ్యతను స్వయంగా పరిశీలించారు. బియ్యం లో నూకల శాతం, తేమ శాతం వంటి అంశాలపై అధికారులను ప్రశ్నించి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. గోదాముకు వచ్చిన బియ్యాన్ని స్వీకరించే



దశలోనే క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాలని, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిల్వలను తిరస్కరించాలని గోదాం ఇన్‌చార్జీలకు సూచించారు. ఈ విషయంలో ఏం మాత్రం రాచి పడిన కఠినంగా వ్యవహరిస్తానని హెచ్చరించారు. ప్రజలకు చేరే ప్రతి బియ్యం గింజ నాణ్యమైనదిగా ఉండేలా బాధ్యతగా వ్యవహరించాలన్నారు. సరఫరా వ్యవస్థలో పారదర్శకత కోసం స్టాక్ రిజిస్టర్లు, ఇన్‌వర్డ్--అవుట్‌వర్డ్ వివరాలు, రవాణా రికార్డులను కమిషనర్ పరిశీలించారు. రేషన్ షాపులకు బియ్యం సరఫరాలో ఎలాంటి ఆలస్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గోదాములో పని చేస్తున్న హమాలీలతో మాట్లాడిన కమిషనర్ గారు వారి పనివాతావరణం, సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. "ప్రజల విశ్వాసమే మా బలం. ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలంటే నాణ్యతే ప్రమాణం కావాలి. రేషన్ బియ్యం విషయంలో చిన్న తప్పిదం కూడా సహించము," అని కమిషనర్ గారు స్పష్టం చేశారు. ఈ తనిఖీ లో హైదరాబాద్ జిల్లా మేనేజర్ కె. సాయి అరుణ్, అదనపు జిల్లా మేనేజర్ దీప్తి, గోదాం ఇన్‌చార్జీలు గోపాలకృష్ణ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇది ట్రైలర్ మాత్రమే..

## షబ్బీర్ అలీకి వెంకటరమణా రెడ్డి స్ట్రాంగ్ వార్నింగ్

**కామారెడ్డి, ఫిబ్రవరి 21 :** కాంగ్రెస్ సీనియర్ నేత షబ్బీర్ అలీపై( కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణా రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తనను అవినీతిలో కింగ్ అన్నారని.. తనపై ఏ ఒక్క అవినీతి బయటపడినా స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా చేస్తానని స్పష్టం చేశారు. కామారెడ్డి వేదికగా మీడియాతో మాట్లాడిన ఆయన.. సీఎం రేవంత్ రెడ్డి ఓడిపోయిన కామారెడ్డిలో షబ్బీర్ అలీ అన్నీ తానే అంటున్నారని చెప్పుకొచ్చారు. తనను కాంగ్రెస్ నుంచి కౌన్సిలర్, జడ్పీటీసీ చేశామని అన్నారని.. ఆయన కామారెడ్డికి చేసిందేమీ లేదని విమర్శించారు.

వైఎస్ నా రాజకీయ గురువు..దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఇచ్చిన అవకాశంతో తాను కాంగ్రెస్ నుంచి గతంలో గెలిచానని ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి ప్రస్తావించారు. 'వైఎస్ రాజశేఖర్ రెడ్డి నా రాజకీయ గురువు. నువ్వు మా తండ్రి వద్ద చేతులు కట్టుకుని నిలబడ్డావ్. నువ్వు కట్టిన ఐదు అంతస్తుల భవనానికి మున్సిపల్ అనుమతి లేదు. ఈ నియోజకవర్గం నీ సొంతం కాదు. నీవల్లే నేను కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చాను. అసెంబ్లీలో హుందాగా ఉండాలని మాట్లాడిన నన్ను ఇలా చీప్‌గా మాట్లాడేలా చేశారు. నాపై నిందలేస్తే ఎలా ఉంటుందో ఈ రోజు చూశారు. ఇది ట్రైలర్ మాత్రమే.. అసలు సినిమా ముందుంది. నాపై బెదిరింపులకు పాల్పడుతున్నారని ఎస్పీకి ఫిర్యాదు చేశా. మా వాళ్లు ఎవరూ రావద్దని నేను చెబితే మీరు వేలాదిగా తరలిరావాలని మెసేజ్‌లు పెట్టారు. రేపటి నుంచి గ్రామాలకు వస్తా, ఎవరు అడ్డుకుంటారో చూస్తా. బాన్సువాడలో గొడవ జరిగితే మేం మాట్లాడి సద్దుమణిగేలా చేశాం' అని ఎమ్మెల్యే వెంకటరమణా రెడ్డి తెలిపారు.



**నాకేం జరిగినా సీఎందే బాధ్యత..**

263 ఎకరాల ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఎలాంటి అక్రమాలు లేవు. నేను ఒక్క గజం అమ్మినా నిరూపించాలని వెంకటరమణా రెడ్డి సవాల్ విసిరారు. 'దొంగలెవరో ప్రజలకు తెలుసు. నాకేం జరిగినా సీఎం రేవంత్ రెడ్డిదే బాధ్యత. రేపటి నుంచి యుద్ధమే. ఇది సీఎంకు, నాకూ మధ్య యుద్ధం. కలెక్టర్ వద్ద కూర్చుందాం. కాలేజీ కమిటీ పేరిట ఎఫ్‌డీలు ఉన్నాయి. అరోరా ఇంజినీరింగ్ కాలేజీలో జరిగిన అక్రమాలపై పోరాడాం. తెలంగాణ యూనివర్సిటీని కామారెడ్డిలో పెట్టమని కోరాం. అప్పుడు మంత్రిగా ఉన్న షబ్బీర్ అలీ ఏం చేశారు. తప్పుడు మాటలు మాట్లాడితే ఊరుకోం. సోమవారం కలెక్టర్ వద్దకు వెళ్దాం. నాపై ఒక్క తప్పు తేలినా కాళ్లు పట్టుకుంటా, పదవి వదులుకుంటా. రమ్మంటే సీఎంఓకు వస్తా' అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

# ఆ ఒక్కరూ ఎవ్వరు...?

- మొదటి పేజీ తరువాయి

వారితో కలిపి మొత్తం బలం 75 దాటడంతో, ఇద్దరు అభ్యర్థులను గెలిపించుకోవడానికి అవసరమైన 82 ఓట్లకు కాంగ్రెస్ అత్యంత సమీపంలో ఉంది. మజ్లిస్ మద్దతు ఎటూ కాంగ్రెస్ పార్టీకే లభిస్తుంది. అందుకే రెండు స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందిప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పరిస్థితి ఈ ఎన్నికల్లో కొంత ఇబ్బందికరంగానే ఉంది. ఆ పార్టీకి ప్రస్తుతం ఉన్న 27 మంది ఎమ్మెల్యేల సంఖ్యాబలం ఒక సీటు గెలవడానికి కూడా సరిపోదు. ఎనిమిది మంది ఎమ్మెల్యేలు ఉన్న బీజేపీ ఓటింగ్ కు హాజరు కాకపోవచ్చు. పైగా, రెండో ప్రాధాన్యత ఓట్ల విషయంలోనూ అధికార పక్షానికే స్పష్టమైన ఆధిక్యం ఉండటంతో బీఆర్ఎస్ అభ్యర్థిని నిలబెట్టినా పోటీ ఇవ్వడం కష్టమే. కాంగ్రెస్ అధిష్టానం ఒక సీటును జాతీయ స్థాయి నేతకు, మరో సీటును సామాజిక సమీకరణాల దృష్ట్యా రాష్ట్ర స్థాయి నేతకు కేటాయించే అవకాశం ఉంది. అయితే ఆ ఒక్క సీటు ఎవరికి అన్నది ఇంకా తేలలేదు. జగ్గారెడ్డి మాత్రం వీహెచ్ కు, కుసుమ కుమార్ లకు ఇవ్వాలంటూ ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. అయితే పార్టీ భవిష్యత్ ప్రయోజనాలు, రాజకీయ సమీకరణాలను దృష్టిలో పెట్టుకుని అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని అంటున్నారు. మరి ఆ ఒక్కరు ఎవరో?

# పరిషత్ లు రద్దు దిశగా అడుగులు

- మొదటి పేజీ తరువాయి

రేవంత్ ప్రభుత్వం పంచాయతీ రాజ్‌శాఖను ఆదేశించింది. ఈ నివేదికలో ఈ వ్యవస్థల వల్ల జరుగుతున్న లాభనష్టాలు, రద్దు చేస్తే కలిగే పరిణామాలు , ఇతర రాష్ట్రాల్లోని పరిస్థితులను పొందుపరచనున్నారు. ప్రభుత్వం ఈ దిశగా చర్యలు వేగంగా తీసుకుంటున్నా చట్టపరంగా, రాజ్యాంగపరంగా ఈ నిర్ణయం అమలు చేయడం అంత సులభం కాదని తెలుస్తోంది. దేశంలో పంచాయతీరాజ్ వ్యవస్థ అనేది 73వ రాజ్యాంగ సవరణ ద్వారా దేశవ్యాప్తంగా ఒకే తీరుగా అమలులోకి వచ్చింది. రాజ్యాంగంలోని నిబంధనల ప్రకారం, రాష్ట్రాలు తమ ఇష్టానుసారం మూడు అంచెల వ్యవస్థలో మార్పులు చేయడం సాధ్యం కాదు. ఎంపీటీసీ, జడ్పీటీసీలను రద్దు చేయాలంటే కేంద్ర ప్రభుత్వం ద్వారా రాజ్యాంగ సవరణ తప్పనిసరి అని నిపుణులు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే నివేదిక ఆధారంగా, ఈ ప్రతిపాదన చట్టపరంగా, రాజకీయంగా ఎంత వరకు సాధ్యమవుతుందనే దానిపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనుంది. కేవలం రాష్ట్ర స్థాయిలో ఒక తీర్మానం చేయడం ద్వారా లేదా ఆర్డినెన్స్ తీసుకురావడం ద్వారా ఈ వ్యవస్థను రద్దు చేయడం కుదరదని ఒక వేళ కేంద్రం సహకరించకపోతే ఇది న్యాయపరమైన చిక్కులకు దారి తీస్తుందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు ఈ వ్యవస్థలో సర్పంచులకు గ్రామంలో నిధులు, విధులు



ఉంటాయి. కానీ ఎంపీటీసీలకు, జెడ్పీటీసీలకు ప్రత్యేకంగా నిధులు గానీ, కార్యాలయాల్లో కనీసం కూర్చునేందుకు సీటు గానీ ఉండటం లేదనే అసంతృప్తి ఉంది. ఒకే గ్రామంలో సర్పంచ్, ఎంపీటీసీ మధ్య తరచూ ఘర్షణ వాతావరణం నెలకొంటోంది. అధికారాల విభజనలో స్పష్టత లేకపోవడం అభివృద్ధికి ఆటంకంగా మారుతోందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీలకు ఓటు హక్కు ఉంది, కానీ సర్పంచులకు లేదు. వ్యవస్థను రద్దు చేయడం ద్వారా ఈ అసమానతలను తొలగించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. అయితే.. ఈ నిర్ణయం అమలు చేయడం అంత సులభం కాదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ వ్యవస్థలు 73, 74 రాజ్యాంగ సవరణల ద్వారా ఏర్పడ్డాయి. వీటిని రద్దు చేయాలంటే కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో చట్టసవరణ చేయాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం కేవలం విన్నపం మాత్రమే చేయగలదు. రాష్ట్రవ్యాప్తంగా వేల సంఖ్యలో ఉన్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ పదవులను రద్దు చేస్తే, పార్టీ క్యాడర్‌లో అసంతృప్తి జ్వాలలు ఎగిసే అవకాశం ఉంది. రాజకీయంగా ఎదిగేందుకు అవకాశం ఉన్న ఈ మెట్లను తొలగిస్తే రాజకీయ నిరుద్యోగం పెరుగుతుందని ఆందోళన వ్యక్తమవుతోంది. పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీది. ఇప్పుడు అదే పార్టీ అధికారంలో ఉండి ఆ వ్యవస్థలోని భాగాలను రద్దు చేస్తే దేశవ్యాప్తంగా తప్పుడు సంకేతాలు వెళ్తాయనే వాదన కూడా పార్టీలో వినిపిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా జెడ్పీటీసీగా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి నేడు ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగారు. కాబట్టి ఆయన ఈ వ్యవస్థ ప్రాముఖ్యతను గుర్తిస్తారా లేదా పాలనా సౌలభ్యం కోసం రద్దు వైపు మొగ్గు చూపుతారా అనేది వేచి చూడాలి. ఫిబ్రవరి 23న జరగబోయే కేబినెట్ భేటీలో ఈ అంశంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఒకవేళ ప్రభుత్వం ఈ నిర్ణయానికే కట్టుబడితే, ఇది తెలంగాణ రాజకీయాల్లో ఒక పెను మార్పుగా నిలుస్తుం

# కొత్త నేతలను వెతికే పనిలో కాంగ్రెస్...


- మొదటి పేజీ తరువాయి



చేశారు. రాష్ట్రంలో సుమారు 80 శాతం మంది ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ఆస్వాదిస్తున్నారని, మున్సిపల్ ఎన్నికల ఫలితాలే దానికి నిదర్శనమని ఖర్గే కొనియాడారు. ఇప్పటి వరకు అన్ని సానుకూలంగా సాగాయని, భవిష్యత్‌లో కూడా ఇదే పట్టుదలతో మంచి ఫలితాలు సాధించాలని నాయకత్వానికి సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలోనే మంత్రులు తమ శాఖల పనితీరును, అమలు చేస్తున్న కీలక పథకాలను అధిష్ఠానానికి వివరించారు. సమ్మక్క సారలమ్మ జాతరను ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా, విజయవంతంగా నిర్వహించిన తీరును మంత్రి సీతక్క వివరించారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ, వరి ఉత్పత్తిలో తెలంగాణ అగ్రస్థానంలో ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నివేదిక ఇచ్చారు. పేదలకు ఇళ్ల నిర్మాణం, భూభారతి కార్యక్రమం ద్వారా చేపట్టిన భూసర్వే వివరాలను మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో పామాయిల్ తోటల పెంపకం, దాని వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వివరించారు. గిగ్ వర్కర్స్ కోసం ప్రభుత్వం తీసుకురాబోతున్న కొత్త విధానం గురించి మంత్రి వివేక్ వివరించగా, ఈ చట్టాన్ని వీలైనంత త్వరగా తీసుకురావాలని రాహుల్ సూచించారు. తెలంగాణ సంస్కృతికి ప్రతిబింబమైన సమ్మక్క- సారలమ్మ జాతర నిర్వహణపై రాహుల్ గాంధీ ప్రత్యేక ఆసక్తి కనబరిచారు. ఈ జాతర చరిత్ర, ప్రభుత్వం అక్కడ చేపట్టిన కొత్త నిర్మాణాల గురించి తెలుసుకున్న ఆయన, సమ్మక్క-సారలమ్మపై జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేలా ఒక సినిమా తీస్తే బాగుంటుందని సలహా ఇచ్చారు. జాత విజయవంతం కావడంపై అభినందిస్తూ తనను కూడా ఆహ్వానించి ఉంటే వచ్చే వాళ్లమని అన్నారు. పాలనతో పాటు పార్టీ అంతర్గత వ్యవహారాలపై కూడా ఢిల్లీ వేదికగా చర్చ జరిగింది. ఇటీవల ప్రభుత్వం, ముఖ్యమంత్రిపై విమర్శలు చేసిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అంశంపై అధిష్ఠానం ఆరా తీసింది. త్వరలోనే ఆయనను ఢిల్లీకి పిలిపించి మాట్లాడతామని అగ్రనేతలు అన్నట్టు తెలుస్తోంది. అలాగే రాజ్యసభ ఎన్నికల అంశంపై మరో రెండు రోజుల్లో ముఖ్యమంత్రి, పీసీసీ చీఫ్‌తో విడిగా చర్చించనున్నారు. పార్టీని బలోపేతం చేసే క్రమంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో పదివేల కంటే ఎక్కువ ఓట్ల తేడాతో ఓడిపోయిన నియోజకవర్గాల్లో ఇన్‌ఛార్జులను మార్చాలని హైకమాండ్ ఆదేశించింది. మరోవైపు కరీంనగర్ కార్పొరేషన్ ఫలితాల విషయంలో మాత్రం అసంతృప్తి వ్యక్తం చేసింది. ఆ స్థానాన్ని ఎందుకు సీరియస్‌గా తీసుకోలేదని రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్ ప్రశ్నించగా, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు ఇచ్చిన వివరణ పట్ల వారు పూర్తి స్థాయిలో సంతృప్తి చెందలేదని తెలుస్తోంది. రాష్ట్ర మంత్రివర్గమంతా ఢిల్లీ పర్యటనకు వెళ్లడంపై బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలను మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా ఖండించారు. ఫామ్‌హౌస్ నుంచి పాలన చేయడం తప్పని, జాతీయ పార్టీ నాయకత్వానికి కలవడం ఎలా తప్పు అవుతుందని ఆయన ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఢిల్లీలో పార్టీ కార్యాలయం ఎందుకు నిర్మించిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారెంటీల్లో అత్యధికం ఇప్పటికే అమలు చేస్తున్నామని, కేసీఆర్‌లా తాము ప్రజలను వదిలేసి పోయే రకం కాదని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా మార్చి రెండో వారానికిల్లా నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియ పూర్తి చేయాలని నిర్ణయించారు. మిగిలిన పీసీసీ కార్యవర్గ పోస్టులు, జిల్లా, బ్లాక్ కమిటీలను కూడా అదే గడువులోగా భర్తీ చేస్తామని మహేష్ కుమారు గౌడ్ వెల్లడించారు. ప్రభుత్వం, పార్టీ సమన్వయంతో పని చేయడం వల్లే స్థానిక సంస్థల్లో మంచి ఫలితాలు వచ్చాయని రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ వివరించారు.

## 'ఏఐ'ని అదుపుచేసి ముందుకు వెళ్లాలి..

- మొదటి పేజీ తరువాయి



దేశాన్ని, మాతృభాషను, చదువుకున్న విద్యా సంస్థను, గురువులను మరిచిపోకూడదని అన్నారు. మన కట్టు, బొట్టుకు ప్రాధాన్యత ఇవ్వాలని, తెలుగు భాష గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పాలని అన్నారు. యువత పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సామాజిక అంశాలపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. మన పూర్వీకులు మనకు అందించిన సంప్రదాయాలని భావితరాలకు అందించాలని వ్యాఖ్యానించారు. భారత్ విశ్వగురువు అయినప్పటికీ ఏ దేశం మీదా దండయాత్ర చేయలేదని గుర్తు చేశారు. భారత్ సత్తాను ప్రపంచ వేదికల మీద మన వారు చాటుతున్నారని ప్రశంసించారు. కులం కంటే గుణం మిన్న అనే విషయాన్ని అందరూ గుర్తించాలని అన్నారు. డిగ్రీల కంటే పరిజ్ఞానం ముఖ్యమని వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సాంకేతికతకు ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. భవిష్యత్తులో చాలా రంగాల్లో ఉద్యోగాలు పోయే అవకాశం ఉందని, దీని గురించి మాట్లాడాల్సిన అవసరం ఉందని వెంకయ్యనాయుడు అభిప్రాయపడ్డారు. రాజకీయాల్లో నాయకులు బూతులు విపరీతంగా మాట్లాడుతున్నారని, గత ఎన్నికల్లో బూతులు మాట్లాడిన వారు ఓడిపోయారని వెల్లడించారు. సమాజం కూడా అలాంటి వాళ్లను బహిష్కరించాలని హితవు పలికారు. రామాయణాన్ని అన్ని పాఠ్యపుస్తకాల్లో పొందుపరచాలని అన్నారు. తల్లిదండ్రులు, ఇంట్లోని పెద్దలు తమ పిల్లలకు ఎక్కువ సమయం కేటాయించాలని వెంకయ్యనాయుడు సూచించారు. విద్యార్థులు, యువత ప్రతి దానికి గూగుల్ మీద ఆధారపడుతున్నారని, కానీ వారు దీనిని పక్కన పెట్టి బుర్రకు పని చెప్పాలని సూచించారు.

## నేను పార్టీ అధ్యక్షుడిని అయ్యే నాటికి పార్టీ పరిస్థితి క్లిష్టంగా ఉంది

- మొదటి పేజీ తరువాయి



కూడా కావొచ్చని అన్నారు. నాయకులు ఎప్పుడూ ప్రజల్లో ఉండాలని సూచించారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాదయాత్ర చేసి ప్రజల మధ్య రోజుల తరబడి ఉన్నారని అన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు పాదయాత్ర చేశారని గుర్తుచేశారు. మోతీలాల్ నెహ్రూ దేశం కోసం వేల కోట్ల రూపాయలను ఆ రోజుల్లోనే త్యాగం చేశారని, జవహర్ లాల్ నెహ్రూ జైల్లో ఉన్నారని తెలిపారు. ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ దేశం కోసం ప్రాణాలు అర్పించారని తెలిపారు.

# ఓపెన్ 10th, ఇంటర్ పరీక్షల టైమ్‌టేబుల్ విడుదల..!



**హైదరాబాద్ :** తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ 2026 సంవత్సరానికిగానూ 10వ తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల టైమ్‌టేబుల్‌ను విడుదల చేసింది. పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులు ఇప్పుడు పూర్తి షెడ్యూల్‌ను చూసుకోవాలని సూచించింది. షెడ్యూల్‌ను పూర్తిగా తేదీల వారీగా పరిశీలించుకోవాలని పేర్కొన్నది. తాజా టైమ్‌టేబుల్ ప్రకారం.. పదో తరగతి, ఇంటర్మీడియట్ థియరీ పరీక్షలు ఏప్రిల్ 20వ తేదీ నుంచి 27వ తేదీ వరకు జరగనున్నాయి. ఈ పరీక్షలు ఉదయం మధ్యాహ్నం రెండు షిఫ్టుల్లో జరగనున్నాయి. ఉదయం ఫిఫ్ట్ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, మధ్యాహ్నం షిఫ్ట్ మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సాగనుంది. ఆ తర్వాత ఏప్రిల్ 28 నుంచి మే 5వ తేదీ వరకు ఇంటర్నల్స్, ప్రాక్టికల్ పరీక్షలు జరగనున్నాయి.

# కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద బిజెపిఐ కాంగ్రెస్ నాయకుల మధ్య హై డ్రామా..

ప్రకాశం జిల్లా ఒంగోలులోని స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద బిజెపి నాయకుల కాంగ్రెస్ నాయకుల మధ్య హైడ్రామా నెలకొంది. దీనికి ఒంగోలు తాలూకా పోలీసులు బిజెపి పక్షాన నిలబడి కాంగ్రెస్ నాయకుల పై దాడి చేశారని ఎన్ ఐ సి యు నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ముట్టడి కార్యక్రమంలో భాగంగా శనివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద బిజెపి నాయకులు రాహుల్ గాంధీ డౌన్ డౌన్ అంటూ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలోకి చొరబడే ప్రయత్నం చేస్తున్న క్రమంలో కాంగ్రెస్ పార్టీ నేషనల్ యూత్ నాయకులు బయటకు వచ్చి పీఎం మోడీ కాంప్రమైజ్ అంటూ నినాదాలు చేస్తూ బయటికి వచ్చే క్రమంలో తాలూకా సిఐ కాంగ్రెస్ పార్టీ యువజన విద్యార్థి సంఘం నాయకుల పై దాడి చేసి కార్యాలయంలో నిర్బంధించారు. అనంతరం బిజీ వైపి నాయకులు రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను తగలబెట్టే ప్రయత్నం చేయగా పోలీసులు ఉన్నారు. ఇదంతా హై డ్రామా అని అక్కడి స్థానికులు చర్చించుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షులు కాంగ్రెస్ కార్యాలయం ఎదుట వున్న తాలూకా సిఐను "మా వాళ్ళను ఎందుకు కొట్టారని"..బిజెపి నాయకులకు మీరు అండగా ఉన్నారని ప్రశ్నించారు. దీంతో సీఐ బదులిస్తూ మిమ్మల్ని ఎవరు బయటకు రమ్మన్నారని.. మీరు బయటకు వస్తే మేము చూస్తూ ఊరుకోవాలా అంటూ కాంగ్రెస్ విద్యార్థి సంఘ నాయకులకు బదులిచ్చారు.

# ఏసీబీ వలలో మంథని సబ్ రిజిస్టాటర్



**పెద్దపెల్లి** పెద్దపల్లి జిల్లాలోని మంథనిలో ఓ ప్రభుత్వ అధికారి లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. మంథని సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న కాసర్ల రాజేందర్, భూమి రిజిస్ట్రేషన్ కోసం లంచం స్వీకరిస్తుండగా అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే, ఒక వ్యక్తి కొనుగోలు చేసిన భూమిని రిజిస్ట్రేషన్ చేసేందుకు సబ్ రిజిస్ట్రార్ రాజేందర్ రూ. 16,500 లంచం డిమాండ్ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో వలపన్నారు. రాజేందర్ సూచన మేరకు, బాధితుడు ఆ డబ్బును రషీద్ అనే ప్రైవేట్ డాక్యుమెంట్ రైటర్‌కు మంథని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇస్తుండగా ఏసీబీ అధికారులు వారిని పట్టుకున్నారు.ఈ సందర్భంగా ఏసీబీ అధికారులు ప్రజలకు కీలక సూచన చేశారు. ఏ ప్రభుత్వ అధికారి అయినా లంచం డిమాండ్ చేస్తే, తమ టోల్ ఫ్రీ నంబర్ 1064కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు. వాట్సాప్ (9440446106), ఫేస్‌బుక్, అధికారిక వెబ్‌సైట్ ద్వారా కూడా తమను సంప్రదించవచ్చని తెలిపారు. ఫిర్యాదుదారుల వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

# దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుళ్ల ఘటనకు 13 ఏళ్లు



**హైదరాబాద్, ఫిబ్రవరి 21:** దిల్‌సుఖ్‌నగర్ బాంబు పేలుళ్ల ఘటనకు నేటితో 13 ఏళ్ళు పూర్తి అయ్యాయి. 2013 ఫిబ్రవరి 21న సాయంత్రం 6:50 గంటలకు దిల్‌సుఖ్‌నగర్‌లోని కోణార్క్ థియేటర్ వద్ద రెండు బాంబులు వరుసగా పేలాయి. ఈ ఘటనలో 18 మంది మృతి చెందగా, 130 మందికి గాయాలు అయ్యాయి. బాంబు పేలుళ్లతో ఆ ప్రాంతంలో భయానక వాతావరణం నెలకొంది. చాలా మంది శరీర భాగాలను కోల్పోయి ఇప్పటికీ అంగవైకల్యంతో బాధపడుతున్నారు. ఇండియన్ ముజాహిద్దీన్ అనే సంస్థ ఈ పేలుళ్లకు పాల్పడింది. బాబ్రీ మజీద్ కూల్చివేతకు ప్రతీకారంగా ఇండియన్ ముజాహిద్దీన్ ఈ బాంబు పేలుళ్లకు తెగబడింది. ఈ పేలుళ్లలో ప్రధాన నిందితుడు ఇండియన్ ముజాహిద్దీన్ కీలకనేత యాసిన్ భత్కల్. మరో ఐదు మందితో కలిసి యాసిన్ భత్కల్ ఈ పేలుళ్లకు పాల్పడ్డాడు. అబ్దుల్లాపూర్‌మెట్‌లోని ఓ ఇంట్లో ఉండి బాంబు పేలుళ్లకు కుట్రపన్నారు. రెండు పాతసైకిళ్లు, రెండు కుక్కర్లను కొనుగోలు చేసిన ఉగ్రవాదులు.. రెండు అత్యంత శక్తివంతమైన ఐఈడీ బాంబులను మార్చారు. అత్యంత రద్దీగా ఉన్న ప్రాంతాల్లో పేలుళ్లకు భత్కల్ ప్లాన్ చేయగా.. అందుకు అనుగుణంగానే ఫిబ్రవరి 21, 2013న దిల్‌సుఖ్‌నగర్‌లో రెండు సైకిళ్లను పార్క్ చేయడంతో కొద్దిసేపటికే రెండు బాంబులు పేలాయి. ఈ దుర్ఘటనలో 18 మంది ప్రాణాలు కోల్పోగా, అనేక మంది శరీర భాగాలు కోల్పోయి అంగవైకల్యాన్ని అనుభవిస్తున్నారు. పేలుళ్లపై ఎన్ఏఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి.. ఇండియన్ ముజాహిద్దీన్ పేలుళ్లకు పాల్పడినట్లు గుర్తించింది. ఈ క్రమంలో ప్రధాన నిందితుడు యాసిన్ భత్కల్‌తో పాటు మరో ఐదుగురిని అరెస్ట్ చేసింది. ఎన్ఐఏ కోర్టులో ప్రత్యేక విచారణ జరుగగా.. 2016లో ఈ ఉగ్రవాదులందరికీ ఉరిశిక్ష విధిస్తూ తీర్పునిచ్చింది. దీంతో నిందితులంతా తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు కూడా ఎన్ఐఏ కోర్టు ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ.. నిందితులకు ఉరిశిక్ష విధించింది. అయితే నేటితో బాంబు పేలుళ్లకు 13 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా హైదరాబాద్‌లో పోలీసులు అలర్ట్ అయ్యారు. బాంబు పేలుడు జరిగిన కోణార్క్ థియేటర్ వద్ద పోలీసులు భద్రతను పెంచారు. దిల్‌సుఖ్‌నగర్‌తో పాటు మరికొన్ని రద్దీ ప్రాంతాల్లోనూ అలర్ట్ కొనసాగుతోంది.

# బీఆర్ఎస్ కౌన్సిలర్ ఇర్షాద్ పై దాడి

**హైదరాబాద్ కు తరలింపు**

**తాండూరు:**వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలో నూతనంగా ఎన్నికైన బీఆర్ఎస్ పార్టీ 7వ వార్డు కౌన్సిలర్ ఇర్షాద్ పై దాడి జరిగింది. అయనకు మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ కు తరలించారు. కుటుంబ కలహాల నేపధ్యమా.... రాజకీయ కోణంలో దాడి జరిగిందా అని అనుమానాల నేపథ్యంలో ఇది ముమ్మాటికి రాజకీయ దాడి అంటూ 7వ వార్డు కౌన్సిలర్ ఇర్షాధ్ ఆరోపించారు. అత్యవసర పరిస్థితులలో కూడా అంబులెన్స్ లో తాండూరు పోలీస్ స్టేషన్ కు వచ్చి స్టేట్మెంట్ ఇచ్చారు.

# ఎమ్మెల్యేలనూ కూడగడుతున్నారా..?



**హైదరాబాద్, ఫిబ్రవరి 21:**తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాల్లో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తీరు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. మంత్రి పదవి ఆశించిన ఆయన, అది దక్కకపోవడంతో తన అసంతృప్తిని బాహాటంగానే వెళ్లగక్కుతున్నారు. కేవలం అసంతృప్తి వ్యక్తం చేయడమే కాకుండా, ఒకానొక దశలో ఏకంగా ముఖ్యమంత్రి పదవినే సవాల్ చేసే స్థాయికి ఆయన వ్యాఖ్యలు వెళ్లడం రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. మంత్రి పదవి ఇవ్వకుంటే తానేంటో చూపిస్తానన్నట్లుగా ఆయన చేస్తున్న హెచ్చరికలు పార్టీలో అంతర్గత పోరును వీధికెక్కించాయి.రాజగోపాల్ రెడ్డి కేవలం మాటలకే పరిమితం కాకుండా, తెరవెనుక పావులు కదుపుతున్నారనే ప్రచారం కాంగ్రెస్ శ్రేణుల్లో ఆందోళన కలిగిస్తోంది. తనకు అనుకూలంగా ఉన్న కొంతమంది ఎమ్మెల్యేలతో ఆయన నిరంతరం చర్చలు జరుపుతున్నారని, అవసరమైతే ఒక వర్గంగా విడిపోయే యోచనలో ఉన్నారని జోరుగా చర్చ సాగుతోంది. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి తన డిమాండ్లను నెరవేర్చుకోవడమే లక్ష్యంగా ఆయన ఈ వ్యూహాన్ని అమలు చేస్తున్నట్లు కనిపిస్తోంది. నేరుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని టార్గెట్ చేస్తూ ఆయన చేస్తున్న విమర్శలు పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించేలా ఉన్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి రాజగోపాల్ రెడ్డి దూకుడుగా వ్యవహరిస్తున్నా, అధిష్టానం ఇప్పటివరకు చూసీచూడనట్లు వ్యవహరిస్తోంది. అయితే, ఇప్పుడు పరిస్థితి చేతులు దాటిపోతోందని, ఆయన ఏకంగా ప్రభుత్వాన్ని బలహీనం చేసే దిశగా అడుగులు వేస్తున్నారని సంకేతాలు అందడంతో హైకమాండ్ అప్రమత్తమైంది. ఢిల్లీ పర్యటనలో ఉన్న రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్య నేతలు ఈ వ్యవహారాన్ని ఇప్పటికే కేంద్ర పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. పార్టీ ప్రతిష్టకు భంగం కలిగించేలా వ్యవహరిస్తే సహించేది లేదని అధిష్టానం స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే పీసీసీ చీఫ్ చేసిన ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. రాజగోపాల్ రెడ్డిని పిలిపించి మాట్లాడతామని, ఆయన అభ్యంతరాలు ఏమిటో తెలుసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఇది ఒక రకంగా రాజగోపాల్ రెడ్డికి ఇస్తున్న చివరి హెచ్చరికగా భావించవచ్చు. సర్దిచెప్పే ప్రయత్నాలు విఫలమైతే, పార్టీ లైన్ దాటి వెళ్తున్న నేతపై కఠిన చర్యలు తీసుకోవడానికి కూడా వెనుకాడబోమనే సంకేతాన్ని పీసీసీ పంపింది. రాజగోపాల్ రెడ్డిని దారికి తెచ్చేందుకు అధిష్టానం త్వరలోనే ఒక స్పష్టమైన కార్యాచరణతో ముందుకు రానుంది.రాజగోపాల్ రెడ్డి గతాన్ని పరిశీలిస్తే, ఆయన గతంలో కూడా పార్టీని వీడి మళ్ళీ తిరిగి వచ్చిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పుడు ఆయన మళ్ళీ అదే బాట పడతారా లేక మంత్రి పదవి కోసం ఒత్తిడి తంత్రం మాత్రమే ఉపయోగిస్తున్నారా అనేది తేలాల్సి ఉంది. ఒకవేళ ఆయన శాంతించకపోతే, ఆయనపై వేటు వేయడం ద్వారా ఇతరులకు గుణపాఠం చెప్పాలని రేవంత్ రెడ్డి వర్గం భావిస్తోంది. రాజగోపాల్ రెడ్డి వైఖరి పార్టీకి బలమా లేక బలహీనతా అన్నది రాబోయే రోజుల్లో తేలనుంది. సీనియర్ నేతగా ఆయనకున్న బలాన్ని కాపాడుకుంటూనే, ముఖ్యమంత్రి పీఠాన్ని సవాల్ చేసే ధోరణిని అధిష్టానం ఎలా అణచివేస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. ఒకవేళ ఆయన దారికి రాకపోతే, కాంగ్రెస్ తనదైన శైలిలో ఆయనకు దారి చూపించే అవకాశం మెండుగా ఉంది.

# జీవన రెడ్డి దారెటు...

**కరీంనగర్, ఫిబ్రవరి 21:**జగిత్యాల కాంగ్రెస్‌లో సీనియర్ నేత టి.జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మధ్య నడుస్తున్న ఆధిపత్య పోరు ఇప్పుడు కేవలం నియోజకవర్గానికే పరిమితం కావట్లేదు. రాష్ట్ర రాజకీయాల్లో ఒక సంచలనంగా మారింది. దశాబ్దాలుగా కాంగ్రెస్ జెండాను మోస్తూ, పార్టీ కష్టకాలంలోనూ అండగా నిలిచిన ఒక సీనియర్ నేత.. నేడు సొంత పార్టీలోనే 'మనుగడ' కోసం పోరాడాల్సి రావడం తీవ్ర చర్చకు దారితీస్తోంది.తెలంగాణ రాజకీయాల్లో 'క్లీన్ ఇమేజ్' ఉన్న అతికొద్ది మంది నేతల్లో జీవన్ రెడ్డి ఒకరు. కానీ, ప్రస్తుతం ఆయన ఎదుర్కొంటున్న పరిస్థితులు ఒక విధమైన రాజకీయ సంక్షోభాన్ని తలపిస్తున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చెందినప్పటికీ, కేడర్ గొంతుకగా నిలిచిన ఆయనకు.. తన ప్రత్యర్థిగా ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కాంగ్రెస్‌లోకి రావడమే పెద్ద దెబ్బగా మారింది.గత ఎన్నికల్లో సంజయ్ కుమార్ చేతిలో జీవన్ రెడ్డి ఓడిపోయారు. అయితే, రాజకీయ సమీకరణాల్లో భాగంగా సంజయ్ కుమార్‌ను పార్టీలోకి చేర్చుకోవడం జీవన్ రెడ్డి వర్గానికి మింగుడుపడలేదు. అప్పటి నుండి నియోజకవర్గంలో ప్రోటోకాల్ విషయంలోనూ, అభివృద్ధి పనుల విషయంలోనూ ఇద్దరి మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే వాతావరణం నెలకొంది. పార్టీ కోసం దశాబ్దాలుగా జెండాలు మోసిన కార్యకర్తలను కాదని, నిన్నగాక మొన్న వచ్చిన వారికి ప్రాధాన్యత ఇస్తుంటే ఇక మా ఉనికి ఎక్కడ? అనే ప్రశ్న జీవన్ రెడ్డి మద్దతుదారుల నుండి బలంగా వినిపిస్తోంది.ఇటీవల జరిగిన మున్సిపల్ చైర్మన్ ఎన్నికలు ఈ విభేదాలను పతాక స్థాయికి తీసుకెళ్లాయి. పార్టీ అధిష్టానం ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి వర్గానికి కాకుండా, ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వర్గానికి చెందిన నేతకే చైర్మన్ పీఠం అప్పగించడం అగ్నికి ఆజ్యం పోసింది. ఈ క్రమంలో జీవన్ రెడ్డి తన అనుచరులను స్వతంత్రులుగా పోటీ చేయించి గెలిపించుకోవాల్సి రావడం, ఆయన పడుతున్న ఆవేదనకు అద్దం పడుతోంది. "ఇంకెంత కాలం ఈ అవమానాలు భరించాలి? పార్టీలో నా భవిష్యత్తు ఏంటో అర్థం కావడం లేదు" అని ఆయన బహిరంగంగా వ్యాఖ్యానించడం ఆయన మనస్తాపానికి నిదర్శనం. జీవన్ రెడ్డికి జరుగుతున్న అన్యాయంపై మరో సీనియర్ నేత జగ్గారెడ్డి స్పందించారు. "కష్టకాలంలో పార్టీని వీడని వారికి న్యాయం చేయాలి" అని అధిష్టానాన్ని కోరారు.జగిత్యాల ప్రజల్లో జీవన్ రెడ్డి పట్ల అపారమైన గౌరవం ఉంది. సామాన్య ప్రజలకు సైతం అందుబాటులో ఉండే 'మనసున్న నేత'గా ఆయనకు పేరుంది. ఇప్పుడు ఆయన రాజకీయ మనుగడే ప్రశ్నార్థకం కావడం పట్ల స్థానికంగా తీవ్ర సానుభూతి వ్యక్తమవుతోంది. ఒకవేళ జీవన్ రెడ్డి గనుక పార్టీని వీడితే, జగిత్యాలలో కాంగ్రెస్‌కు ఉన్న సంప్రదాయ ఓటు బ్యాంకు భారీగా దెబ్బతినే ప్రమాదం ఉంది.ఒకవైపు అధికారంలో ఉన్న పార్టీకి ఎమ్మెల్యేల మద్దతు



అవసరమే అయినప్పటికీ, దశాబ్దాల చరిత్ర ఉన్న సీనియర్ నేతలను దూరం చేసుకోవడం పార్టీ నైతిక స్థైర్యాన్ని దెబ్బతీస్తుంది. జీవన్ రెడ్డి లాంటి సీనియర్ నేత పార్టీ వీడడం అంటే అది కేవలం ఒక నాయకుడిని కోల్పోవడం కాదు, నమ్మకమైన కేడర్‌ను కోల్పోవడమే. వచ్చే ఎన్నికల నాటికి ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే, జీవన్ రెడ్డి ప్రత్యామ్నాయ దారి వెతుక్కోవడం ఖాయంగా కనిపిస్తోంది. ఇప్పటికైనా పార్టీ అధిష్టానం కలుగజేసుకుని, ఈ సీనియర్ వర్సెస్ వలస నేతల గొడవకు స్వస్తి పలకకపోతే జగిత్యాల కోటలో హస్తం పార్టీకి పతనం తప్పకపోవచ్చు.

# ఖమ్మంలో రూ.4.50 కోట్ల క్యాంపు కార్యాలయం...

## ఆర్థిక మంత్రిపై విమర్శల వెల్లువ...

భట్టి విక్రమార్క అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారనే ఆరోపణల మధ్య, ఖమ్మం జిల్లాలో రూ.4.50 కోట్ల వ్యయంతో కొత్త క్యాంపు కార్యాలయం నిర్మాణం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఇప్పటికే మధిరలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, అలాగే హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌ను వినియోగిస్తున్న నేపథ్యంలో, ఖమ్మంలో మరో ప్రత్యేక క్యాంపు కార్యాలయం అవసరమా అన్న ప్రశ్నలు ఎదురవుతున్నాయి.గతంలో భారత రాష్ట్ర సమితి ప్రభుత్వ హయాంలో కేవలం రూ.1 కోట్ల వ్యయంతో క్యాంపు కార్యాలయం నిర్మించగా, ప్రస్తుత నిర్మాణానికి రూ.4.50 కోట్ల ప్రజా ధనం ఖర్చు చేయడం పై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ భవనం ప్యాలెస్ తరహాలో నిర్మాణం జరుగుతోందని, ఇది ప్రజా ధన వినియోగంలో అసమతుల్యతను సూచిస్తోందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్న చర్చల ప్రకారం, ఖమ్మం జిల్లా తన ఆధిపత్యాన్ని చాటుకునే క్రమంలోనే ఈ నిర్మాణం చేపట్టారని, ముఖ్యంగా పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులకు ఒక రాజకీయ సందేశం ఇవ్వడానికే ఈ భవనం నిర్మాణమని ప్రచారం సాగుతోంది. అయితే ఈ వ్యాఖ్యలపై అధికారికంగా ఎటువంటి స్పష్టీకరణ వెలువడలేదు.ఇదే సమయంలో పెన్షనర్లకు పెండింగ్ బకాయిలు, రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్



వంటి అంశాలకు నిధుల కొరత ఉందని ప్రభుత్వం పేర్కొంటున్న నేపథ్యంలో, మంత్రిగారి కోసం భారీ వ్యయంతో భవనం నిర్మాణం చేపట్టడంపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. అలాగే, ఒక మంత్రికి ఇంత భారీ స్థాయిలో క్యాంపు కార్యాలయం నిర్మిస్తే, ఇతర మంత్రులు కూడా ఇలాంటి సదుపాయాలు కోరితే పరిస్థితి ఎలా ఉంటుందన్న ఆందోళన ప్రభుత్వ వర్గాల్లో వ్యక్తమవుతోందని సమాచారం. ఈ అంశంపై ప్రభుత్వం అధికారిక వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉందని విశ్లేషకులు సూచిస్తున్నారు.

# వటపత్రశాయి అలంకారంలో నృసింహుడు..

**వైభవంగా కొనసాగుతున్న యాదాద్రి బ్రహ్మోత్సవాలు**



యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. 11 రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు ఉదయం వటపత్రశాయి అలంకారంలో లక్ష్మీనరసింహస్వామి దర్శనమిచ్చారు. రాత్రి హంస వాహనంపై స్వామివారు ఊరేగనున్నారు. బ్రహ్మోత్సవాలు, వీకెండ్ కావడంతో యాదగిరిగుట్టకు భారీగా భక్తులు తరలివచ్చారు. కాగా, లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ఈ నెల 28 వ తేదీ వరకు జరుగనున్నాయి. 24న స్వామివారి ఎదుర్కోలు, 25న తిరుకల్యాణం, 28న అష్టోత్తర శతఘటాభిషేకం నిర్వహించి ఉత్సవాలకు ముగింపు పలుకనున్నారు. ఉత్సవాల సందర్భంగా నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, సుదర్శన నారసింహ హోమం, జోడు సేవలు, ఏకాదశి లక్ష పుష్పార్చనలను అధికారు రద్దు చేశారు.

# తెలంగాణలో ఎంపీటీసీ, జడ్పీటీసీ వ్యవస్థల రద్దు.. అసాధ్యమే..!!

తెలంగాణలో స్థానిక సంస్థల పునర్వ్యవస్థీకరణపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలు చర్చనీయాంశంగా మారుతున్నాయి. దశాబ్దాలుగా కొనసాగుతున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ వ్యవస్థలను రద్దు చేయాలనే ప్రాథమిక నిర్ణయానికి వచ్చినట్లుగా తెలంగాణ ప్రభుత్వ వర్గాలు లీకులు ఇస్తున్నాయి. ప్రస్తుతమున్న ఎంపీటీసీ , జడ్పీటీసీ వ్యవస్థల వల్ల అధికార యంత్రాంగం క్లిష్టంగా మారుతోందని, నిధుల వినియోగంలో జాప్యం జరుగుతోందని రేవంత్ రెడ్డి ప్రభుత్వం భావిస్తోంది. ఈ మధ్యంతర వ్యవస్థలను తొలగించి, గ్రామ పంచాయతీ సర్పంచులకు , జిల్లా స్థాయి యంత్రాంగానికి మధ్య ప్రత్యక్ష సంబంధాన్ని నెలకొల్పాలని ముఖ్యమంత్రి అనుకుంటున్నారు.

**పరిషత్‌లకు చాలా స్వల్పంగానే నిధులు..** ప్రస్తుతం మండల పరిషత్ , జిల్లా పరిషత్ సభ్యులకు కేటాయించే నిధులు చాలా పరిమితంగా ఉంటున్నాయి. అనేక సందర్భాల్లో ఎంపీటీసీలకు కనీస అధికారాలు కూడా ఉండటం లేదనే అసంతృప్తి వారిలో ఉంది. ఈ వ్యవస్థను రద్దు చేయడం ద్వారా పాలనాపరమైన ఖర్చులను తగ్గించడమే కాకుండా, నిర్ణయాలు తీసుకునే ప్రక్రియను వేగవంతం చేయవచ్చని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. మండల వ్యవస్థను కేవలం పరిపాలనా విభాగంగానే ఉంచి, రాజకీయ ప్రాతినిధ్యాన్ని గ్రామ, జిల్లా స్థాయిలకే పరిమితం చేయడం ద్వారా ద్వంద్వ పాలన కు స్వస్తి పలకాలని ప్రభుత్వం భావిస్తోంది.

**ప్రాక్టికల్‌గా ఆలోచిస్తే సాధ్యం కాదు..**

ఎంపీటీసీ, జడ్పీటీసీ వ్యవస్థలను రద్దు చేయడం అంత సులభమైన విషయం కాదు. భారత రాజ్యాంగంలోని 73వ సవరణ ప్రకారం దేశంలో మూడంచెల పంచాయతీ రాజ్ వ్యవస్థ గ్రామ, మండల, జిల్లా స్థాయిలుఅమలులో ఉండాలి. దీనిని మార్చాలంటే రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో తీర్మానం చేయడంతో పాటు, కేంద్ర ప్రభుత్వం , పార్లమెంటు ఆమోదం కూడా అవసరమవుతుంది. కేవలం రాష్ట్ర స్థాయి నిర్ణయంతో రాజ్యాంగబద్ధమైన ఈ వ్యవస్థలను రద్దు చేయడం సాధ్యం కాదని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఒకవేళ ప్రభుత్వం మొగ్గు చూపితే, దీనిపై సుదీర్ఘమైన న్యాయ పోరాటం జరిగే అవకాశం ఉంది.

**కలిసి వచ్చే పార్టీలు ఉండవు..**

పరిషత్‌ల రద్దు ప్రతిపాదనపై రాజకీయంగా తీవ్ర వ్యతిరేకత వచ్చే అవకాశం కనిపిస్తోంది. స్థానిక సంస్థల్లో పట్టు సాధించాలనుకునే నాయకులు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించే అవకాశం ఉంది. ముఖ్యంగా విపక్షాలు దీనినిప్రజాస్వామ్య వ్యతిరేక చర్యగా అభివర్ణించే ప్రమాదం ఉంది. అందుకే రేవంత్ ఆలోచన చర్చకు కారణం అవుతుంది కానీ అమల్లోకి రాకపోవచ్చు..!!

వార్తాతరంగాలు

శనివారం 21 ఫిబ్రవరి 2026

# డబ్బు రాజకీయ జబ్బు

**ఓటుకు నోటు విధానం పోవాలి**

**సామాన్యుడు రాజకీయం చేయలేని దుస్థితి ఎందుకు**

**ప్రజలు ఓటును బాధ్యతగా భావించాలి**

**షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు**



**రంగారెడ్డి జిల్లా (స్కై న్యూస్) ఫిబ్రవరి 21 :-** రాజకీయాలకు డబ్బు జబ్బు పట్టుకుందని ఈ ధోరణిలో మార్పు రాకపోతే సామాన్యుడు రాజకీయాల్లోకి రాలేని దుస్థితి ఏర్పడుతుందని షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు బక్కని నర్సింహులు ఆవేదన వ్యక్తం చేశారు శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల మున్సిపాలిటీ ఎన్నికలు మొదలుకొని అంతకు ముందు జరిగిన ఎన్నికలలో డబ్బులు విపరీతంగా ఖర్చుపెట్టి ఓట్లను కొనుగోలు చేస్తున్నారని అన్నారు ఇలా చేయడం వల్ల ఓటర్లు కూడా ప్రలోభాలకు గురయ్యే ప్రమాదం ఉందని అన్నారు ఓటు ప్రజలు బాధ్యతగా భావించాలని, కేవలం డబ్బుల కోసం ఓట్లు వేసే ధోరణి కి దూరం కావాలని అన్నారు మరోవైపు రాజకీయాల్లో పదవుల కోసం ఉచితాలు ప్రవేశ పెడుతూ ప్రజలను బద్ధకస్తులను చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు విద్య, వైద్యం మినహాయిస్తే దీనిని కూడా ప్రజలకు ఉచితంగా ఇవ్వడం సరికాదని ఇటీవల సుప్రీంకోర్టు కూడా చెప్పిన సంగతి ఆయన గుర్తు చేశారు ఒకవైపు ప్రజలకు సేవకులుగా పనిచేసిన చేయాల్సిన ఉద్యోగులు జీతాలు తీసుకుంటూ కూడా అవినీతికి పాల్పడడం మరోవైపు సేవ పేరుతో రాజకీయాల్లోకి వచ్చిన వారు కూడా అవినీతికి పాల్పడడం ఎన్నికల్లో గెలుపు కోసం తమ అవినీతి సొమ్ముతో ఓటర్లను కూడా అవినీతి వైపు నడిపించడం దారుణం అన్నారు ఎందరో మహానుభావులు నిస్వార్థంగా పోరాడి తమ ప్రాణాలను సైతం అర్పించి స్వాతంత్రం సంపాదిస్తే అలాంటి స్వతంత్ర భారతదేశంలో మనం మన స్వార్థం కోసం పనిచేయడం సరికాదన్నారు పవిత్రమైన ఓటు హక్కును ప్రజలు అమ్ముకోకూడదని ఆయన హితులు చెప్పారు ఓటర్ పరిపాలనలో భాగస్వామి అనుకున్నప్పుడే ఓటు సక్రమంగా వినియోగం అవుతుందన్నారు. డబ్బు రాజకీయం మొదలైనప్పటి నుంచి రాజకీయాలు, పదవులు కేవలం సంపన్న వర్గాలకే పరిమితమయ్యాయి అన్నారు మహాత్మా గాంధీ కోరిన సమానత్వం ప్రస్తుతం ఎక్కడా కనిపించడం లేదని అన్నారు భూములు కబ్జాలు చేసి అక్రమ సొమ్ము సంపాదించే నాయకులు ఇదే నియోజకవర్గంలోని బూర్గుల రామకృష్ణారావు నిరుపేదల కోసం తన సొంత భూమిని దానం చేసిన సంగతి గుర్తుంచుకోవాలన్నారు స్వామి వివేకానందుని మార్గంలో సమాజమంతా సమానత్వంతో ఉండేలా ప్రతి ఒక్కరం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు శాసనసభలో ఉన్న వ్యక్తులు కూడా ఈ రోజున కులం గురించి మాట్లాడడం దారుణం అన్నారు ఇలాంటి ధోరణిని సమాజం నుంచి దూరం చేసేందుకు వివేకానంద బాల్వాడి సెంటర్లను అప్పట్లో స్థాపించడం జరిగిందన్నారు ఆల్ ఇండియా సంస్థ ప్రతినిధులు లక్ష్మీదేవి, రామకృష్ణ తదితరులు ఈ కేంద్రాలను చూసి తనను అభినందించారని అన్నారు రాజకీయాలు భ్రష్టు పట్టకుండా నీతిగా నిజాయితీగా ముందుకు నడిపించే బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

## యువ నాయకత్వానికి గుర్తింపు

**ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడిగా ఆకాష్ నాయక్ ఎన్నిక**



**రంగారెడ్డి జిల్లా (స్కై న్యూస్) ఫిబ్రవరి 21 :-** నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించిన ఏఐఎస్ఎఫ్ (ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్) తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలు విజయవంతంగా ముగిశాయి రాష్ట్రం నలుమూలల నుంచి విద్యార్థి ప్రతినిధులు, నాయకులు పాల్గొని మహాసభలు విజయ వంతం చేశారు మహాసభల సందర్భంగా నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ఇందులో భాగంగా ప్రస్తుతం రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శిగా సేవలందిస్తున్న ఆకాష్ నాయక్‌ను ఆయన చేసిన నిరంతర కృషి, విద్యార్థి సమస్యలపై చురుకైన పోరాటాలను గుర్తించి రాష్ట్ర సమితి సభ్యుడిగా ఎన్నుకోవడం జరిగింది ఈ సందర్భంగా ఆకాష్ నాయక్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన జాతీయ మరియు రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు విద్యార్థుల హక్కుల పరిరక్షణ, ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతం ఫీజుల భారం తగ్గింపు వంటి అంశాలపై మరింత చురుకుగా పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు ఆయన ఎన్నిక పట్ల రంగారెడ్డి జిల్లా ఏఐఎస్ఎఫ్ నాయకులు కార్యకర్తలు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు యువ నాయకత్వంతో రాష్ట్రంలో విద్యార్థి ఉద్యమాలు మరింత బలపడతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## పారిశుద్ధ్య పనులు చేపట్టి దోమల బెడద నివారిస్తాం....



**నారాయణపేట ఫిబ్రవరి 21 (స్కైన్యూస్)** నారాయణపేట మండలం.అప్పిరెడ్డి పల్లి గ్రామంలో 2వ వార్డుల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టి వేసవి కాలంలో దోమలబెడదనునివారించేందుకు పాలకవర్గం సభ్యులతో కలిసి కృషి చేస్తామని అన్నారు. 2వవార్డు చేపడుతున్నపారిశుద్ధ్యపనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూప్రజలు తడి పొడి చెత్త వేర్వేరుగా చెత్తా సేకరణ వాహనంలో వేయాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి గన్ని బ్యాగులు వినియోగించాలన్నారు. డ్రైనేజీల్లో తొలగిస్తున్న చెత్తాచెదారం గ్రామపంచాయతీ ట్రాక్టర్ ద్వారా డంపింగ్ యార్డ్ కు తరలిస్తున్నామనిఅన్నారు. ప్రజలు ఎంతో నమ్మకంతో గెలిపించారని 2వ వార్డు నీ అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని అన్నారు. వార్డు లో డ్రైనేజీలు సిసి రోడ్ల నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. పారిశుద్ధ్య పనులకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో 2వ వార్డు మెంబర్ అనిల్ కుమార్.పంచాయతీ సెక్రటరీ. బొక్క నరసింహ.రాములు.వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలోనే క్వాలిఫైడ్ టీచర్స్ తో విద్యాబోధన జరుగుతుంది....

**మండల విద్యాధికారి మురళీకృష్ణ**



**చిన్న చింతకుంట ఫిబ్రవరి 21 (స్కై న్యూస్);** కనుక మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలని మండల విద్యాధికారి మురళీకృష్ణ అన్నారు. చిన్న చింతకుంట మండల పరిధిలోని ఉంద్యాల ప్రాథమిక పాఠశాలలో మూడో శనివారం తల్లిదండ్రుల సమావేశం ను ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ఉదయ భాస్కర్ ఏర్పాటు చేయగా ముఖ్యఅతిథిగా ఎం ఈ ఓ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎం ఈ ఓ మాట్లాడుతూ ఉంద్యాల గ్రామంలో పాఠశాల భవనాల కొరత ఉంది. అయినా మంచి ఉపాధ్యాయులు ఇక్కడ ఉన్నారు. ఒకటో తరగతి పిల్లలు ఇంగ్లీషులో చదువుతున్నారు. మనం అందరం విన్నాం కనుక ప్రతి ఒక్క తల్లి తండ్రి ఉపాధ్యాయులకు సహకరించి మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. ఒకటో తరగతి చదువుతున్న అమ్మాయి భార్గవి ఇంగ్లీషు చదివినందుకు ఆమెకు పా ర్శికోత్సవం అందజేశారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జి హెచ్ ఎం అరుణ, ఇన్చార్జి జి హెచ్ఎం చంద్రశేఖర్ రెడ్డి తో కలిసి 10వ తరగతి చదువుతున్న క్లాస్ రూమ్ లోకి వెళ్లి వివిధ సబ్జెక్టుల పైన ఎం ఈ ఓ ప్రశ్నలు అడగగా విద్యార్థులు సక్కగా జవాబులు చెప్పినందుకు ఎంతగానో సంతోషించారు. క్లాసులో 38 మంది విద్యార్థులు ఉండగా 38 మంది హాజరైనందుకు సంతోషం వ్యక్తం చేశారు. ప్రతిరోజు ఉదయం సాయంత్రం ఆయా సబ్జెక్టులపై ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారా సాయంత్రం స్నాక్స్ ఇస్తున్నారా అని విద్యార్థులను అడగగా ఇస్తున్నారు అని తెలిపారు. చిన్నచింతకుంట మండలంలో ఆరు ఉన్నత పాఠశాలలో మీ పాఠశాల మొదటి ర్యాంకు తీసుకువచ్చి ఇటు ఉపాధ్యాయులకు అటు మీ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులను కోరారు. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు పంపి అప్పులు చేసుకోవద్దు, అప్పుల ఊబిలో పడవద్దు అని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులతో కూడిన సదుపాయాలు ఉంటావని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉపాధ్యాయులు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు స్వాతి, స్వర్ణలత, శివాని,విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## శ్రీ బాలాజీ సిమెంట్ అండ్ స్టీల్ షాప్ ప్రారంభించిన మాజీ ఎమ్మెల్యే వై అంజయ్య యాదవ్



**రంగారెడ్డి జిల్లా (స్కై న్యూస్) ఫిబ్రవరి 21 :-** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని కేశంపేట రోడ్డులో నూతనంగా ఏర్పాటుచేసిన శ్రీ బాలాజీ సిమెంట్ అండ్ స్టీల్ షాప్ ను మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఘనంగా ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత వ్యాపార రంగంలో ముందుకు వచ్చి స్వయం ఉపాధి సాధించి, సమాజ అభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు వ్యాపారంలో నిబద్ధత, నాణ్యత, నమ్మకం ఉంటే తప్పకుండా విజయాలు సాధించవచ్చని సూచించారు శ్రీ బాలాజీ సిమెంట్ అండ్ స్టీల్ షాప్ యజమానులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేస్తూ వ్యాపారం రోజురోజుకూ అభివృద్ధి చెందాలని ఆశీర్వదించారు ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు లక్ష్మణ్ నాయక్, కౌన్సిలర్లు వసంత శ్రీనివాస్, అనిత రఘునాథ్, మాజీ సర్పంచ్ రంగయ్య గౌడ్, నాయకులు రవి యాదవ్, అశోక్, అంబాదాస్ తదితరులు పాల్గొన్నారు.

## కొందుర్గు మండలశీలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**రంగారెడ్డి జిల్లా (స్కై న్యూస్) ఫిబ్రవరి 21 :-** రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం లోని వివిధ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ కొందుర్గు మండల కేంద్రంలో పలు గ్రామాల్లో హై లెవెల్ బ్రిడ్జిలు అందుబాటులో ఉన్న హెచ్ఎండిఏ నిధులతో శంకుస్థాపన చేయడం జరిగిందని ఆయన అన్నారు కొందుర్గు మండలం అభివృద్ధి కావాలనే ఆకాంక్షతో అభివృద్ధి చేయడం జరుగుతుందని అన్నారు ప్రజలు నాయకులు పార్టీలకు అతీతంగా పూర్తి సహకారం ఉంది కాబట్టి రాబోవు మూడు సంవత్సరాలలో మండలం యొక్క రూపు రేఖలు మారబోతున్నాయి ముందు ముందు కూడ అందరి సహకారం తీసుకొని ముందుకోవడం జరుగుతుందని అన్నారు ఈ సందర్భంగా సర్పంచ్ ప్రభాకర్, ఎస్ సి సెల్ మండల అధ్యక్షుడు నరేందర్, వార్డ్ మెంబర్ దుర్గని శివ మాట్లాడుతూ కొందుర్గు మండల కేంద్రంలో 15 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు కొందుర్గు ప్రజల తరఫున ధన్యవాదాలు తెలిపారు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కొందుర్గు మండలాల్లో ఎన్నో అభివృద్ధి పనులు చేసుకోవడం జరిగిందని అన్నారు సీఎం రేవంత్ రెడ్డి కొందుర్గు మండలంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ కి శంకుస్థాపన చేయడం జరిగింది అని అన్నారు రాబోవు రోజుల్లో కూడా కొందుర్గు మండలాన్ని అభివృద్ధి పథంలో తీర్చిదిద్దేందుకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రెడీగా ఉన్నారని అన్నారు పార్టీలకతీతంగా అభివృద్ధి చేసుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మార్కెట్ కమిటీ చైర్మన్ సులోచన కృష్ణారెడ్డి, పురుషోత్తం రెడ్డి జితేందర్ రెడ్డి, రాములు గౌడ్, కేకే కృష్ణ, పి ఎ సి ఎస్ చేర్మన్ దామోదర్, మల్లేష్ గౌడ్, గోవర్ధన్ రెడ్డి, అంజిరెడ్డి, గోపాల్ రెడ్డి, విక్రమ్ రెడ్డి సర్పంచ్ చౌదపురం ప్రభాకర్, మాజీ సర్పంచ్ యాదయ్య, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు నరేందర్ డిప్యూటీ సర్పంచ్ చిప్ప చంద్రశేఖర్, వార్డ్ మెంబర్లు కటిక వెంకటేష్ తంగేళ్లపల్లి నవీన్, శీలం లింగం కావాలి ప్రవీణ్ కొమరబండ సునీత జంగయ్య, మద్ది శ్రీకాంత్, ఫర్హాత్ సుల్తానా శర్ఫదిన్, బి శ్రీను వాసవి సోమల అనూష సంజీవ దుర్గని శివ బొజ గారి సువర్ణ, యారం శ్వేత, జోసెఫ్ రెడ్డి సదుల లక్ష్మీ ముత్యాలు, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు

## రైతు వ్యతిరేక నిర్ణయాలు వెంటనే ఉపసంహరించాలి

**బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్**

**మొక్కజొన్న రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా కేశంపేట మండలకేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా**





**రంగారెడ్డి జిల్లా (స్కై న్యూస్) ఫిబ్రవరి 21 :-** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం లో కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక నిర్లక్ష్య వైఖరి పై షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే వై అంజయ్య యాదవ్ పిలుపుమేరకు బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు నాలుగు నెలలుగా మొక్కజొన్న రైతుల చెమటోడ్చిన శ్రమకు గానూ రావాల్సిన డబ్బులు ఖాతాల్లో జమ చేయకుండా, రైతుబంధు నిధుల విషయంలో ఇప్పుడు అప్పుడు అంటూ కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక నిర్లక్ష్య వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పిలుపుమేరకు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రవీందర్ యాదవ్ ఆధ్వర్యంలో కేశంపేట మండలం కేంద్రంలో స్థానిక బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా రవీందర్ యాదవ్ మాట్లాడుతూ రైతుల కష్టాన్ని లెక్కచేయని ఈ ప్రభుత్వం వెంటనే మొక్కజొన్న రైతుల పెండింగ్ చెల్లింపులు విడుదల చేయాలని, రైతుబంధు నిధులను తక్షణమే జమ చేయాలని గట్టిగా డిమాండ్ చేశారు రైతుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం నైతిక బాధ్యత తీసుకోవాలని హెచ్చరించారు అదే విదంగా రైతు వ్యతిరేక నిర్ణయాలు వెంటనే ఉపసంహరించాలి రైతుల డబ్బులు వెంటనే విడుదల చేయాలి లేదంటే బీఆర్ఎస్ పార్టీ ఆందోళనలను మరింత ఉధృతం చేస్తుందని అన్నారు ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మురళీధర్ రెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ జగదీశ్వర్ గౌడ్, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణ గౌడ్, ఆయా గ్రామాల సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రిని కలిసి పూల గుచ్చెములు అందజేసిన: ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి



**దేవరకద్ర ఫిబ్రవరి 21 (స్కై న్యూస్);** హైదరాబాద్ లో శనివారం ముఖ్యమంత్రి నివాసంలో సీఎం రేవంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి, పూల గుచ్చములు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జి, మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై దేవరకద్ర నియోజకవర్గంలోని మూడు మున్సిపాలిటీలను భారీ మెజార్టీతో కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకున్నాం అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ని అభినందించిన ముఖ్యమంత్రి. ఎమ్మెల్యే తో పాటు నియోజకవర్గం లోని నాయకులతో కలిసి నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

## శ్రీ బాలాజీ సిమెంట్ అండ్ స్టీల్ షాప్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సి నవీన్ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా (స్కై న్యూస్) ఫిబ్రవరి 21 :-** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని కేశంపేట రోడ్డులో రాజేష్ కుమార్ నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ బాలాజీ సిమెంట్ అండ్ స్టీల్ షాప్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన వస్తువులతో సేవలందించి వ్యాపారంలో ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి అన్నారు కార్యక్రమంలో కౌన్సిలర్ నడికూడ అనిత రఘునాథ్ యాదవ్, మాజీ సర్పంచ్లు ప్రశాంత్ రెడ్డి, యారం శేఖర్ రెడ్డి, రంగయ్య గౌడ్ బీఆర్ఎస్ మధుసూదన్ రెడ్డి, బుచ్చిరెడ్డి, శ్రీశైలం యాదవ్, అంజి, శివ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కోట మైసమ్మ, భూ లక్ష్మీదేవి, పోతురాజు విగ్రహాల ప్రతిష్ట పూజలో మాజీ ఎమ్మెల్యే ఆల...



**దేవరకద్ర భూత్పూర్ ఫిబ్రవరి 21 ( స్కై న్యూస్);** భూత్పూరు మండలం అన్నసాగర్ గ్రామంలో శనివారం అంగరంగ వైభోగంగా జరుగుతున్న శ్రీ కోట మైసమ్మ , భూలక్ష్మి దేవి అమ్మవారు మరియు పోతురాజు విగ్రహల ప్రతిష్ఠ పూజ కార్యక్రమంలో దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ నిర్వాహకులు ఆల కుటుంబ సభ్యులను ఆశీర్వదించి శాలువాలతో ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో భక్తిశ్రద్ధలతో గ్రామ మహిళలు, పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం...

**నాగర్ కర్నూల్ ఫిబ్రవరి 21( స్కై న్యూస్):** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ ఉ కామర్స్ డిగ్రీ కళాశాలలో ఈరోజు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం మరియు కాయిన్ ఎగ్జిబిషన్ వంటి కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథులుగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సలహాదారుల కమిటీ సభ్యుడు ముచ్చర్ల దినకర్, స్థానికులు బాస వెంకటేశ్వర్లు మురళీధర్ రావు అలాగే క్లాస్మేట్ క్లబ్ ప్రతినిధులైన రాఘవేందర్ నవీన్ గార్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు కవితాగనం పాటలు, వ్యాసరచన వంటి పోటీలో పాల్గొని బహుమతులు పొందారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి సభాధ్యక్షులు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. గీతాంజలి గారు మాట్లాడుతూ మాతృభాషను పరిరక్షించుకోవాలని దాని వైవిధ్యాన్ని గొప్పతనాన్ని ప్రపంచానికి చాటాలని చెప్పారు. ముచ్చర్ల దినకర్ గారు మాట్లాడుతూ ప్రభుత్వం తరపున భాషా సాంస్కృతిక కార్యక్రమాలు మరెన్నో నిర్వహించాలని వాటికి తమ యొక్క ప్రోత్సాహం ఉంటుందన్నారు. దానితో పాటుగా హిస్టరీ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో నాగభూషణం గారి పర్యవేక్షణలో జాతీయ,అంతర్జాతీయ కరెన్సీ, పురాతన నాణాల ప్రదర్శన జరిగింది. ఈ యొక్క ప్రదర్శనలో విద్యార్థులు అధ్యాపకులు అత్యంత ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ ప్రదర్శన కార్యక్రమాన్ని అసిస్టెంట్ ప్రొఫెసర్ ధర్మ హజీరా మేడం గారు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు కృష్ణయ్య సతీష్ మల్లేష్ సుధాకర్ చంద్రశేఖర్ మౌనిక రిజ్వాన కృష్ణ తదితరులు పాల్గొన్నారు

## ఆత్మకూరు మున్సిపాలిటీ లో పదవి బాధ్యతల స్వీకార మహోత్సవం ఘనంగా జరిగింది...



**దేవరకద్ర, ఆత్మకూర్ ఫిబ్రవరి 21 (స్కై న్యూస్);** ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మార్కెట్ కమిటీ చెర్మెన్ రహమతుల్లా మాట్లాడుతూ రాష్ట్ర తెలంగాణ మంత్రివర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి సహకారంతో ఆత్మకూరు ను అన్నివిదాలు గా అభివృద్ధి చేస్తామని అన్నారు.అలాగే నూతన మున్సిపల్ చైర్ పర్సన్ నాగమణి సహకారంతో ఆత్మకూరు ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని రహమతుల్లా పేర్కొన్నారు. ఇట్టి కార్యక్రమంలో ఫోటో వార్డు తిరుపతి,రెండో వార్డు ఆత్మకూరు వైస్ చైర్మన్ నల్గొండ శీను 5 వార్డు దండు శీను 9వ వార్డు సద్దల తులసి వెంకట్ రాములు 10 వార్డు, జుబేదా అమ్మ గారు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఆర్ పరమేష్ తులసి రాజు యాదవ్ కాంగ్రెస్ పార్టీ అన్ని గ్రామాలకు సంబంధించిన సర్పంచులు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శనేశ్వర స్వామికి పాక్షిక త్రయోదశి తిలతైల అభిషేక పూజలు...



**నాగర్ కర్నూల్ ఫిబ్రవరి 21( స్కైన్యూస్):**శ్రీ విశ్వవసు సంవత్సరం ఫాల్గుణ మాసం శుక్ల పక్షం చవితి శనివారం నాడు బీజినేపల్లి మండలం పరిధిలోని నంది వడ్డేమాన్ గ్రామంలో గల శనేశ్వర స్వామికి భక్తులచే శని గ్రహ దోష నివారణకు స్వామి వారికి తిలతైలా అభిషేకలు భక్తితో వైభవంగా జరిగాయి.శ్రీసార్థాసప్త జేష్టమాత సమేత శనేశ్వర స్వామికి శనివారం నాడు ప్రత్యేకంగా తిలతైల అభిషేకాల పూజలు నిర్వహించారు.ఆలయ ప్రధాన అర్చకులు డాక్టర్ గవ్వమఠం విశ్వనాథ శాస్త్రి మాట్లాడుతూ ఈ మాసంలో స్వామివారిని కొలిచిన అత్యధిక సంతృప్తి పొంది విశేష ఫలితాన్ని భక్తులకు ఇస్తారని ఆయనఅన్నారు. ప్రతి ఒక్కరు జన్మ రిత్యా, గోచార రీత్యా శనిగ్రహ దోష నివారణకు స్వామివారిని శక్తిమేరకు పూజించాలని అన్నారు. ఈ ఆలయంలో గోన బుద్ధారెడ్డి కాలంనాటి బ్రహ్మసూత్రం గల పరమశివునికి భక్తులచే రుద్రాభిషేక పూజలు, అర్చనలు,దీపారాధన నందీశ్వర స్వామి వారికి ప్రత్యేక అర్చనపూజలు భక్తులచేనిర్వహించారు.అనంతరం భక్తులకు వేద ఆశీర్వచనం తీర్థ ప్రసాదాల పంపిణీ చేశారు.ఈకార్యక్రమం లో ఆలయ ఆలయ చైర్మన్ వెల్దండ గోపాల్ రావు, గ్రామ సర్పంచ్ టి.సుగుణమ్మ,కమిటీ సభ్యులు కెంచె రాజేష్, ప్రభాకరచారి,పుల్లయ్య, అడ్వకేట్ వీర శేఖర్ చారి,శ్రీకాంత్ రెడ్డి,ఆలయ ఆర్చకులు గవ్వమఠం శాంతి కుమార్, ఉమమహేశ్వర్,సిబ్బంది గోపాల్ రెడ్డి భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

## దివ్యాంగుల ప్రత్యేక గ్రీవెన్స్‌లో 37 దరఖాస్తులు స్వీకరణ



**జోగులాంబ గద్వాల, ఫిబ్రవరి 21(స్కై న్యూస్):**జిల్లాలోని దివ్యాంగుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ రావు అధికారులను ఆదేశించారు. శనివారం ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ ఆదేశాల మేరకు దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి నిర్వహించిన ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ పాల్గొని, దివ్యాంగులతో దరఖాస్తులు స్వీకరించి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ ప్రత్యేక గ్రీవెన్స్ లో 37 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, వారి సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా పరిపాలన యంత్రాంగం కట్టుబడి ఉందని తెలిపారు. ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదులు స్వీకరిస్తున్నప్పటికీ, దివ్యాంగుల ప్రత్యేక అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించడం జరిగిందని తెలిపారు. అర్హులైన దివ్యాంగులు సదరం సర్టిఫికెట్లతోపాటు ఇతర సంక్షేమ పథకాల లబ్ధి పొందేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ప్రతి దరఖాస్తును సమగ్రంగా పరిశీలించి, అర్హులైన దివ్యాంగులకు వేగవంతంగా సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇక నుంచి ప్రతి నెల మూడో శనివారం దివ్యాంగులకు ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సునంద, సంబంధిత శాఖల ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం ఒక వరం

**అంబత్రాయ స్వామి ఆదిపరాశ్రీ బస్సుకేటాయింపు ఆదర్శం**

**బాధపడ్డాను..విద్యార్థులు బాధ పడొద్దనే...**

**నా హిందీ టీచర్ కు వంద బాకీ పడ్డా**

**స్వామి ఆది పరాశ్రీ**

**బిజ్వార్ జెడ్పీ పాఠశాలలో ఉచిత పాఠశాల బస్సును ప్రారంభించిన కలెక్టర్.**







**నారాయణపేట ఫిబ్రవరి 21: (స్కైన్యూస్)** గ్రామీణ ప్రాంతాల విద్యార్థు లు పాఠశాలకు సురక్షితంగా సకాలంలో చేరుకునే రవాణా సౌకర్యం కల్పించేందుకు ఏర్పాటు చేసిన ఉచిత పాఠ శాల బస్సు ఒక వరం అని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ పేర్కొన్నారు. నారాయణ పేట జిల్లా ఉట్కూరు మండలం బిజ్వార్ గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు అదే గ్రామానికి చెందిన అంబా త్రయ క్షేత్రం వ్యవస్థాపకులు శ్రీ శ్రీ ఆదిత్య పరాశ్రీ స్వామీజీ రూ.40 లక్షల వ్యయం గల పాఠశాల బస్సును ఉచితంగా అందజేశారు. శనివారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదిత్య పరాశ్రీ స్వామీజీ తో కలిసి ఉచిత పాఠశాల బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూదూర ప్రాంత గ్రామాల నుంచి పాఠశాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్న విద్యార్థులకు ఈ సేవ ఎంతో ఉపయోగకరంగా నిలుస్తుందన్నారు.ఈ సేవను బిజ్వార్‌కు చెందిన శ్రీ ఆదిత్య పరాశ్రీ స్వామీజీదాతృత్వంతో ఏర్పాటు చేశారని, ఆయన ఏర్పాటు చేసిన ఈ రవాణా సౌకర్యం ద్వారా మండలం లోని కొత్తపల్లి, పాతపల్లి, మొగ్దుంపూర్ గ్రామాలకు చెందిన మొత్తం 63 మంది విద్యార్థులు ప్రత్యక్ష లబ్ధి పొందనున్నట్లు ఆమె తెలిపారు. ఈ బస్సు సేవ వల్ల విద్యార్థులు సురక్షితంగా, సమయానికి పాఠశాలకు చేరుకొని నిరంతర విద్యా భ్యాసం కొనసాగించేందుకు అవకాశం ఉందని చెప్పారు. గ్రామీణ వెనుకబడిన ప్రాంతా ల విద్యార్థులకు విద్య అందు బాటులో ఉండేందుకు రవా ణా సౌకర్యం కీలకమని తెలి పారు. స్థానిక పండుగలు వేడుకల కారణంగా తరచుగా విద్యార్థులు పాఠశాలకు గైర్హాజరు కావడం వారి అభ్యా సానికి అంతరాయం కలిగి స్తుందని పేర్కొంటూ, విద్యకు ఎల్లప్పుడూ ప్రథమ ప్రాధా న్యం ఇవ్వాలని తల్లిదండ్రులు గ్రామ ప్రజలను కలెక్టర్ ను కోరారు. తరచూ గైర్హాజరు వల్ల విద్యార్థుల భవిష్యత్తుపై ప్రభావం పడుతుందని క్రమ బద్ధమైన హాజరుకు కుటుం బాలు సమాజం కలిసికట్టుగా బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. శ్రీ శ్రీ ఆదిత్య పరాశ్రీ స్వామీజీ మాట్లాడుతూ తాను చిన్న ప్పుడు ఇదే పాఠశాలలో చదువుకున్నానని తెలిపారు. ఆ పాఠశాల పట్ల ఉన్న కృతజ్ఞతాభావంతోనే ఈ రవాణా సౌకర్యాన్ని ఏర్పాటు చేశానన్నారు. తాను చేసింది సేవ కాదని,బాధ్యత కర్తవ్యం అని అన్నారు. తాను చదు వుకునే రోజుల్లో ఇంట్లి అన్ని పనులు చేసి పాఠశాలకు ఆలస్యంగా వచ్చేవాడిని, అలాంటిది పక్క ఊర్ల నుంచి విద్యార్థులు నడుచుకుంటూ రావడం సాహసమే అన్నారు. పుట్టిన ఊరికి, చదువుకున్న పాఠశాలకు ఏదో ఒకటి చేయ డం ధర్మం అని తెలిపారు. ప్రతిరోజూ విద్యార్థులు నడు చుకుంటూ ఆశ్రమం ముందు నుంచి పాఠశాలకు వెళ్తుండ టం చూసి తనకు ఎంతో బాధ కలిగిందని, ఆ కష్టాన్ని తొల గించాలనే సంకల్పంతో ఈ ఉచిత బస్సు సేవను ప్రారంభించానని తెలిపారు. 2024 లో పాఠశాలకు బస్సు ఇవ్వాలని నిర్ణయించుకుంటే అన్ని నియమ నిబంధనల ప్రకారం ప్రక్రియ పూర్తి చేయడానికి 2026 జనవరి అయిందన్నారు. బస్సు విష యంలో ఆర్టీవో ఎంతో సహక రించింది అని చెప్పారు. సేవా కార్యక్రమాలు స్వచ్ఛందంగా చేయడం ఎంత ముఖ్యమో, అవి చట్టపరమైన పరిమితు లలోనే లోబడి ఉండటం మరింత ముఖ్యమని స్వామీ జీ పేర్కొన్నారు. సమాజానికి సేవ చేయాలనే ఉద్దేశం ఉన్న ప్పటికీ ప్రతి కార్యక్రమం చట్టా న్ని గౌరవిస్తూ నిర్వహించా ల్సిన బాధ్యత మనందరిదని తెలిపారు. దేశంలో ఉన్న స్వామీజీలు దేశానికి ధర్మానికి కట్టుబడి ఉంటారని ఆయన తెలిపారు. బిజ్వార్ జెడ్పీ పాఠశాలకు చెందిన విద్యా ర్థులు ఈ ఉచిత బస్సు అవ కాశాన్ని సద్వినియోగం చేసు కొని క్రమం తప్పకుండా పాఠ శాలకు హాజరవుతూ తమ లక్ష్యాలను సాధించాలని ఆయన ఆకాంక్ష వ్యక్తం చేశారు.కార్యక్రమంలో తన చిన్ననాటి ఉపాధ్యాయు రాలు సంజన ని దర్శించగానే స్వామీజీ భావోద్వేగానికి లోనయ్యారు. గురువుల పట్ల తనకు ఉన్న గౌరవాన్ని వ్యక్తం చేస్తూ, జీవితంలో ఎదుగుద లకు గురువుల మార్గదర్శక త్వమే అసలు పునాది అని పేర్కొన్నారు. తనకు పాఠశా లలో రెండుసార్లు 50, 50 రూపాయల పరీక్ష ఫీజు చెల్లిం చిన హిందీ టీచర్ సంజనకు తాను 100 రూపాయలు బాకీ ఉన్నానని, వాళ్ళ ఇంటికి వెళ్ళి 100 రూపాయలు ఇస్తా నని నవ్వుతూ చెప్పారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యాశాఖ అధికారి గోవింద రాజులు మాట్లా డుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేసిన జిల్లాల పరంగా రాష్ట్రం లో మన జిల్లా రెండవ జిల్లా గా నిలవడం గర్వకారణమని తెలిపారు. ముఖ్యంగా ఆధ్యా త్మిక రంగంలో ఉన్న వ్యక్తి స్వచ్ఛందంగా ముందుకొచ్చి విద్యార్థుల కోసం ఇలాంటి సేవా కార్యక్రమాన్ని చేపట్టడం అత్యంత ఆదర్శప్రాయమని అభినందించారు. సమాజం లోని అన్ని వర్గాలు విద్యాభి వృద్ధికి తోడ్పడితే ప్రభుత్వ పాఠశాలలు మరింత బలోపే తం అవుతాయని పేర్కొన్నా రు.ఉపాధ్యాయులు, తల్లిదం డ్రులు గ్రామ ప్రజలు ఈ సేవ ను అభినందిస్తూ, ఇది విద్యా ర్థుల ప్రయాణ కష్టాలను తగ్గించి పాఠశాల హాజరును మెరుగుపరుస్తుందని తెలిపా రు.అంతకు ముందు జిల్లా పరిపాలన తరపున కలెక్టర్ స్వామీజీ దాతృత్వానికి హృదయపూర్వక కృతజ్ఞ తలు తెలియజేస్తూ, ఇటువం టి సేవా కార్యక్రమాలు మరింత మందిని విద్యాభివృ ద్ధి దిశగా ప్రేరేపిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీవో మేఘా గాంధీ, తహసిల్దార్ చింత రవి, ఎంపీడీవో కిషోర్ కుమార్, బిజ్వర్ గ్రామ సర్పంచ్ అంజయ్య, కొత్తపల్లి సర్పంచ్ నర్సిములు, పాత పల్లి సర్పంచ్ తెరప్ప, మొగ్దుం పూర్ సర్పంచ్ తిరుమలేష్, పాఠశాల హెచ్ఎం కిషోర్ కుమార్, విద్యాశాఖ అధికారు లు రాజేంద్ర కుమార్, విద్యా సాగర్, నాగార్జున రెడ్డి, తపస్ జిల్లా అధ్యక్షుడు నరసింహ, నాయకులు శేర్ కృష్ణ రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమి టీ చైర్మన్ పద్మమ్మ, గ్రామానికి చెందిన వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# బాధితులపై అక్రమ కేసులు దారుణం

**తెలంగాణ దళిత సమక్ష జిల్లా అధ్యక్షులు ఎదిరేపల్లి కాశన్న...**



**నాగర్ కర్నూల్ ఫిబ్రవరి 21 (స్కై న్యూస్)** మండల పరిధిలోని కుమ్మెర గ్రామంలో జాతర సందర్భంగా జరిగిన వివాదంతో దళిత బడుగు బలహీన వర్గాలకు రక్షణగా నిలవవలసిన పోలీసులు బాధితులపై అక్రమంగా కేసులు నమోదు చేసి ఆ గ్రామానికి చెందిన రెడ్డి సామాజిక వర్గానికి చెందిన వారికి వత్తాసు పలకడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని తీవ్రస్థాయిలో విరుచుకోపడ్డారు. గ్రామానికి చెందిన చంద్రకళ కుటుంబం దేవుడు దర్శనానికి వెళ్ళగా అదే గ్రామానికి చెందిన తుకారాం రెడ్డి శ్రీనివాస్ రెడ్డి శ్రీకాంత్ రెడ్డి సతీష్ రెడ్డి కన్ని రెడ్డి తో పాటు మరికొందరు వారిపై దాడి చేయడంతో పాటు సుమారు మూడు గంటల పాటు చిత్రహింసలకు గురి చేయడం సభ్య సమాజం తలదించుకునే సంఘటనగా ఆయన అభివర్ణించారు పోలీసులు నిందితులను శిక్షించవలసింది పోయి వారికి వత్తాసు పలుకుతూ బాధితుల పైన కేసులు నమోదు చేయడమే కాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల నాలుగు నెలల చిన్నారి నిండు జీవితాన్ని బలి కావాల్సిన సంఘటన ఏర్పడిందని ఈ సంఘటనకు ఎవరు బాధ్యత వహిస్తారని ఆయన ప్రశ్నించారు వీటిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని మానవ హక్కులను కాపాడాలని ఆయన పోలీసులకు విజ్ఞప్తి చేశారు

# కేంద్ర మంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు...



**జోగులాంబ గద్వాల, ఫిబ్రవరి 21(స్కై న్యూస్):**కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామి ఈ నెల 23న అలంపూర్ ఆలయాలకు వస్తున్న నేపథ్యంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో కేంద్ర మంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై జిల్లా ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి కలెక్టర్ సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. అలంపూర్ లోని హెలిపాడ్ నుంచి ఆలయానికి వెళ్లే రహదారిలో ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. విద్యుత్ స్తంభాలు, తీగలు ఏమైనా ప్రమాదకరంగా ఉంటే వాటిని సరి చేయించాలని సూచించారు. అలంపూర్ పట్టణ ప్రధాన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పురపాలక సంఘం అధికారులకు తెలిపారు. ప్రోటోకాల్ ప్రకారం అతిథి మర్యాదలు చేయాలని, ఇతర అవసరమైన ఏర్పాట్లన్నీ సజావుగా పూర్తి చేసుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర మంత్రి పర్యటన నేపథ్యంలో శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పటిష్ట పోలీస్ బందోబస్తును నియమిస్తున్నామన్నారు. పోలీసుల గౌరవ వందనం, తమ శాఖ నుంచి చేయాల్సిన ఇతర అన్ని ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో శ్రీనివాసరావు, డీఎస్పీ మొగిలయ్య, ఆర్ అండ్ బి ఈఈ ప్రగతి, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాస రెడ్డి, ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం



**జోగులాంబ గద్వాల, ఫిబ్రవరి 21(స్కై న్యూస్);**అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా మీనాణ డిగ్రీ కాలేజీలో నిర్వహించిన వేడుకల్లో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) శ్రీ బి. నర్సింగ్ రావు గారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కాలేజీలో ఏర్పాటు చేసిన తెలుగు రచయితల ఫోటో ప్రదర్శన (ఎగ్జిబిషన్) ను పరిశీలించి, తెలుగు భాష గొప్పతనం మరియు ప్రముఖ రచయితల సాహిత్య సేవలను కొనియాడారు.అనంతరం కాలేజీ లైబ్రరీని తనిఖీ చేసి, విద్యార్థులకు అవసరమైన అన్ని పుస్తకాలు సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని, పోటీ పరీక్షలకు సంబంధించిన గ్రంథాలు కూడా ఏర్పాటు చేయాలని యాజమాన్యానికి సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షేక్ కలందర్ గారు, తెలుగు అధ్యాపకులు హరి నాగభూషణం గారు, ఇతర అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## పేట చైర్ పర్సన్ ను సన్మానించిన కాకర్ల నారాయణమ్మ



**నారాయణపేట ఫిబ్రవరి 21:( స్కైన్యూస్)** నారాయణపేట మున్సిపల్ చైర్ పర్సన్ కొండా శ్వేత సత్యయాదవ్ ను శనివారం 3వ వార్డు బి ఆర్ ఎస్ కౌన్సిలర్ కాకర్ల నారాయణమ్మ భీమయ్య శాలువా కప్పి మిఠాయి తినిపించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా 3వ వార్డు సమస్యల పరిష్కారానికి అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందించాలని చైర్ పర్సన్ కోరారు.కాకర్ల నారాయణమ్మ ను చైర్ పర్సన్ కొండా శ్వేత సత్యయాదవ్ దంపతులు సన్మానించి అభినందనలు తెలిపారు.

## ప్రజల అంచనాలకు అనుగుణంగా
# గ్రామ పరిపాలన అందించాలి

**సర్పంచుల ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్.**





**నారాయణపేట ఫిబ్రవరి 21 (స్కైన్యూస్)** కొత్తగా ఎన్నికైన సర్పంచులకు ఏర్పాటు చేసిన ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమాన్ని సర్పంచులు సద్వినియోగం చేసుకుని ప్రజల అంచనాలకు అనుగుణంగా తమ తమ గ్రామాలలో మంచి పరిపాలన అందించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ ఆదేశానుసారం గ్రామీణాభివృద్ధి సంస్థ సహకారంతో శనివారం జిల్లా కేంద్రానికి సమీపంలోని సింగారం మలుపు దారి వద్ద గల వృత్తి నైపుణ్య శిక్షణా కేంద్రంలో నూతనంగా ఎన్నికైన సర్పంచుల 3వ , 4వ బ్యాచ్ శిక్షణా కార్యక్రమం ముగింపులో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గతేడాది డిసెంబర్ 17 వరకు జిల్లాలో మూడు విడతలలో సర్పంచుల ఎన్నికలను పూర్తి చేశామని తెలిపారు. అదే నెల 24 న స్వయాన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లాలోని కోస్గి పట్టణంలో కొత్తగా ఎన్నికైన నారాయణ పేటజిల్లా ( కొడంగల్ నియోజకవర్గంలోని) సర్పంచులను సన్మానించారు. కొత్తగా ఎన్నికైన సర్పంచులకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించడం జరిగిందని, అందులో భాగంగానే మన జిల్లా కేంద్రంలోనూ ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమం ప్రారంభించుకున్నాం అని ఆమె చెప్పారు. 5 రోజుల పాటు నిర్వహించినా ఈ శిక్షణా కార్యక్రమంలో సీనియర్ అధికారులు, మాస్టర్ ట్రైనర్లు 2018 పంచాయతీ రాజ్ చట్టంపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించి సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యుల విధులు, బాధ్యతలు, అధికారాలు గురించి వివరించారని తెలిపారు. మున్ముందు మరిన్ని శిక్షణా కార్యక్రమాలను కూడా నిర్వహించుకుందాం అని ఆమె తెలిపారు. వేసవి కాలంలో వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తాగునీరు తదితర అంశాల గురించి సర్పంచుల అవగాహన కలిగి ఉండాలన్నారు. తడి పొడి చెత్త వేరువేరుగా సేకరించి డంపింగ్ యార్డ్ లో తరలించాలని గ్రామాలు పారిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద పనులకు ఎంతమంది లేబర్ వస్తున్నారో పరిశీలించాలని గ్రామాలలో సిసి రోడ్లు డ్రెయిన్లు 100% నిర్మించేలా , బాల్య వివాహాలు అరికట్టాలి సర్పంచులు చొరవ తీసుకోవాలని అన్నారు.గ్రామాలలో శాంతి భద్రతల పరిరక్షణలో సర్పంచుల పాత్ర కీలకమని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు. సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... దేశ అభిరుద్ధి గ్రామం నుంచే ప్రారంభమవుతుంది కాబట్టి గ్రామాలు అభివృధి చెందాలంటే సర్పంచూ ల పాత్ర ముఖ్యమని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ సర్పంచులకు తెలిపారు. కుల మత పార్టీ లకు అతి తంగా గ్రామాలను అభివృధి పరుచుకోవాలని సూచించారు. భారత దేశం లో ఇద్దరికీ మాత్రమే పార్టీ లకు సంబంధం లేకుండా ఎన్నుకుంటారని ఒక్కటి రాష్ట్రపతి గారిని ఇంకొకరు సర్పంచని తెలిపారు. పిల్లలకు చెడు వేసినాలకు దూరంగా ఉండేటట్లు చూడాలని, అలాగే కేంద్ర రాష్ట్ర ప్రాభుత్వాలు విద్యార్ధి విద్యార్థినులకు ప్రత్యేక చట్టాలను తీసుకొచ్చాయని సూచించారు. భేటీ బచ్చవు భేటీ పాడావ్ అనే కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. త్వరలో ఒక మంచి కార్యక్రమం ద్వారా గ్రామానికి పోలీసు వస్తారని, ప్రతి గ్రామం లో ఓ ఫీర్యాదుల బాక్స్ ను ఏర్పాటు చేస్తామని అలాగే ఊర్లలో ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు వచ్చినచో పోలీసులకు సమాచారం ఇవ్వాలని,బాల్య వివాహలను అరికటలని బాల్యవివాహాన్ని సమర్ధించారాదు అని సూచించారు. అనంతరం సర్పంచ్ లకు సర్టిఫికెట్ లు అందజేసినారు. ఈ సమావేశంలో డి .పి.ఓ.సుధాకర్ రెడ్డి,సర్పంచ్ లు, సి.ఐ.ఎస్.ఐ.లు ఎంపీడీవో శ్రీధర్ రమేష్ ,సుదర్శన్, ఎంపిఓ ధన్వాడ వెంకటేశ్వర్ రెడ్డి ,ఏపీవో మొగులప్ప ,ఎంపీవో పావని ఉదయ్ ప్రసన్న సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఫింగర్ ప్రింట్ డివైస్ తో తనిఖీలు...






**ఎస్సై వెంకటేశ్వర్లు**

**నారాయణపేట ఫిబ్రవరి 21: (స్కైన్యూస్)** నారాయణపేట జిల్లా కేంద్రంలో శనివారం జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు ఫింగర్ ప్రింట్ డివైస్ ద్వారా ఎస్సై వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు.నారాయణపేట జిల్లా కేంద్రంలో ముందస్తు నేరాల నియంత్రణలో భాగంగా దొంగతనాల నివారణనే లక్ష్యంగా, అనుమానిత వ్యక్తులను, పాత నేరస్తులను గుర్తించడానికి బ్లూ కోర్ట్స్ పోలీసులు హనుమంత్, అశోక్ లు ప్రత్యేక తనిఖీలు నిర్వహించడం జరిగిందని ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. నారాయణపేట బస్టాండ్, ప్రధాన చౌరస్తాల లో, బ్యాంకుల వద్ద అకస్మి కంగా ఫింగర్ ప్రింట్స్ డివైస్ తో తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా సంచ రిస్తున్న వ్యక్తులను తగిన రీతిలో పరిశీలించి, ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ ఫింగర్ ప్రింట్ డివైస్ తో వ్యక్తు ల వేలిముద్రలు సేకరించి క్రిమి నల్ రికార్డులతో సరి పోల్చా రు. పౌరులు ఎటువంటి అనుమానాస్పద వ్యక్తులు గమనించిన వెంటనే లోకల్ పోలీసులకు లేదా డయల్ 100 కి సమాచారం ఇవ్వాల ని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## రంజాన్ మాసం సందర్భంగా పనుల ఏర్పాట్ల గురించి మున్సిపల్ చైర్మన్ తో చర్చించిన మైనారిటీ నాయకులు...

**రంగారెడ్డి జిల్లా (స్కై న్యూస్) ఫిబ్రవరి 21 :-** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని సౌకర్యాల ఏర్పాట్ల పై మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బస్వశీ తో కలసి చర్చలు నిర్వహించిన మైనార్టీ నాయకులు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్, మహ్మద్ ఇబ్రహీం ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ బస్వం అప్ప మాట్లాడుతూ త్వరలో మున్సిపల్ కమిషనర్, ముస్లిం పెద్దలతో కలసి సమావేశం ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కారం చేస్తానని పేర్కొన్నారు.

## దాస్టికం..... మృత్యువాతలోకి
# రెండు నెలలు చిన్నారి



**నాగర్ కర్నూల్ ఫిబ్రవరి 21( స్కైన్యూస్)** సభ్య సమాజం తలదించుకునే విధంగా మండల పరిధిలోని కుమ్మెర గ్రామంలో జరిగిన దాస్టికం లో 2నెలల చిన్నారి మృత్యువాత పడడం హృదయ విచార సంఘటనగా మారింది. బూతులు తిట్టారు.... దర్శనానికి వెళ్తే గెంటేశారు..... దౌర్జన్యం చేశారు దాడులకు పాల్పడిన సంఘటన పై పలు ప్రజా సంఘాలు తీవ్రస్థాయిలో ఖండించారు. కుమ్మెర గ్రామంలోని మల్లన్న బ్రహ్మోత్సవాల సందర్భంగా అదే గ్రామానికి చెందిన రజక సామాజిక వర్గానికి చెందిన గణేష్ కుటుంబం దర్శనానికి వెళ్లడం జరిగిందని అక్రమంగా వందల రూపాయలు వసూలు చేయడానికి అడగడంతో అదే గ్రామానికి చెందిన సర్పంచ్ తుకారం రెడ్డి కనుసైగలలో శ్రీనివాస్ రెడ్డి శ్రీకాంత్ రెడ్డి సతీష్ రెడ్డి తోపాటు మరికొందరు టెంకాయల రూములో వేసి మూడు గంటలపాటు విచక్షత కోల్పోయి జరిగిన దాడిలో తీవ్రంగా గాయాలయ్యాయని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. అడ్డుకునేందుకు వెళ్లిన భార్య మౌనిక మరియు తల్లి పద్మలను తోసి వేయడంతో రెండు నెలల చిన్నారి తీవ్ర గాయాలయి శనివారం ఉదయం మృతి చెందారని సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెళ్లిన పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబాన్ని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నేత లక్ష్మణ్ గౌడ్, బహుజన సమాజ్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జ్ కళ్యాణ్ తో పాటు పలు ప్రజాసంఘాల నాయకులు పరామర్శించి కుటుంబాన్ని ఆదుకోవాలని నిందితులను శిక్షించాలని లేదంటే పెద్ద ఎత్తున ఉద్యోగం చేపడతామని హెచ్చరించారు

## కుత్బుల్లాపూర్ సర్కిల్లో బిల్లులు ఇవ్వకుండ కాంట్రాక్టర్
# వేధిస్తున్న ఇంజనీరింగ్ అధికారులు

**సంఘీశెట్టి రవీంద్రసాగర్ ను**

**ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ తమ సొంత ఆస్తులు పెంచుకుంటున్నా ఇంజనీరింగ్ అధికారులు**

**ఏసీబీ అధికారులు దాడులు జరిగిన మారని ఇంజనీరింగ్ అధికారులు**

**కాంట్రాక్టర్లను ఇబ్బంది పెట్టే ఎస్టిమేట్లను తయారుచేసి మామూళ్లు వసూలు చేస్తున్న ఇంజనీరింగ్ అధికారులు**

**ప్రభుత్వానికి భారీ నష్టం వచ్చేలా వ్యవహరిస్తున్న కూకట్పల్లి సర్కిల్ ఇంజనీరింగ్ అధికారులు**






**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 21 (స్కై న్యూస్):** కూకట్ పల్లి జోన్ కుత్బుల్లాపూర్ సర్కిల్ యందు మూడు సిసి రోడ్స్ టెండర్ వేయడం జరిగిందని మూడు పనులు నాకే టెండర్ రావడం జరిగిందని 27 అక్టోబర్ 2025 నాడు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పాపమ్మతో ఏఈ యోగిశ్వర్ తో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లక్ష్మి గణేష్తో ఎం సి బి కి కొద్ది రోజుల క్రితం దొరికిన సూపర్డెంట్ ఇంజనీర్ చిన్నారెడ్డి తో కలిసి ఇబ్బంది పెడుతున్న ఇంజనీర్లు అని కాంట్రాక్టర్ సంగిశెట్టి రవీందర్ సాగర్ తెలిపారు. ఈ సందర్భంగా మీడియాతో కాంట్రాక్టర్ సంగిశెట్టి రవీందర్ సాగర్ మాట్లాడుతూ టెండర్ లో తీసుకున్న సి సి రోడ్డు పనులు వర్కు విజిట్ చేయడం జరిగింది అక్కడ సీసీ రోడ్డు మనుషులతో తీయుటకు, బీటీ రోడ్డు మనుషలతో తీయుటకు ఏష్టిమేట్లో పెట్టడం జరిగింది అదేవిధంగా కాటింగ్ 10 కిలోమీటర్లు లీడ్ పెట్టడం జరిగిందని తెలుపడం జరిగింద. ఈ ఈ, డి ఈని సార్ సీసీ రోడ్డు మనుషులతో పగలగొట్టడం కుదరదు వీటి రోడ్డు మనసులతో పగలగొట్టడం కుదరదు మన జిహెచ్ఎంసి ల్యాండ్, మరో ఒక్క ల్యాండ్ 10 కిలోమీటర్ల లోపు లేదు కనుక 25 కిలోమీటర్ల లేదు, కంప్రెషలతో బీటీ, సిసి రోడ్డు కానీ పగలగొట్టుటకు వర్క్ స్లిప్పు చేయండి మేము వర్కు చేయగలుగుతామని అడగడం జరిగిందని, వాళ్లు కరెక్టే మీరు వర్క్ ఆర్డర్ తీసుకుని రండి మేము వర్కు స్లిప్పు చేసి పంపిస్తాము అని చెప్పడం జరిగిందని, అనంతరం మమ్ములను ముందే సీసీ రోడ్డు పనిపై నీవు సిసి రోడ్డు వేస్తావు ఆ తర్వాత అధికారులకు మామూలు ఇవ్వవంట అని ఇలా అడిగి ఒక పథకం ప్రకారం కొంత పనిని చేయించి దానికి సంబంధించిన ఎస్టిమేట్లో కాంట్రాక్టర్లకు ఇబ్బంది కలిగేలాగా చేసి కాంట్రాక్టర్లతో బెరసారాలు చేసుకొని వాళ్లకు తగిన రేట్ల రూపకంగా వర్క్ స్లిప్పు చేయించి ఆమోదింప చేస్తున్నారని, వాళ్లు చెప్పిన మాట కాంట్రాక్టర్ వినకుంటే పనులు చేపించడంలో జాప్యం చేస్తూ కాలయాపన చేస్తూ కాంట్రాక్టర్లను ఇబ్బందికి గురి చేస్తున్నారని ఆయన అన్నారు. ఈ వ్యవహారంలో ఏఈ యోగిశ్వర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పాపమ్మ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లక్ష్మీ గణేష్, సూపరిండెండెంట్ ఇంజనీర్ చిన్నారెడ్డి తో కలిసి ఈ వ్యవహారంలో అందరూ మూకుమ్మడిగా కాంట్రాక్టర్ తో భేరసారాలు చేసి వాళ్లకు తగినంత ముడుపులు ఇచ్చాక కాంట్రాక్టర్కు బిల్లులు ఇవ్వడం జరుగుతుందని లేకుంటే ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఇదే డబ్బుల వ్యవహారంలో గత కొద్ది రోజుల క్రితం చిన్నారెడ్డి సూపరిండెంట్ ఇంజనీర్ ని ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండ్ గా పట్టుకోవడం జరిగిందని ఇలాంటి వ్యవహారంలో ప్రజలను ఇబ్బంది చేస్తూ కాంట్రాక్టర్లను ఇబ్బంది పెడుతూ పెద్ద మొత్తంలో ముడుపులు దండుకుంటూ ఎసిబి అధికారులకు చిక్కిన ఎలాంటి భయం లేకుండా విచ్చలవిడిగా బహిరంగంగానే డబ్బులు కాంట్రాక్టర్ల నుండి వసూలు చేస్తున్నారని ఇలాంటి అధికారులపై జిహెచ్ఎంసి కమిషనర్, ప్రభుత్వం, ఏసీబీ అధికారులు విజిలెన్స్ ఎంక్వైరీ లాంటివి చేయించి ఇలాంటి అవినీతి అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వంను కోరారు.

## అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం...




**జోగులాంబ గద్వాల, ఫిబ్రవరి 21(స్కై న్యూస్);** అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా మీనాణ డిగ్రీ కాలేజీలో నిర్వహించిన వేడుకల్లో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) శ్రీ బి. నర్సింగ్ రావు గారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాలేజీలో ఏర్పాటు చేసిన తెలుగు రచయితల ఫోటో ప్రదర్శన (ఎగ్జిబిషన్) ను పరిశీలించి, తెలుగు భాష గొప్పతనం మరియు ప్రముఖ రచయితల సాహిత్య సేవలను కొనియాడారు. అనంతరం కాలేజీ లైబ్రరీని తనిఖీ చేసి, విద్యార్థులకు అవసరమైన అన్ని పుస్తకాలు సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని, పోటీ పరీక్షలకు సంబంధించిన గ్రంథాలు కూడా ఏర్పాటు చేయాలని యాజమాన్యానికి సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షేక్ కలందర్ గారు, తెలుగు అధ్యాపకులు హరి నాగభూషణం గారు, ఇతర అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

**అర్ధరాత్రి వరకు కొనసాగిన మ్యాచులు**

**ప్రీ క్వార్టర్ ఫైనల్ చేరిన నారాయణపేట జిల్లా మహిళల,పురుషుల జట్లు**




**నారాయణపేట ఫిబ్రవరి 21 (స్కై న్యూస్ )** గ్రామాల్లో ఉన్న ప్రతిభను వెలికితీసి దేశానికి నైపుణ్యం గల క్రీడాకారులను అందించడమే లక్ష్యంగా నిర్వహిస్తున్న సీఎం కప్ రెండవ ఎడిషన్ లో భాగంగా నారాయణపేట జిల్లా మక్తల్ డిగ్రీ కళాశాల మైదానంలో నిన్నటి నుండి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభమయ్యాయి అర్ధరాత్రి వరకు మ్యాచ్ లు కొనసాగాయి. రాష్ట్రంలోని 33 జిల్లాల నుండి 66 టీంలు సుమారు 1200మంది క్రీడాకారులు ఈ పోటీలో పాల్గొంటున్నారు. నారాయణపేట జిల్లాలో మొదటిసారిగా మక్తల్ పట్టణంలో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈపోటీలు విజయవంతం కోసం నారాయణపేట జిల్లా యువజన క్రీడ సమైక్య ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. ఆకట్టుకున్న నారాయణపేట జిల్లా మహిళ,పురుషుల టీంలు నారాయణపేట జిల్లా మహిళల మరియు పురుషుల జట్లు ఆడిన మ్యాచ్ లను అద్భుతంగా ఆడి అన్ని ఆటలో ప్రత్యర్థ టీంలను ఓడించి ప్రీ క్వార్టర్ ఫైనల్ కు చేరుకున్నాయి. ఉత్కంఠభరితంగా జరుగుతున్న పోటీలను తిలకించేందుకు క్రీడాభిమానులు పెద్దఎత్తున తరలివచ్చి ఆటగాళ్లను ప్రోత్సహించారు. మ్యాచ్ లను తిలకించడానికి వచ్చిన అభిమానుల కోసం గ్రౌండ్ లో ప్రత్యేక ఏర్పాట్లను జిల్లా యూవజన క్రీడ సమైక్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన స్పోర్ట్స్ అధికారి వెంకటేష్ శెట్టి,స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రెటరీ శ్రీనివాస్ రెడ్డి,జిల్లాలోని పిడి లు నర్సిములు, రత్నయ్య,బాలరాజ్ గౌడ్,వెంకటప్ప,రామకృష్ణ రెడ్డి,అనంత సేన,ఊసు రవి,శ్రీధర్ గౌడ్,సాయినాథ్,మౌలాలి,రాజేశ్వరి, పరంజ్యోతి,రాజశేఖర్, నర్సింహారెడ్డి, విష్ణువర్ధన్, ఈశ్వర్,నరేష్,రూప,స్వరూప,రేణుక,పర్వీన్ బేగం మిగితా పిఈటి లు పాల్గొన్నారు

# భారత పరిశోధనా పితామహుడు



శాంతి స్వరూప్ భట్నాగర్ (ఫిబ్రవరి 21, 1894 ? జనవరి 1, 1955) గురించి తెలియని వారుండరు. భారతదేశం గర్వించదగ్గ శాస్త్రజ్ఞుడు భట్నాగర్. భట్నాగర్ ను భారత పరిశోధన శాలల పితామహుడిగా అభివర్ణిస్తారు. కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ ప్రథమ డైరెక్టర్. యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ (జఉఅ) తొలి మొదటి ఛైర్మన్. దేశంలో మొత్తం 12 పరిశోధన శాలలను ఆయన స్థాపించాడు. ఆయన జ్ఞాపకార్థం భారత ప్రభుత్వం శాంతి స్వరూప్ భట్నాగర్ పురస్కారం స్థాపించింది. శాంతి స్వ రూప్ భట్నాగర్ బ్రిటిష్ ఇండియా లోని పంజాబ్ ప్రాంతంలోని, ఇప్పటి పాకిస్తాన్లో ఉన్న షాపూర్లో, హిందూ కాయస్థ కుటుంబంలో 1894 ఫిబ్రవ రి 21న భట్నాగర్ జన్మించాడు. చిన్ననాటి నుండి సాహిత్యమన్నా, విజ్ఞాన శాస్త్రమన్నా విపరీతమైన ఆసక్తిని పెంచు కున్నాడు. కవిత్వం లో మంచి ప్రవేశ ముండేది. బాల్యం నుండే బొమ్మలు, యంత్ర పరికరాలు చేయటంలో ఆసక్తి కనబరిచేవాడు. తన ప్రాథమిక విద్యను దయానంద్ ఆంగ్లో-వేద ఉన్నత పాఠశాల, సికింద్రా బాద్ (బులంద్ షహర్ ) నుండి పూర్తి చేశాడు. 1911లో లాహోర్ లోని కొత్తగా స్థాపించ బడిన దయాల్ సింగ్ కాలేజీలో చేరాడు. భట్నాగర్ 1913లో పంజాబ్ విశ్వ విద్యాలయం ఇంటర్మీడియట్ పరీక్షలో ఉత్తీర్ణుడ య్యాడు. ఫోర్మాన్ క్రిస్టియన్ కళాశాలలో చేరాడు. 1916లో భౌతిక శాస్త్రంలో గ్రాడ్యుయేషన్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశాడు. విదే శాల్లో చదువుకోవడానికి దయాళ్ సింగ్ కాలేజ్ ట్రస్ట్ ద్వారా స్కాలర్ షిప్ పొంది, యూనివర్సిటీ కాలేజ్ లండన్‌లో 1921 లో సైన్స్‌లో డాక్టరే ట్ పొందాడు. భారతదేశానికి తిరిగి వచ్చి, కొత్తగా స్థాపించ బడిన బనా రస్ హిందూ విశ్వవిద్యాలయం లో రసాయన శాస్త్ర ప్రొఫెసర్‌గా చేరా డు. తర్వాత విశ్వ విద్యాలయం లోని ఫిజికల్ కెమిస్ట్రీ ప్రొఫెసర్, యూనివర్సిటీ కెమికల్ లాబొరే టరీస్ డైరెక్టర్‌గా లాహోర్‌కు మారాడు. మాగ్నెటోకెమిస్ట్రీ, ఫిజికల్ కెమిస్ట్రీ ఆఫ్ ఎమల్షన్ రంగాలలో పరిశోధనతో పాటు, అప్లైడ్ కెమిస్ట్రీ లో కూడా గణనీయమైన కృషి చేసాడు. రావల్పిండి ప్రాంతంలో ఒక బ్రిటిష్ కంపెనీ చమురు అన్వేషణా కార్యక్రమం చేపట్టిన రోజుల్లో ఒక సమస్య ఎదురైంది. చమురు ఉన్న ప్రాంతం బురదమయంగా ఉండేది. పైగా డ్రిల్ చేసిన బురద ఉప్పు నీటితో కలిసి గట్టిగా రాయిలాగా మారి, డ్రిల్లింగ్ కు అంతరాయం కలిగించేది. ఒక దశలో పనిపూర్తిగా ఆగిపోయేది. అపుడు కంపెనీవారు భట్నాగర్ ను సలహా కోరారు. భట్నాగర్ ఈ సమస్యను కూలం కషంగా పరిశీలించి అతిసులభ మైన, చవకైన పరిష్కారాన్ని సూచించాడు. డ్రిల్ చేసిన బురదకు జిగురు కలపమని సలహా ఇచ్చా డు. జిగురు కలిపిన బురదకు స్నిగ్ధత తక్కువై గట్టిపడకుండా ఉండటంతో బ్రిటీష్ కంపెనీ కొన్ని లక్షల రూపాయల నష్టం నుండి బయట పడింది. వెంటనే కంపెనీ వారు ఆయనకు లక్షాయాభై వేల రూపాయలు బహుకరించారు. ఆ సొమ్మును లాహ్పూరు యూనివర్శిటీకి చమురు పరిశోధనల కోసం విరాళంగా ఇచ్చాడు. భట్నాగర్ చమురు పరిశోధనా భివృద్ధికి ఎంతో కృషి చేశాడు. మైనాన్ని వాసన లేకుండా ఎలా రూపొందించాలో ఆయన తెలియ చేశాడు. కిరోసిన్ ను శుద్ధి చేయ డం, వెలుగును ఎక్కువ చేయటం, ఆదా చేయడం గురించి భట్నాగర్ విలువైన సమాచారాన్ని అందించా డు. పెట్రోలియం నుండి విడుదల య్యే వ్యర్థ పదార్థాలను చమురు పరిశ్రమలో ఎలా ఉపయోగించాలో పరిశోధించాడు. ఆయన ఊఎఖీ కు డైరెక్టరయ్యాడు. వ్యర్థ పదార్థాల నుండి ప్లాస్టిక్స్ చేయడం, రబ్బరు వస్తువులను రూపొందించడం వంటి పరిశోధనలను ముమ్మరం చేశాడు. కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ స్వయం ప్రతిపత్తి సంస్థగా, 28 సెప్టెంబర్ 1942న అమలులోకి వచ్చింది. 1943లో ఆయనను ఫెలో ఆఫ్ రాయల్ సొసైటీగా ఎన్ను కున్నారు.

శాంతి స్వరూప్ భట్నాగర్... హోమీ జహంగీర్ భాభా, ప్రశాంత చంద్ర మహలనోబిస్, విక్రమ్ సారాభాయ్ తదితరులతో పాటు భారతదేశ స్వాతంత్ర్యానంతర శాస్త్ర సాంకేతి క మౌలిక సదుపాయాలు, విధానా ల నిర్మాణంలో గణనీయమైన పాత్ర పోషించాడు. విద్యా మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా మరియు ప్రభుత్వ విద్యా సలహాదారుగా కూడా పని చేశాడు. నేషనల్ రీసెర్చ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా స్థాపనలో అతను కీలక పాత్ర పోషించి, దేశంలో ఇండస్ట్రి యల్ రీసెర్చ్ అసోసియేషన్ ఉద్యమానికి నాంది పలికాడు. భట్నాగర్ భారత దేశములో వివిధ ప్రాంతాలలో...సెంట్రల్ ఫుడ్ ప్రాసెసింగ్ టెక్నలాజికల్ ఇన్‌స్టిట్యూట్ మైసూర్ , నేషనల్ కెమికల్ లాబొరేటరీ పూణే , నేషనల్ ఫిజికల్ లాబొరేటరీ న్యూఢిల్లీ , నేషనల్ మెటలర్జికల్ లాబొరేటరీ జంషెడ్‌పూర్ , సెంట్రల్ ఫ్యూయల్ ఇన్‌స్టిట్యూట్ ధన్‌బాద్ వంటి మొత్తం 12 జాతీయ ప్రయోగ శాలలను స్థాపించాడు. నెహ్రూ హయాంలో ప్రభుత్వం నుండి నిధులను సమకూర్చి చమురు పరిశోధనా వనరులను అభివృద్ధి చేశాడు. దేశంలో చమురు వనరు లు, చమురు నిక్షేప స్థావరాలు, అణుఖనిజ పరిశ్రమలు అభివృద్ధి చెందాయంటే అది భట్నాగర్ కృషే ప్రధాన కారణం. భట్నాగర్ 1955 జనవరి 1వ తేదీన మరణించాడు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో శాస్త్ర వేత్తలు కనబరిచిన ప్రతిభకు నిదర్శనంగా, ఆయా రంగాలకు వారు అందించిన సేవలకు గుర్తింపు గా ప్రతి ఏటా ఇచ్చే శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డులు భారత శాస్త్ర రంగంలో అత్యున్నతమైనదిగా పరిగణిస్తారు. ఈ పురస్కారం మొదటి సారి 1958 లో యివ్వబడి నది. 45 సంవత్సరాల వయసు వరకు, శాస్త్ర మరియు సాంకేతిక రంగాలలో పరిశోధన చేస్తూ ఉంటే ఈ పురస్కారానికి అర్హత పొందు తాడు. ఈ పురస్కారం ఒక పతకం, నగదు బహుమతి 5 లక్షలు అందజేయ బడుతుంది. అదనంగా ఆ పురస్కార గ్రహీత 65 వ సంవత్సరం వరకు ప్రతీ నెలా రూ. 15,000 అందజేయ బడుతుంది.

# భాషా సంస్కృతులను రక్షించుకుందాం



ఒక సమాజం యొక్క సంపూర్ణ జీవన విధానమే ఆ సమాజపు సంస్కృతి. సంస్కృతి అంటే సంస్కరించినది అని అర్థం. ఆ సమాజంలో పాటించే ఆచారాలు, పద్ధతులు, సంప్రదాయాలు, వస్త్రధారణ, భాష, మతం, ఆటలు, విశ్వాసాలు, కళలు, జీవన విధానం, అన్నీ సంస్కృతిలోని భాగాలే. తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలకు వేలాది ఏళ్ల చరిత్ర ఉంది. ప్రాచీన అర్ష విద్యా సభ్యతా సంస్కృతులకు ఆలవాలమైన భారతావనిలో తెలుగు సంస్కృతికి విడదీయరానిది బంధం అనుబంధం ఉన్నాయి. తెలుగు సంస్కృతిలో భాగమై నానాటికీ అనాదరణకు గురవుతున్న తెలుగు భాష పునర్ వైభవానికి కృషి సల్పాల్సిన సమయం ఆసన్నమైంది. విదేశాల్లో తెలుగు వికాసానికి ఎనలేని కృషి జరుగుతుంటే, ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కనుమరుగయ్యే ప్రమాదంలోపడింది. బతుకు తెరువు కోసం ఆంధ్ర ప్రాంతం నుంచి మారిషస్ కు వెళ్ళిన వ్యవ సాయ కూలీలు 185 సంవత్స రాలుగా తమ మాతృభాష అయిన తెలుగు భాషను పరిరక్షిస్తూనే ఉన్నారు. 12.5 లక్షలకు పైగా జనాభాలో లక్ష మందికి పైగా తెలుగు వాళ్లు ఉండగా... తమ వారసులకు, భావితరాల వారికి, తెలుగు భాషలో సాధికారిక కతను సాధించి పెట్టేందుకు కృత నిశ్చయంతో, తెలుగు భాషా మాధ్య మంలో పాఠశాలలు నిర్వహింప చేసుకుంటూ తమ పిల్లల్ని తమ మాతృభాషలోనే చదివించడం గొప్పలలో కెల్లా గొప్ప. అక్కడ తెలుగు వారికోసం చాలా సంస్థలు ఉన్నాయి. ఉత్సవాల్లో అందరూ తెలుగులోనే మాట్లాడే ప్రయత్నం చేస్తారు. మారిషస్ అధికారిక టీవీ చానెల్లో కూడా వారానికి ఒక తెలుగు సినిమా వేస్తారు. డీడీ యాదగిరి చానెల్ మారిషస్‌లో వస్తుంది.ప్రాథమిక స్థాయి నుంచి విశ్వ విద్యాలయ స్థాయి వరకూ తెలుగు నేర్చుకునే అవకాశాలు ఉన్నాయి. మారిషస్ యూనివర్శిటీలో తెలుగులో డిప్లొమా, డిగ్రీ కోర్సులు ఉన్నాయి. అంతే కాకుండా, మారిషస్ తెలుగు మహా సభ, తెలుగు సాంస్కృతిక కళా నిలయం, తెలుగు సాంస్కృతిక నిలయం, తెలుగు భాషా సంఘం వంటి సంస్థలు అక్కడ తెలుగు భాషను, సంస్కృతిని కాపాడటానికి ప్రయత్నిస్తున్నాయి. ఆస్ట్రేలియాలో తెలుగు భాషా వికాసం కోసం చాలాకాలంగా అనేక సాహిత్య, సాంస్కృతిక సంస్థలు కృషి చేస్తూ భావి తరాలకు బాటలు వేస్తున్నాయి. 'తెలుగుమల్లి' సాహిత్య మాసపత్రిక, 'భువన విజయం' వంటి సాంస్కృతిక సంస్థలు ఈ క్రమంలో తెలుగు ప్రజల అస్తిత్వానికి ప్రతీకలుగా నిలిచాయి. తెలుగు భాషకు ఆస్ట్రేలియాలో అరుదైన గౌరవం లభించింది. అక్కడి పాఠశాలల్లో తెలుగును ఐచ్ఛిక అంశంగా చేరుస్తూ ఆస్ట్రేలియా ప్రభుత్వం కీలక ఆదేశాలిచ్చింది. దీంతో ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల్లో ఇకపై పన్నెండో తరగతి వరకు తెలుగు భాషను నేర్చుకునే అవకాశం కలిగింది. ఇందుకు ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్, సిడ్నీ, విక్టోరియా, న్యూసౌత్‌వేల్స్, క్వీన్స్‌లాండ్, సౌత్ ఆస్ట్రేలియా మొదలైన రాష్ట్రాల్లోని తెలుగు వారి పిల్లలకు ఒకటో తరగతి నుంచి పన్నెండో తరగతి వరకు తెలుగు ఐచ్ఛికంగా ప్రాథమిక, మాధ్యమిక పాఠశాలల్లో చదువుకొనే అవకాశం కలగనుంది. ఆస్ట్రేలియా "తెలుగు సమాఖ్య, తెలుగుమల్లి, భువనవిజయం" వంటి సాంస్కృతిక సంస్థలు,16 ఏళ్లు కృషి చేసి విజయం సాధించాయి.అమెరికాలో మన తెలుగు భాషకు గౌరవం దక్కింది. డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం అమెరికాలో ప్రజలకు సమాచారం అందించేందుకు అధికారిక భాషగా తెలుగు భాషను గుర్తించింది. యూ ఎస్ ఆధారిత ఇమ్మిగ్రేషన్ స్టడీస్ ఇటీవలి అధ్యయనం తెలుగును యుఎస్ లో వేగంగా అభివృద్ధి చెందుతున్న భాషగా చూపిస్తుంది, ఇది గత ఏడు సంవత్సరాలలో 86% పెరిగింది. 2020లో అమెరికా అధ్యక్ష ఎన్నికలు నవంబర్ 3 న జరగగా, ఆ ఎన్నికల్లో ఓటరు బ్యాలెట్ పేపర్‌లోని అధికారిక భాషల జాబితాలో తెలుగు భాష కూడా చేర్చారు. ఇటీవలే సద్గురు ఘంటసాల ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ట్రస్ట్, వంశీ ఇంటర్నేషనల్ ఇండియా, సాంస్కృతిక కళాసారథి సింగపూర్ సంయుక్త ఆధ్వర్యంలో తానా, వంగూరి ఫౌండేషన్, యునైటెడ్ కింగ్డమ్ తెలుగు అసోసియేషన్, సీపీ బ్రౌన్ తెలుగు సమాఖ్య (లండన్), దక్షిణాఫ్రికా తెలుగు సాహిత్య వేదిక, తెలుగు మల్లి ఆస్ట్రేలియా, తెలుగు అసోసియేషన్ సిడ్నీ, న్యూజిలాండ్ తెలుగు అసోసియేషన్, హాంగ్ కాంగ్ తెలుగు సమాఖ్య, వేగేశ్న ఫౌండేషన్ వారి సంయుక్త నిర్వహణలో కళాప్రపూర్ణ, పద్మభూషణ్, సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత దేవులపల్లి కృష్ణశాస్త్రి 123వ జయంతి సందర్భంగా 'మొట్టమొదటి ప్రపంచ సంగీత సాహిత్య సమ్మేళనం' అత్యంత వైభవంగా నిర్వహించారు. 2020 నవంబర్ 1 ఆదివారం రోజున 12 గంటలపాటు నిర్విరామంగా ఈ కార్యక్రమం అద్భుతంగా నిర్వహించ బడింది. అంతేకాదు...మొట్టమొదటి ప్రపంచ సంగీత సాహిత్య సమ్మేళనం' కార్యక్రమానికి.. 'వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్' 'తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్'లో గౌరవ స్థానం దక్కింది. 12 గంటల ఈ నిర్విరామ సంగీత కార్యక్రమాన్ని వేలాది మంది వీక్షించి, ఆనందించడం సంగీత చరిత్రలో ఒక చెరిగి పోని సంఘటన. ఇదివరలో, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరితో కలిసి ఒక ఫెస్టివల్ జరపాలనే ఆలోచనతో సౌందర్య లహరి పేరిట అమెరికా జయహో భారతీయం అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి నిశ్చయించి, తానా సంస్థ మహిళా కోఆర్డినేటర్ తూనుగుంట్ల శిరీష, జిజ్ఞాస అధినేత భార్గవ్ సాయంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ మాజీ సంచాలకులు డాక్టర్ డి విజయభాస్కర్, ఆంధ్ర ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షులు గోళ్ల నారాయణరావు లతో సంప్రదించి సౌందర్యలహరి కార్యక్రమాన్ని ప్రపంచ తెలుగు సాంస్కృతిక మహోత్సవంగా మార్చి ప్రణాళిక రూపొందించారు. ప్రపంచ తెలుగు సాంస్కృతి మహోత్సవంలో దాదాపు 45 దేశాల నుంచి 64 తెలుగు సంఘాలు ఒకే తాటి పైకి వచ్చాయి. తెలుగు చరిత్ర లో కనీవినీ ఎరుగని రికార్డ్ అది. జయహో భారతీయం- భారతదేశం, జిజ్ఞాస ? భారతదేశం తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా, ఆంధ్ర ప్రదేశ్ అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఆఫ్రికా, ఫ్రాన్స్ తెలుగు అసోసియేషన్, సౌత్ ఆఫ్రికా తెలుగు కమ్యూనిటీ, జర్మనీ తెలుగు అసోసియేషన్, సింగపూర్ తెలుగు సమాజం, తెలుగు అసోసియేషన్ ఆఫ్ లండన్, బహరేన్ తెలుగు కళాపరిషత్, తెలుగు వెలుగు జర్మనీ, డెన్మార్క్ తెలుగు అసోసియేషన్, తెలుగుఅసోసియేషన్ ఆఫ్ ఆస్ట్రేలియా, తెలుగు అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఆస్ట్రేలియా, సింగపూర్ తెలుగు కమిటీ, చైనా తెలుగు అసోసియేషన్, తెలుగు అసోసియేషన్ ఆఫ్ స్కాట్లాండ్, తెలుగు అసోసియేషన్ ఆఫ్ కెన్ బెర్రా, కామన్ అసోసియేషన్ ఆఫ్ చైనా, యునైటెడ్ తెలుగు అసోసియేషన్ ఫోరమ్ ? కువైట్, తెలుగు కళా సమితి కువైట్, ఆస్ట్రేలియా తెలుగు సమితి, ఆస్ట్రేలియా తెలంగాణ స్టేట్ అసోసియేషన్, తెలుగు అసోసియేషన్ ఆఫ్ సిడ్నీ, సౌదీ తెలుగు అసోసియేషన్, సౌత్‌ఆఫ్రికా తెలుగు కమ్యూనిటీ, తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఆఫ్రికా, తెలుగు కల్చరల్ సొసైటీ నార్త్రెన్-ఐర్లాండ్, తెలుగు కళా సమితి బహరెయిన్, తెలుగు అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఇజ్లాండ్ ? న్యూజి ల్యాండ్, తెలుగు బ్యాత్మెంటిన్ క్లబ్ ఆఫ్ కాంటెంబరి ? న్యూజి ల్యాండ్, తెలుగు కళా సమితి ? ఓమాన్, దుబాయ్ తెలుగు అసోసియేషన్, ఖత్తర్ తెలుగు అసోసియేషన్, నార్వే తెలుగు అసోసియేషన్, అమెరికా తెలుగు మహిళ సంఘం లతో పాటు ఆయా ఆయా దేశాలలో వివిధ రాష్ట్రాల తెలుగు అసోసియేషన్స్ భాగస్వామ్యం అయ్యాయి. తెలుగు భాషను నికోలే కొంటి "ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్" అని 1402 లోనే ప్రశంసించారు. మొగల్ చక్రవర్తి ఔరంగజేబు అరబ్బీ భాషలో తనకు పాఠాలు బోధించి, తన బాల్యం అంతా వృధా పరిచారని, తన గురువుకు రాజ్య బహిష్కరణ లాంటి తీవ్ర శిక్ష విధించిన విషయం చరిత్ర చెప్తుంది. ఔరంగజేబు తన గురువుకు రాసిన నాటి చారిత్రాత్మక ఉత్తరాన్ని 1910లో కొమర్రాజు లక్ష్మణరావు తెలుగులోకి అనుమతించడమే కాక, తన కాలం నాటి ఆంగ్ల మాధ్యమం చదువుల వల్ల భవిష్యత్ తరాలు ఔరంగజేబు లాగా మనలను తప్పు పడతాయని హెచ్చరించారు. ఈ తరం విద్యార్థులకు తెలుగు ప్రాచీన వైభవం, సంస్కృతి సంప్రదాయాల పట్ల కనీస అవగాహన లేకుండా పోతున్నది. దేశ భాషలందు "తెలుగు లెస్స" అన్న నానుడి దేశ భాష లందు "తెలుగు లెస్" అనే దురవస్థకు రాబోతోంది. తెలుగు ప్రజలు తమ మాతృభాషను కాపాడుకుంటూ ప్రపంచమంతా విస్తరించారు. ప్రపంచ వ్యాప్తంగా తెలుగు మాట్లాడేవారు 15 కోట్ల దాకా ఉంటారని ఒక అంచనా. 2011 జనాభా లెక్కల ప్రకారం భారతదేశంలో దాదాపు 9 కోట్ల మంది (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోనే ఎక్కువగా) తెలుగు మాట్లాడేవారు ఉన్నారు. వాస్తవానికి తెలుగు మాధ్యమాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నది తెలుగు జాతి. ప్రపంచంలో "మా తల్లి భాష మాకొద్దు, ఇతర భాషల ముద్దు" అని చెప్పగలిగే జాతి ఏదైనా ఉంది అంటే నిస్సిగ్గుగా అది తెలుగు జాతి మాత్రమే. "తెలుగుకు" పట్టిన ఈ "తెగులు" ఈనాటిది కాదు. కాలక్రమేణ, అవిభక్త ఆంధ్ర దేశం పూర్తిగా మారిపోయి ప్రస్తుతం ఆంగ్ల దేశంగా రూపుదిద్దుకుంటోంది. అజంతాలతో ఉండటం వలన ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్ అని సంబోధించబడిన, అద్భుత భాష అంతరించి పోకుండా మరల జవసత్వాలని అందించాల్సిన అవసరం అనివార్యంగా ఉంది.

## మహబూబ్‌నగర్ యువకుడికి మెదడు శస్త్రచికిత్స....



**మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 21(స్కైన్యూస్):** హైదరాబాద్‌లోని యశోద హాస్పిటల్స్ మలక్‌పేట్ శాఖలో వైద్యులు అత్యంత క్లిష్టమైన సెరిబెల్లార్ ట్యూమర్ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి మహబూబ్‌నగర్‌కు చెందిన 35 ఏళ్ల యువకుడి ప్రాణాలను కాపాడారు.జిల్లాకు చెందిన రాథ్లావత్ హరిలాల్ అనే యువకుడు గత రెండు నెలలుగా తీవ్రమైన తలనొప్పి, తల తిరగడం, చూపు మందగించడం, వాంతులతో బాధపడుతూ డిసెంబర్ 21, 2025న ఆసుపత్రిలో చేరాడు. ముందుగా చేసిన ఎంఆర్ఐ స్కాన్‌లో మెదడులో ఎడమ వైపు సెరిబెల్లార్ ప్రాంతంలో గడ్డ (ట్యూమర్) ఉన్నట్లు గుర్తించారు.తక్షణమే వైద్యులు శస్త్రచికిత్స అవసరమని నిర్ణయించి, డిసెంబర్ 24న జనరల్ అనస్థీషియా కింద సబ్-ఆక్సిపిటల్ క్రానియోటమీ ద్వారా గడ్డను పూర్తిగా తొలగించారు. ఈ శస్త్రచికిత్సను సీనియర్ న్యూరోసర్జన్ డా. శ్రీనివాస్ బొట్ల నేతృత్వంలోని బృందం విజయవంతంగా నిర్వహించింది.శస్త్రచికిత్స అనంతరం రోగిని న్యూరో ఐసీయూలో పర్యవేక్షణలో ఉంచగా, ఎలాంటి నర సంబంధ సమస్యలు లేకుండా కోలుకున్నాడు. అనంతరం డిసెంబర్ 26న పూర్తిగా కోలుకుని డిశ్చార్జ్ అయ్యాడు.ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ, సెరిబెల్లార్ ప్రాంతంలో ట్యూమర్లు తలనొప్పి, వాంతులు, తల తిరగడం వంటి లక్షణాలతో కనిపిస్తాయని, సకాలంలో గుర్తించి శస్త్రచికిత్స చేయడం అత్యంత ముఖ్యమని తెలిపారు.యశోదా హాస్పిటల్స్‌లో అత్యాధునిక న్యూరోసర్జరీ సదుపాయాలు, అనుభవజ్ఞులైన వైద్య బృందం వల్ల ఇటువంటి క్లిష్టమైన శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించగలుగుతున్నామని ఆసుపత్రి యాజమాన్యం పేర్కొంది.

## మీడియా కొత్త కమిటీకి దరఖాస్తు...



**జోగులాంబ గద్వాల, ఫిబ్రవరి 21(స్కై న్యూస్):** మీడియా ప్రతినిధులకు 2026-28 కొత్తగా అక్రిడిటేషన్ జారీ కొరకు జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ ఏర్పాటుకు చర్యలు - జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ జిల్లాలోని మీడియా ప్రతినిధులకు 2026-28 సంవత్సరాలకు కొత్త అక్రిడిటేషన్ ల జారీ కొరకు నూతన జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ (ఐమీూజ) ఏర్పాటుకు చర్యలు ప్రారంభించినట్లు జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ (ఐమీూజ)లో సభ్యత్వం పొందేందుకు జి.ఓ. 252 ప్రకారం జిల్లాలోని మీడియా అసోసియేషన్లు, సంఘాలు తమ ప్రతినిధి పేరును లెటర్ ప్యాడ్ పై రాసి ఫిబ్రవరి 24 వ తేదీ ఉదయం 11 గంటల లోపు జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

1. బిగ్ తెలుగు డైలీ నుండి ఒక ప్రతినిధి.
2. ఉర్దూ డైలీ నుండి ఒక ప్రతినిధి
3. మీడియం డైలీ నుండి ఒక ప్రతినిధి
4. స్మాల్ డైలీ నుండి ఒక ప్రతినిధి
5. ఎలక్ట్రానిక్ మీడియా నుండి ఒక ప్రతినిధి
6. వీడియో జర్నలిస్ట్ నుండి ఒక ప్రతినిధి
7. ఫోటో జర్నలిస్ట్ నుండి ఒక ప్రతినిధి.

పై సూచించిన ప్రతినిధులు ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 252 లోని రూల్ 3, సబ్ రూల్ 1(సి) ప్రకారం ఫుల్ టైం జర్నలిస్ట్ అయి ఉండాలి. అదే విధంగా బిగ్ డైలీ ప్రతినిధి, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధికి 10 సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలి, మిగిలిన ప్రతినిధులకు కనీసం 5 సంవత్సరాల మీడియా రంగంలో అనుభవం కలిగి ఉండాలి. నిబంధనల ప్రకారం జిల్లాలోని అసోసియేషన్ లు, సంఘాలు తమ ప్రతినిధుల పేర్లను ఫిబ్రవరి, 24 ఉదయం 11 గంటల లోపు జిల్లా పౌర సంబంధాల అధికారి, జోగులాంబ గద్వాల జిల్లా కార్యాలయంలో అందజేయాలని సూచించారు. గడువు తర్వాత వచ్చిన ఎలాంటి ప్రతిపాదనలు ఎట్టిపరిస్థితుల్లోనూ స్వీకరించబడవని తెలియజేశారు.

## ఎన్ఎస్ఎస్ వాలంటరీస్ గా రెండవ రోజు ప్రోగ్రాం...



**పాలెం/ఇబ్రహీంపేట** :ప్రభుత్వ డిగ్రీ కళాశాల హాలియా ఎన్ఎస్ఎస్ వాలంటరీ స్ జాతీయ సేవా పథకంలో భాగంగా పాలెం మరియు ఇబ్రహీంపేటలోని రెండవ రోజు ప్రోగ్రాం లో భాగంగా పాఠశాల ప్రాంగణంలోని పిచ్చి మొక్కలను ,చెత్తను, చెట్లకు పాదులు తీయడం మరియు పాఠశాల ప్రాంగణాన్ని మొత్తం శుభ్రం చేయడం జరిగింది. అదేవిధంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పాఠశాలలోని వివిధ తరగతుల బాలబాలికలకు ఎన్ఎస్ఎస్ వాలంటరీస్ చే అవగాహన తరగతులను నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డాక్టర్ కాంతయ్య , సిహెచ్ రాజు మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

## వసతి గృహాలపై అధికారులు పర్యవేక్షణ జరపాలి

**నాగర్ కర్నూల్ ఫిబ్రవరి 21 (స్కై న్యూస్):**జిల్లాలోని వసతి గృహాలలో అధికారుల పర్యవేక్షన పడకేసిందని బిఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మద్దెలబండ సాయిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు వసతి గృహ అధికారులు సమయ పాలన పాటించక పోవటంతో విద్యార్థులు రాత్రి వేలలలో బయట తిరుగుతున్నారు, చదువు పై శ్రద్ధ వహించడం లేదని, ఆహారపు మెను అమలు అవ్వడం లేదని జిల్లా యస్సీ అభివృద్ధి అధికారి ఉమాపతికి వినతి పత్రం అందజేశారు. పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్నాయని, పర్యవేక్షణ అధికారులు నిర్లక్ష్యం వీడి, తనిఖీలు చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు నగేష్, కురుమూర్తి పాల్గొన్నారు.

# జామకాయను ఉప్పుతో కలిపి తినొచ్చా?



జామకాయను ఉప్పుతో కలిపి తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని వైద్య నిపుణులు అంటున్నారు. ముఖ్యంగా నల్ల ఉప్పు లేదా రాతి ఉప్పుతో తీసుకుంటే జీర్ణక్రియ మెరుగుపడుతుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. రక్తంలో చక్కెర నియంత్రణకు తోడ్పడుతుంది. గుండె ఆరోగ్యానికి మంచిదని చెబుతున్నారు. జామకాయను ఉప్పుతో కలిపి తినడం ఆరోగ్యానికి మంచిదా కాదా అనే సందేహం చాలామందికి ఉంటుంది. ఈ ప్రశ్నకు వైద్యులు సమాధానం ఇచ్చారు. సరైన పద్ధతిలో తీసుకుంటే జామకాయను ఉప్పుతో తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. జామకాయ కేవలం రుచిని మాత్రమే కాదు.. అపారమైన పోషక ప్రయోజనాలను కలిగి ఉంటుంది. విటమిన్ సి, ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లతో సమృద్ధిగా ఉండే ఈ పండు అనేక విధాలుగా మన శరీరానికి మేలు చేస్తుంది. జామ మీ రోగనిరోధక శక్తిని పెంచడంలో, జీర్ణక్రియను మెరుగుపరచడంలో, మీ చర్మాన్ని మెరిసేలా చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఆపిల్ కంటే పది రెట్లు ఎక్కువ ప్రోటీన్, మూడు నారింజల కంటే ఎక్కువ విటమిన్ సి జామకాయలో లభిస్తుంది. ముఖ్యంగా జామకాయను నల్ల ఉప్పు లేదా రాతి ఉప్పుతో కలిపి తినడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని వైద్యులు అంటున్నారు.

జీర్ణక్రియ మెరుగుదల: జామకాయలో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. నల్ల ఉప్పుతో కలిపి తింటే ఇది మలబద్ధకం, ఆమ్లత్వం, ఉబ్బరం వంటి కడుపు సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగుపరుస్తుంది. రోగనిరోధక శక్తి పెరుగుదల:జామపండ్లలో నారింజ కంటే ఎక్కువ విటమిన్ సి ఉంటుంది. ఇది శరీర రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది. ఉప్పు ద్రవ సమతుల్యతకు సహాయపడటంతో, ఇది రోగనిరోధక వ్యవస్థకు ఒక గొప్ప కలయికగా మారుతుంది. రక్తంలో చక్కెర నియంత్రణ: జామకాయ రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇది మధుమేహగ్రస్తులకు లేదా రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించాలనుకునే వారికి ప్రయోజనకరంగా ఉంటుంది. గుండె ఆరోగ్యం: జామపండ్లలోని యాంటీ ఆక్సిడెంట్లు, ఫైబర్ చెడు కొలెస్ట్రాల్‌ను, రక్తపోటును తగ్గించడంలో తోడ్పడుతుంది. ఉప్పు ఎలక్ట్రోలైట్ సమతుల్యతను కంట్రోల్‌గా ఉంచుతుంది. తద్వారా గుండె ఆరోగ్యం మన చేతుల్లోనే. ఊబకాయం: జామకాయలో అధిక ఫైబర్, తక్కువ కేలరీలు ఉండటం వల్ల బరువు నియంత్రణకు కూడా సహాయపడుతుంది. ఉప్పుతో కలిపి తీసుకుంటే పోషకాల శోషణ మెరుగుపడుతుంది. అయితే, కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం మంచిది. మీకు అధిక రక్తపోటు ఉన్నట్లయితే, ఉప్పు వినియోగాన్ని తగ్గించుకోవాలి లేదా వైద్యుని సలహా తీసుకోవాలి.

## డయాబెటిక్ రోగులకు సూపర్‌ఫుడ్



బరువు తగ్గాలనుకునేవారికి, డయాబెటిక్ రోగులకు, ఇతర హార్మోనల్ సమస్యలు ఉన్నవారికి జొన్న జావా ఒక అద్భుతమైన ఎంపిక.. ఎన్నో పోషకాలున్న ఈ సులభమైన వంటకం కేవలం 10-15 నిమిషాల్లో సిద్ధమవుతుంది. జొన్నపిండితో తయారుచేసే ఈ జావా, పెరుగుతో కలిపి తీసుకోవడం ద్వారా పోషక విలువలతో పాటు రుచిని కూడా అందిస్తుంది. ఆరోగ్యకరమైన జీవనశైలిని కోరుకునేవారికి, ముఖ్యంగా బరువు తగ్గాలనుకునేవారికి, డయాబెటిక్ ఉన్నవారికి.. జొన్న జావ ఒక అద్భుతమైన పౌష్టిక ఆహారం అని ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు. ఇది అనేక ఆరోగ్య సమస్యలకు పరిష్కారంగా నిలుస్తుందని ప్రతిఒక్కరూ దీనిని సులభంగా తీసుకోవచ్చని పేర్కొంటున్నారు ఆరోగ్య నిపుణులు.. జొన్నలు (ూనీతీణష్ట్రబీఎ) గ్లూటెన్ రహిత, పోషకాలతో కూడిన అద్భుతమైన చిరుధాన్యం.. వీటిలో ఫైబర్, ప్రోటీన్, ఐరన్, మెగ్నీషియం, బి-విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడం, రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచడం, గుండె ఆరోగ్యాన్ని పెంపొందించడం, బరువు తగ్గడం, బలమైన ఎముకలకు సహాయపడుతుందని ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు. ఈ జొన్న జావా రెసిపీని ఎవరైనా, ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉన్నా చేసుకోని తాగవచ్చు. దయాబెటిస్, ప్రీ-దయాబెటిస్, అధిక బరువు, థైరాయిడ్, పీసీఓడీ, పీసీఓఎస్ వంటి హార్మోనల్ అసమతుల్యతలు ఉన్నవారు కూడా దీనిని నిస్సందేహంగా తీసుకోవచ్చు. రాగులు విషయంలో మాత్రం థైరాయిడ్ సమస్య ఉన్నవారు వారానికి ఒకసారి మాత్రమే తీసుకోవాలి.. కానీ.. మిగిలిన మిల్లెట్స్‌ను హాయిగా వినియోగించుకోవచ్చు. రొట్టెలు చేయడానికి సమయం లేనివారికి ఇది చాలా మంచి ఎంపిక.. ఎందుకంటే ఇది జొన్నలు తిన్నంత ప్రయోజనాన్ని అందిస్తుంది. జొన్న తయారీ విధానం..జొన్న జావా తయారీ చాలా సులువు. మొదట, రెండు చెంచాల జొన్నపిండిని ఉండలు కట్టకుండా నీటితో కలపాలి. ఒక గిన్నెలో తగినంత నీటిని తీసుకుని మరిగించాలి. నీరు మరిగేటప్పుడు, రుచికి

## భోజనం తర్వాత హోటళ్లలో సోంపు ఎందుకు ఇస్తారు?



జీర్ణక్రియను మెరుగుపరచడం నుంచి రక్త ప్రసరణ, కంటి ఆరోగ్యం వరకు సోంపు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. అందుకు ప్రతి ఇంటి వంట గదిలో ఇది తప్పక ఉంటుంది. అలాగే హోటళ్లలో భోజనం తర్వాత ప్లేట్‌లో సోంపు, చక్కెర వడ్డిస్తారు. ఇది కేవలం ఆతిథ్య మర్యాద మాత్రమే కాదు.. భోజనం తర్వాత సోంపు తినడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు లెక్కకు మించి ఉన్నాయి. జీర్ణక్రియను మెరుగుపరచడం నుంచి రక్త ప్రసరణ, కంటి ఆరోగ్యం వరకు సోంపు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. అందుకు ప్రతి ఇంటి వంట గదిలో ఇది తప్పక ఉంటుంది. అలాగే హోటళ్లలో భోజనం తర్వాత ప్లేట్‌లో సోంపు, చక్కెర వడ్డిస్తారు. ఇది కేవలం ఆతిథ్య మర్యాద మాత్రమే కాదు, దీని వెనుక గొప్ప ఆరోగ్య శాస్త్రం ఉంది. చాలా మంది దీనిని కేవలం నోరు శుభ్రం చేసుకునేందుకు ఉపయోగపడే పదార్థంగా భావిస్తారు. కానీ సోంపు ఔషధ గుణాల నిధి. సోంపులో ఉండే సహజ నూనెలు కడుపులో జీర్ణ రసాల స్రావాన్ని పెంచడంలో సహాయపడతాయి. ఇది ఆహారాన్ని త్వరగా జీర్ణం చేయడానికి సహాయపడుతుంది. మీరు అజీర్ణం, గ్యాస్, ఉబ్బరం వంటి సమస్యలతో ఇబ్బంది పడుతుంటే భోజనం తర్వాత కొంచెం సోంపు తినడం చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. అలాగే భోజనం తిన్న తర్వాత నోటిలో బ్యాక్టీరియా పేరుకుపోతుంది. దీనివల్ల దుర్వాసన వస్తుంది. మెంతులలోని యాంటీ బాక్టీరియల్ లక్షణాలు ఈ క్రిములను చంపుతాయి. ఇది శ్వాసను తాజాగా ఉంచడంలో కూడా సహాయపడుతుంది. నేటి వేగవంతమైన జీవితంలో అసిడిటీ సమస్య సర్వసాధారణంగా మారింది. శరీరంలో పిత్తాన్ని తగ్గించడానికి సోంపు సహాయపడుతుంది. తరచుగా గుండెల్లో మంటతో బాధపడేవారికి, సోంపు తినడం సహజమైన, ప్రభావవంతమైన నివారణ అని నిపుణులు సూచిస్తున్నారు.సోంపులో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. ఇది రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. దీనిలోని విటమిన్ ఎ కంటి దృష్టిని మెరుగుపరచడానికి సహజ పోషకంగా పరిగణించబడుతుంది. సోంపు శరీరం నుంచి విషపూరిత అంశాలను తొలగించడం ద్వారా రక్తాన్ని శుద్ధి చేయడానికి కూడా పనిచేస్తుంది. ఇది చర్మానికి సహజమైన మెరుపును ఇస్తుంది. సోంపు రుచికి మాత్రమే కాదు, ఆరోగ్యానికి కూడా మంచిది. అందుకే భోజనం తర్వాత మీ రోజువారీ అలవాట్లలో సోంపు చేర్చుకోవడం వల్ల సత్ఫలితాలను పొందవచ్చు.



## ఒక్క బూడిద గుమ్మడికాయ జీవితాన్నే మార్చేస్తుంది

ఊర్లల్లో ఎక్కడపడితే అక్కడ లభించే అద్భుతమైన ఔషధం బూడిద గుమ్మడికాయ.. అవును.. బూడిద గుమ్మడికాయ, కేవలం ఇంటి ముందు దిష్టి తీయడానికి లేదా వంటల్లో మాత్రమే కాకుండా, జ్యూస్ రూపంలో తీసుకుంటే అపారమైన ఆరోగ్య ప్రయోజనాలను అందించే ఒక అద్భుతమైన ఔషధంగా పనిచేస్తుందని ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు. ఊర్లల్లో ఎక్కడపడితే అక్కడ లభించే అద్భుతమైన ఔషధం బూడిద గుమ్మడికాయ.. అవును.. బూడిద గుమ్మడికాయ, కేవలం ఇంటి ముందు దిష్టి తీయడానికి లేదా వంటల్లో మాత్రమే కాకుండా, జ్యూస్ రూపంలో తీసుకుంటే అపారమైన ఆరోగ్య ప్రయోజనాలను అందించే ఒక అద్భుతమైన ఔషధంగా పనిచేస్తుందని ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు. దీనిలో దాగి ఉన్న అనేక ఔషధ గుణాల గురించి చాలామందికి తెలియదు. సరైన పద్ధతిలో తయారు చేసి తీసుకుంటే, ఇది మీ ఆరోగ్యాన్ని గణనీయంగా మెరుగుపరుస్తుంది. గుమ్మడికాయ విటమిన్ ం, అ, పీచు పదార్థం, యాంటీఆక్సిడెంట్లతో నిండిన అత్యంత పోషకమైన కూరగాయ.. ఇది రోగనిరోధక శక్తిని పెంచడంతోపాటు.. మొత్తం ఆరోగ్యాన్ని కాపాడటంలో ప్రభావవంతంగా ఉంటుంది. అందుకే.. ప్రతిరోజూ ఉదయాన్నే బూడిద గుమ్మడికాయ జ్యూస్ ను తాగడం మంచిదని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. బూడిద గుమ్మడికాయ జ్యూస్ కోసం 2 కిలోల నుండి 4 కిలోల బరువు గల మీడియం సైజు కాయలను ఎంచుకోవడం మంచిది.

బూడిద గుమ్మడి జ్యూస్ అనేక ఆరోగ్య సమస్యలకు నివారణగా పనిచేస్తుంది. బూడిద గుమ్మడి శరీరంలోని రోగనిరోధక శక్తిని గణనీయంగా పెంచుతుంది. కడుపునొప్పి, గ్యాస్ వంటి జీర్ణ సమస్యలను నివారిస్తుంది. ప్రేగులను శుభ్రపరిచి జీర్ణక్రియను క్రమబద్ధీకరిస్తుంది. గుండె ఆరోగ్యం: రక్త ప్రసరణను మెరుగుపరచి గుండె ఆరోగ్యానికి బలాన్ని చేకూరుస్తుంది. గుమ్మడి కాలేయం, కిడ్నీల పనితీరును మెరుగుపరుస్తుంది.

బూడిద గుమ్మడికాయ అధిక రక్తపోటును అదుపులో ఉంచుతుంది. రక్తంలోని చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది.

గుమ్మడిలో ఉండే విటమిన్-ఇ చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది.. కాల్షియం ఎముకలను దృఢంగా చేస్తుంది. బాడీని డిటాక్స్ చేయడంలో గుమ్మడికాయ ప్రభావవంతంగా ఉంటుంది. శరీరంలోని వ్యర్థ పదార్థాలను తొలగించడానికి అద్భుతంగా పనిచేస్తుంది. బూడిద గుమ్మడికాయలో 96% నీరు, అధిక పీచుపదార్థం, తక్కువ కార్బోహైడ్రేట్లు ఉంటాయి. క్యాలరీలు చాలా తక్కువ కాబట్టి బరువు తగ్గాలనుకునే వారికి ఇది అత్యంత ప్రయోజనకరం. ఒక గ్లాసు జ్యూస్ తాగడం వల్ల ఎక్కువసేపు కడుపు నిండినట్లు అనిపించి, చిరుతిండ్ల వైపు మనసు మళ్లదు, అతిగా తినడాన్ని నిరోధిస్తుంది. బూడిద గుమ్మడికాయ యాంటీ-క్యాన్సర్‌గా కూడా పనిచేస్తుందని పేర్కొంటున్నారు. యాసిడిటీని నియంత్రించి, శరీరాన్ని చల్లబరుస్తుంది. ఆందోళన చెందేవారు తరచూ ఈ జ్యూస్ తాగితే మంచి ఫలితం ఉంటుంది. పిల్లలలో జ్ఞాపకశక్తిని, రోగనిరోధక శక్తిని పెంచడానికి సహాయపడుతుంది.

జ్యూస్ తయారీ విధానం:బూడిద గుమ్మడికాయను జ్యూస్ చేసేటప్పుడు తొక్క, గుజ్జు, గింజలను తీయకూడదు. ఎందుకంటే వీటిలో కూడా ఎన్నో ఔషధ గుణాలు ఉంటాయి. కాయను శుభ్రం చేసి, ముక్కలుగా కట్ చేసుకోవాలి. జూసర్ ఉంటే, కట్ చేసిన ముక్కలను నేరుగా జూసర్‌లో వేసి జ్యూస్ చేసుకోవచ్చు. వడకట్టాల్సిన అవసరం ఉండదు. మిక్సీలో చేసేట్లయితే, ముక్కలను వీలైనంత చిన్నవిగా కట్ చేసి, కొద్దిగా నీరు కలిపి మెత్తని పేస్ట్‌లా చేసుకోవాలి. ఆ తర్వాత ఈ పేస్ట్‌ను వడకట్టుకుని జ్యూస్ తీసుకోవాలి. పరగడుపున తాగడం ఉత్తమం. జ్యూస్ తాగిన తర్వాత ఒక గంట వరకు ఏమీ తినకూడదు, తాగకూడదు. అప్పుడే పోషకాలన్నీ శరీరానికి అందుతాయి. వయస్సుతో సంబంధం లేకుండా పిల్లల నుండి పెద్దల వరకు అందరూ ఈ జ్యూస్ తాగవచ్చు.మొదట తక్కువ మోతాదుతో అలవాటు చేసుకోవడం మంచిది. సాధ్యమైనంతమేరకు.. స్వచ్ఛమైన జ్యూస్ తాగడం ఉత్తమం. అయితే తాగలేని వారు ఒక స్పూన్ తేనె లేదా ఒక చెక్క నిమ్మరసం కలుపుకోవచ్చు.

## బిజినెస్

# 2028 నాటికి 3వ అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా భారత్



2027 నాటికి భారత్ ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా అవతరిస్తుందని వాణిజ్య, పరిశ్రమల మంత్రి పియూష్ గోయల్ అన్నారు. 2047 నాటికి దేశాన్ని 30-35 ట్రిలియన్ డాలర్ల ఆర్థికవ్యవస్థను నిర్మించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ముంబైలో జరిగిన గ్లోబల్ ఎకనామిక్ కోఆపరేషన్ (జీఈసీ) సమ్మిట్‌లో మాట్లాడిన కేంద్ర మంత్రి.. భారత్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న దేశాలతో పటిష్టమైన భాగస్వామ్యాలు, వాణిజ్య సంబంధాల విషయంలో సమర్థవంతంగా పనిచేస్తోంది. ఇతర దేశాల నుంచి నమ్మకాన్ని పొందుతున్నామని, ప్రపంచ అవసరాల ఆధారంగా దేశ వాణిజ్య, పెట్టుబడులను ప్లాన్ చేస్తున్నట్టు గోయల్ తెలిపారు. గత నాలుగేళ్లలో ప్రభుత్వం తొమ్మిది వాణిజ్య ఒప్పందాలపై సంతకం చేసింది. ఈ ఒప్పందాలు నమ్మకం, పరస్పర ప్రయోజనంపై ఆధారపడి ఉన్నాయి. స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు భవిష్యత్ వృద్ధి కోసం ఉద్దేశించినవి, ఇతర దేశాలు భారత అభివృద్ధిలో భాగం కావడానికి అవకాశం ఇస్తాయని ఆయన వివరించారు. భారత ప్రభుత్వం రెండు ప్రధాన సూత్రాల ఆధారంగా వాణిజ్య ఒప్పందాలపై సంతకం చేసిందని ఆయన అన్నారు. అవి నమ్మకం, సామర్థ్యం. ఈ ఒప్పందాలపై సంతకం చేసే సమయంలోనూ ప్రభుత్వం ముఖ్యమైన రంగాలను రక్షిస్తుందని కూడా ఆయన స్పష్టం చేశారు. రాబోయే సంవత్సరాల్లో భారత ఆర్థికవ్యవస్థ చాలా వేగంగా వృద్ధి చెందుతుందని గోయల్ అన్నారు. 2047 నాటికి దేశ ఆర్థికవ్యవస్థకు 26 ట్రిలియన్ డాలర్లను జోడిస్తుంది. దేశ చరిత్రలో ఈ రకమైన వేగవంతమైన వృద్ధి ఇంతకు ముందు ఎన్నడూ చూడలేదు. గత ప్రభుత్వాలు టాయిలెట్లు వంటి ప్రాథమిక అవసరాలపై తగినంత దృష్టి పెట్టలేదని, కానీ ప్రస్తుత ప్రభుత్వం అందరి జీవన నాణ్యతను మెరుగుపరచడం, అందరినీ కలుపుకునేలా కృషి చేసిందని ఆయన వెల్లడించారు. ప్రధానంగా మౌలిక సదుపాయాలలో జరుగుతున్న మార్పులను పీయూష్ గోయల్ ప్రస్తావించారు. 5జీ ఇంటర్నెట్ మారుమూల ప్రాంతాలకు కూడా చేరిందని, మనదేశం ఇప్పుడు 500 గిగావాట్ల సామర్థ్యంతో ప్రపంచంలో రెండవ అతిపెద్ద విద్యుత్ ప్రసార నెట్‌వర్క్‌ను కలిగి ఉంది. ఆర్థిక దౌత్యం అంటే దూరంగా ఉండటానికి బదులుగా బిజినెస్ లీడర్లు, ఇంటర్నేషనల్ పార్ట్‌నర్స్ దగ్గరి సంబంధాలు కొనసాగిస్తున్నారు. ఏ దేశమైనా ఇకపై ఒంటరిగా అభివృద్ధి చెందలేవని, ప్రపంచంలోని మిగిలిన ప్రాంతాలతో కలిసి పనిచేయాలని ఆయన పేర్కొన్నారు.

### తగ్గిన బంగారం దిగుమతులు.. వెండి 56 శాతం జంప్



బంగారం, వెండి ధరలు పెరుగుతున్నప్పటికీ మనదేశంలో వీటికి గిరాకీ ఏ మాత్రం తగ్గట్లేదు. భారీ ధరల కారణంగా బంగారం విషయం లో ప్రాలు, ఇన్వెస్టర్లు కొంత తక్కువ ఆసక్తి చూపిస్తున్నప్పటికీ, వెండి విషయంలో పెద్ద ఎత్తున కొనుగోళ్లను కొనసాగి స్తున్నారు. తాజాగా వాణిజ్య మంత్రిత్వ శాఖ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి 9 నెలలకు సంబంధించిన గణాంకాలను విడుదల చేసింది. దీని ప్రకారం, గతేడాది ఏప్రిల్ నుంచి డిసెంబర్ మధ్య కాలంలో బంగారం దిగుమతులు 18.3 శాతం తగ్గి 522 టన్నులకు చేరింది. విలువ పరంగా దిగుమతుల బిల్లు 1.8 శాతం పెరిగి 49.4 బిలియన్ డాలర్లు(రూ. 4.48 లక్షల కోట్ల)కు చేరింది. ఇదే సమయంలో బంగారం ధరలు దాదాపు 25 శాతం మేర పెరిగాయి. అధిక ధరల కారణంగానే దిగుమతులు తగ్గాయని మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇక, వెండి విషయంలో గణాంకాలు ఇందుకు విరుద్ధంగా ఉన్నాయి. సమీక్షించిన సమయంలో వెండి దిగుమతులు ఏకంగా 56 శాతం పెరిగి 5,727 టన్నులుగా నమోదయ్యాయి. విలువ పరంగా 7.8 బిలియన్ డాలర్లు(రూ. 70 వేల కోట్లు)గా ఉంది. ఇది అంతకుముందు ఏడాది 9 నెలల సమయంలో దిగుమతి అయిన 3.4 బిలియన్ డాలర్ల(రూ. 30.8 వేల కోట్ల) కంటే రెట్టింపు జరిగింది.

### స్వయంగా షాపింగ్ చేయనున్న ఏఐ




ఏఐ సంస్థ ఆంత్రోపిక్‌తో కలిసి నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) కొత్త వ్యవస్థను బుధవారం పరీక్షించింది. వినియోగ దారులు ఆంత్రోపిక్‌కు చెందిన క్లాడ్ ఏఐ యాప్ ద్వారా కిరాణా సామాగ్రి, ఆహారాన్ని ఆర్డర్ చేయడంతో పాటు, యూపీఐ ఉపయోగించి చెల్లించడాన్ని పరీక్షిస్తున్నామని ఎన్‌పీసీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సోహిని రాజోలా తెలిపారు.షాపింగ్‌ను సులభతరం చేయడమే లక్ష్యంతో దీన్ని అమలు చేస్తున్నారు. ఇది విజయవంతమైతే భవిష్యత్తులో యాప్‌లను మార్చాల్సిన అవసరం లేకుండా వినియోగదారులు ఆర్డర్‌లను ఇవ్వమని, స్వయంగా చెల్లింపులు కూడా చేసేలా ఏఐని కోరవచ్చు. ప్రస్తుతం, దీన్ని కొంతమందితో పరీక్షిస్తున్నారు. బిగ్‌బాస్కెట్, జొమాటో, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ లాంటి ప్లాట్‌ఫామ్‌ల నుంచి ఏఐ షాపింగ్ చేస్తుంది. ఏఐ స్వయంగా ఖర్చు చేసేందుకు కస్టమర్లు రూ. 15,000 వరకు పరిమితిని సెట్ చేయవచ్చు.

### భారత్‌లో 'వాలియో' రూ. 2,100 కోట్ల పెట్టుబడులు



ప్రముఖ ఫ్రెంచ్ కార్ల విడిభాగాల తయారీ సంస్థ వాలియో దేశీయంగా భారీ పెట్టుబడులు ప్రకటించింది. భారత మార్కెట్లో 200 మిలియన్ యూరోలకు పైగా(మన కరెన్సీలో రూ. 2,146.18 కోట్లు) పెట్టుబడులు పెట్టాలని భావిస్తున్నట్టు కంపెనీ బుధవారం ప్రకటనలో తెలిపింది. దీని ద్వారా దేశంలో కంపెనీ గణనీయంగా విస్తరించే అవకాశం లభిస్తుందని, ఈ పెట్టుబడులు 'ఎలివేట్ 2028' ప్రణాళికలో భాగంగా ఉంటాయని కంపెనీ వెల్లడించింది. దీని ద్వారా 2024 నాటికి కంపెనీ అమ్మకాల విలువ 220 మిలియన్ యూరోల నుంచి 2028 నాటికి 700 మిలియన్ యూరోలకు పెరుగుతాయని అంచనా వేస్తున్నాం. కంపెనీ అమ్మకాలు రాబోయే మూడేళ్లలో మూడు రెట్లు పెరుగుతాయని వాలియో సీఈఓ క్రిస్టోఫ్ పెరిల్లాట్ చెప్పారు. అంతేకాకుండా 2028 తర్వాత కూడా కంపెనీ మరింత వేగంగా వృద్ధిని సాధిస్తుందనే నమ్మకం ఉందని అభిప్రాయపడ్డారు. భారత్‌తో పాటు అంతర్జాతీయంగా కార్ల తయారీ కంపెనీలకు పెరుగుతున్న అవసరాలను తీర్చడానికి కంపెనీ ఎలక్ట్రిక్ వాహనాల వేగవంతమైన వృద్ధిని, కృత్రిమ మేధస్సును ఉపయోగిస్తోంది. భారత్‌ను తాము ప్రపంచవ్యాప్తంగా మూడు ముఖ్యమైన మార్కెట్లలో ఒకటిగా పరిగణిస్తున్నట్టు వెల్లడించింది. కాగా, వాలియో కంపెనీ భారత మార్కెట్లో 1997 నుంచి కార్యకలాపాలను నిర్వహిస్తోంది. కంపెనీకి చెన్నై, పూణె, సనంద్, గుర్గావ్‌లో ఆరు తయారీ ప్లాంట్లు ఉన్నాయి. చెన్నై, బెంగళూరులలో గ్లోబల్ ఆర్అండ్‌డీ సెంటర్లు కూడా ఉన్నాయి. కంపెనీలో 7,500 కంటే ఎక్కువ మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు.

### నిస్సాన్ 7 సీట్ల ఎంపీవీ గ్రావిటీ



నిస్సాన్ మోటార్ ఇండియా 7 సీట్ల బహుళ వినియోగ వాహనం (ఎంపీవీ) గ్రావిటీని ఆవిష్కరించింది. దీని పరిచయ ధర రూ.5.65 లక్షలు (ఎక్స్-షోరూమ్). రౌండ్ ఎల్ఈడీ లైటింగ్, సిగ్నేచర్ ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్స్ విత్ ఇంటిగ్రేటెడ్ డీఆర్ఎల్స్, క్రిస్టల్ ఎడ్జ్ ఎల్ఈడీ టెయిల్ ల్యాంప్స్, ఎల్ఈడీ ఫాగ్ ల్యాంప్స్, పియానో బ్లాక్ 2డి గ్రిల్లే, ఫంక్షనల్ రూఫ్ రెయిల్స్, వైడ్-ఓపెనింగ్ డోర్స్, 20.32 సెంటిమీటర్ల ఇన్ఫోటెయిన్‌మెంట్ సిస్టమ్ విత్ వైర్‌లెస్ ఆండ్రాయిడ్ ఆటో, యాపిల్ కార్‌ప్లే, 17.78 సెం.మీ. డిజిటల్ క్లస్టర్, వైర్‌లెస్ ఛార్జర్, వాక్ అవే లాక్, ఫ్రంట్ అండ్ రేర్ పార్కింగ్ సెన్సార్లు వంటి సదుపాయాలు ఉన్నాయి. 6 ఎయిర్‌బ్యాగ్‌లు, ఈఎస్‌సీ, టీసీఎస్, హెచ్ఎస్ఏ, బీఏఎస్ ఏబీస్ విత్ ఈబీడీ, సీట్ బెల్ట్ రిమైండర్స్ వంటి భద్రతా ఫీచర్లు ఉన్నాయి. 1.0 లీటర్, 3 సిలిండర్ నేచురల్లీ ఆస్పిరేటెడ్ పెట్రోల్ ఇంజిన్, 5-స్పీడ్ మాన్యువల్, 5-స్పీడ్ ఈజెడ్ షిఫ్ట్ (ఏఎంటీ) ఆప్షన్లలో ఈ కారు లభ్యమవుతుంది. వేరియంట్ల వారీగా విసియా రూ.5.65 లక్షలు, అసెంటా రూ.6.59 లక్షలు, ఎన్-కనెక్టా రూ.7.20 లక్షలు, టెక్నా రూ.7.91 లక్షలు, ఎన్-కనెక్టా ఏఎంటీ రూ.7.80 లక్షలు, టెక్నా ఏఎంటీ రూ.8.49 లక్షల్లో (ఎక్స్-షోరూమ్) లభిస్తాయి. బుకింగ్‌లు ప్రారంభమయ్యాయి. గ్రావిటీ తర్వాత టెక్టాన్ ఎస్‌యూవీ, లార్జ్ సెవన్ సీటర్ సి సెగ్మెంట్ ఎస్‌యూవీలను ఈ ఏడాది చివర్లో తీసుకొస్తామని నిస్సాన్ మోటార్ ఇండియా ఎండీ సౌరభ్ వత్స తెలిపారు.

## స్పోర్ట్స్

# వరల్డ్‌కప్‌లో డేంజర్‌బెల్స్.. శ్రీలంకను చిత్తుగా ఓడించిన జింబాబ్వే!





ప్రపంచకప్‌లో జింబాబ్వే డేంజర్ బెల్స్ మోగిస్తోంది. మాజీ ఛాంపియన్ ఆస్ట్రేలియాను ఓడించి ఇంటికి పంపిన ఆఫ్రికా జట్టు మరో సంచలనం ఈసారి శ్రీలంకను చిత్తు చేసింది. నాకౌట్‌కు అజేయంగా దూసుకెళ్లాలనుకున్న ఆతిథ్య జట్టు ఆశలపై నీళ్లు చల్లింది. బౌలర్ల కృషిని నిలబెడుతూ.. ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్(63 నాటౌట్), కెప్టెన్ సికిందర్ రజా(45)లు చెలరేగిపోగా.., పొట్టి క్రికెట్ చరిత్రలో రెండో అత్యధిక ఛేదనతో రికార్డు నెలకొల్పింది. తద్వారా ఆసీస్‌పై విజయం గాలివాటం కాదని.. తమలో విజయకాంక్ష రగులుతూనే ఉందని పెద్ద జట్లకు హెచ్చరికలు పంపింది సికిందర్ రజా బృందం. ప్రపంచకప్‌లో ఆడడమే కాదు అద్భుత విజయాలతో వార్తల్లో నిలుస్తోంది జింబాబ్వే. రెండో లీగ్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియాపై 23 పరుగుల విజయంతో అందర్నీ ఆశ్చర్యపరిచిన ఆఫ్రికా జట్టు.. చివరి లీగ్ మ్యాచ్‌లో శ్రీలంకపై పంచ్ విసిరింది. ఆల్‌రౌండ్ షోతో ఆతిథ్య జట్టును కట్టడి చేసిన జింబాబ్వే.. ఛేదనలోనూ దుమ్మురేపింది. ఓపెనర్లు బ్రియాన్ బెన్నెట్(63 నాటౌట్), మరుమణి(34)లు లంక బౌలర్లను ధీటుగా ఎదుర్కొని.. శుభారంభమిచ్చారు. దూకుడే మంత్రగా చెలరేగిన ఈ జోడీ పవర్ ప్లేలోనే 54 రన్స్ పిండుకుంది. ఎట్టకేలకు ఈ ద్వయాన్ని వెల్లలాగే విడదీసినా.. సికిందర్ రజా(45) వస్తూనే తుఫాన్‌లా ముంచెత్తాడు. ఎదుర్కొన్నది 26 బంతులే అయినా.. ఎడాపెడా బౌండరీలు బాదిన రజా.. లంక నుంచి మ్యాచ్‌ను లాగేసుకున్నాడు. అతడి విధ్వంసానికి హేమంత తెరదించగా.. ముసెకీవా(1) గాల్లోకి లేపిన బంతిని శనక డైవ్ చేస్తూ అద్భుతంగా అందుకున్నాడు. నాలుగో వికెట్ పడినా అప్పటికి జింబాబ్వే విజయానికి10 రన్స్ కావాలి. మున్యోంగా(8 నాటౌట్).. చివరిబంతికి సింగిల్ తీశాడు. చివరి ఓవర్లో 8 రన్స్ కొట్టాల్సిరాగా.. థీక్షణ వేసిన తొలి బంతికి మున్యోంగ మిడ్‌వికెట్‌లో సిక్సర్ బాదేశాడు. రెండో బతికి సింగిల్.. విక్టరీ రన్ కొట్టాడు. అంతే.. వికెట్ల 6 తేడాతో జింబాబ్వే జయభేరి మోగించింది.

**నిశాంక హాఫ్ సెంచరీ..**

చివరి లీగ్ మ్యాచ్‌లో శ్రీలంక ఓపెనర్ పథుమ్ నిశాంక(62) అర్ధ శతకంతో చెలరేగాడు. వేదికగా జింబాబ్వే బౌలర్లను ఉతికేస్తూ అర్ధ శతకంతో కదం తొక్కాడు. బ్లెస్సింగ్ ముజరబని(2-38), ఎవాన్స్(2-35) మిడిల్ ఓవర్లలో వికెట్ల వేటతో పరుగులు కట్టడి చేసినా.. పవన్ రత్ననాయకే(44) మెరుపు ఇన్నింగ్స్ ఆడడాడు. చివరి ఓవర్లో దునిత్ వెల్లలాగే(15 నాటౌట్) మూడు బౌండరీ బాదగా శ్రీలంక 178 స్కోర్ చేసింది.

### భారత్‌పై ప్రతీకారం తీర్చుకున్న ఆస్ట్రేలియా



మహిళల ఆస్ట్రేలియా క్రికెట్ జట్టు స్వదేశంలో టీమిండియాతో మల్టీ ఫార్మాట్ సిరీస్ ఆడుతుంది. ఇందులో తొలుత 3 మ్యాచ్‌ల టీ20 సిరీస్ ప్రారంభం కాగా.. భారత్ తొలి మ్యాచ్‌లోనే ఆతిథ్య జట్టుకు షాకిచ్చి తమ ఆధిక్యతను ప్రదర్శించింది. ఈ మ్యాచ్‌లో ఎదురైన పరాభవానికి ఆసీస్ రెండో మ్యాచ్‌లోనే ప్రతీకారం తీర్చుకుంది. కాన్‌బెర్రా వేదికగా ఇవాళ (ఫిబ్రవరి 19) జరిగిన రెండో టీ20లో ఆసీస్ 19 పరుగుల తేడాతో భారత్‌ను చిత్తు చేసింది. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన ఆసీస్.. ఓపెనర్లు జార్జియా వాల్ (57 బంతుల్లో 88; 11 ఫోర్లు, సిక్స్), బెత్ మూనీ (39 బంతుల్లో 46; 4 ఫోర్లు) సత్తా చాటడంతో నిర్ణీత 20 ఓవర్లల్లో 5 వికెట్ల నష్టానికి 163 పరుగులు చేసింది. తొలుత వాల్-మూనీ ధాటికి తడబడిన భారత బౌలర్లు.. చివరి 5 ఓవర్లలో అనూహ్యంగా పుంజుకున్నారు. వాల్-మూనీ తొలి వికెట్‌కు 14.5 ఓవర్లలో 128 పరుగులు జోడించినా.. అరుంధతి రెడ్డి (4-0-20-2), శ్రీచరణి (3-0-28-0), రేణుకా ఠాకూర్ (4-0-27-1) ఊహించని విధంగా పుంజుకొని ఆసీస్‌ను భారీ స్కోర్ చేయకుండా నిలువరించారు. వాల్, మూనీ మినహా ఆసీస్ ఇన్నింగ్స్‌లో ఒక్కరు కూడా రాణించలేకపోయారు. లిచ్‌ఫీల్డ్ 6, ఎల్లిస్ పెర్రీ 7, గార్డ్‌నర్ 10 (నాటౌట్), జార్జియా వేర్హమ్ డకౌటయ్యారు. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన భారత్‌ను ఆసీస్ బౌలర్లు కలిసికట్టుగా రాణించి ఓడించారు. ఆష్లే గార్డ్‌నర్ (4-0-22-3), కిమ్ గార్త్ (3-0-16-2), అన్నాబెల్ సదర్‌ల్యాండ్ (4-0-18-2), సోఫీ మోలినెక్స్ (4-0-37-2) ధాటికి భారత్ నిర్ణీత ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 144 పరుగులకే పరిమితమైంది. భారత ఇన్నింగ్స్‌కు షఫాలీ వర్మ (29), స్మృతి మంధన (31) శుభారంభం అందించినా, ఆతర్వాత వచ్చిన వారు ఆ ఊపును కొనసాగించలేకపోయారు. కెప్టెన్ హర్మన్ (36) కాసేపు పోరాడినప్పటికీ.. ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. భారత ఇన్నింగ్స్‌లో పై ముగ్గురితో పాటు రిచా ఘోష్ (19), క్రాంతి గౌడ్ (12 నాటౌట్) మాత్రమే రెండంకెల స్కోర్లు చేశారు. జెమీమా రోడ్రిగ్స్ (4), అమన్‌జోత్ (3), అరుంధతి రెడ్డి (2) సింగిల్ డిజిట్ స్కోర్లకే పరిమితం? కాగా.. దీప్తి శర్మ, శ్రీచరణి ఖాతా కూడా తెరవలేకపోయారు. కాగా, మూడు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో భారత్ తొలి టీ20లో 21 పరుగుల తేడాతో (డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో) విజయం సాధించింది. నిర్ణయాత్మకమైన మూడో టీ20 ఫిబ్రవరి 21న అడిలైడ్ వేదికగా జరుగనుంది. ఈ ఆసీస్ పర్యటనలో భారత్ టీ20ల తర్వాత మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్, ఆతర్వాత ఏకైక టెస్ట్ మ్యాచ్ కూడా ఆడనుంది.

### మహిళా క్రికెట్‌లో మహారాణి.. దిగ్గజాలను దాటేసిన హర్మన్‌ప్రీత్..!



వన్డే వరల్డ్‌కప్ విజయంతో భారత మహిళా క్రికెట్ సుదీర్ఘ కలను సాకారం చేసిన హర్మన్‌ప్రీత్ కౌర్ (ఝతీఝఅజూతీవవ్ ఖఇతీ) కొత్త ఏడాదిలో చరిత్ర సృష్టించింది. టీమిండియాకు తొలి ఐసీసీ ట్రోఫీ అందించిన సారథిగా అప్పుడు రికార్డు నెలకొల్పిన తను.. ఈసారి దిగ్గజాలకు సాధ్యమవ్వని ఘనత సొంతం చేసుకుంది. అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన మహిళగా హర్మన్‌ప్రీత్ అవతరించింది. ఆస్ట్రేలియా గడ్డపై గురువారం రెండో టీ20లో ఆడడం ద్వారా హర్మన్‌ప్రీత్ ఈ ఫీట్ సాధించింది. దూకుడైన ఆటతో భారత జట్టులో కీలక బ్యాటర్‌గా ఎదిగిన హర్మన్‌ప్రీత్ కౌర్ తనపేరిట పలు రికార్డులు రాసుకుంటోంది. సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ.. టీమిండియాను విశ్వవిజేతగా నిలిపిన హర్మన్‌ప్రీత్.. అత్యధిక మ్యాచ్‌లు ఆడేసింది. అంతర్జాతీయ క్రికెట్‌లో న్యూజిలాండ్ సీనియర్ బ్యాటర్ సుజీ బేట్స్ రికార్డును బ్రేక్ చేస్తూ... 356వ మ్యాచ్‌లో ఆడింది భారత కెప్టెన్. చిన్నప్పటి నుంచి క్రికెట్టే ధ్యాసగా పెరిగిన ఈ పంజాబీ కెరటం 2009లో అరంగేట్రం చేసింది. అనతికాలంలోనే మూడు ఫార్మాట్లలోనూ పాతుకుపోయింది. ఇండియా తరఫున మిథాలీ రాజ్( వీఅష్ఠుశ్రీఅ ఝఇ)ను ఎప్పుడో అధిగమించిన హర్మన్‌ప్రీత్.. ఆస్ట్రేలియా గడ్డపై బేట్స్‌ను వెనక్కి నెట్టేసింది. ఇప్పటివరకూ ఆరు టెస్టులు, 161 వన్డేలు, 189 టీ20లు ఆడింది. అత్యధిక మ్యాచ్‌లు ఆడిన మహిళా క్రికెటర్ల జాబితాలో ఎలీసా పెర్రీ (ఆస్ట్రేలియా) 349, మిథాలీ రాజ్(భారత్) 333, చార్లొట్టే ఎడ్వర్డ్స్ (ఇంగ్లండ్) 309, సోఫీ డెవినె(న్యూజిలాండ్) 305 మ్యాచ్‌లతో తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నారు.



# సైకాలజికల్ థ్రిల్లర్‌తో భయపెట్టేందుకు సిద్ధమైన అనుపమ పరమేశ్వరన్

సౌత్ ఇండియాలో స్టార్ ఇమేజ్ సొంతం చేసుకున్న అనుపమ పరమేశ్వరన్, ఇప్పుడు ఒక ఇంటెన్స్ సైకాలజికల్ థ్రిల్లర్ మూవీకి సైన్ చేశారు. ఎస్ కే గీ ఎంటర్టైన్మెంట్ , బెంచ్‌మార్క్ స్టోరీటెల్లర్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ఆర్జే షాన్ దర్శకత్వం వహించనుండగా.. శివిన్ నారంగ్, ప్రేరణ అరోరా, కిరణ్ బల్లపల్లి నిర్మాతలుగా వ్యవహరించనున్నారు. గతంలో అనుపమ, దర్శకుడు ఆర్జే షాన్ కాంబినేషన్‌లో వచ్చిన షార్ట్ ఫిల్మ్ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై సూపర్ హిట్ అయ్యింది. ఇప్పుడు అదే కాంబో బిగ్ స్క్రీన్‌పై రచ్చ చేసేందుకు సిద్ధమైంది. అనుపమ పుట్టినరోజు సందర్భంగా ఈ ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటించిన మేకర్స్, సినిమా షూటింగ్‌ను మే నెలలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. త్వరలోనే ఈ మూవీ టైటిల్‌ను కూడా అనౌన్స్ చేయనున్నారు. 'కార్తికేయ 2', 'రాక్షసుడు' వంటి చిత్రాలతో థ్రిల్లర్ జానర్‌లో తనకంటూ ఒక ముద్ర వేసుకున్న అనుపమ, ఈ సినిమాతో మరోసారి ప్రేక్షకులను భయపెట్టిస్తూనే అలరించబోతోంది. నిర్మాత ప్రేరణ అరోరా గతంలో రుస్తుం, టాయిలెట్: ఏక్ ప్రేమ్ కథ, ప్యాడ్ మ్యాన్, పరి వంటి విజయవంతమైన చిత్రాలతో జాతీయ స్థాయి గుర్తింపు పొందారు. ఇక ఇప్పుడు అనుపతో మూవీ చేయబోతుండటంతో.. అందరిలో ఆసక్తి నెలకొంది. అనుపమ విషయానికి వస్తే.. ప్రేమమ్, కార్తికేయ 2, రాక్షసుడు వంటి హిట్ సినిమాలతో తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో మంచి క్రేజ్ సంపాదించుకుంది. ప్రస్తుతం వరుస సినిమాలతో ఫుల్ బిజీ బిజీగా గడుపుతోంది.




# ఆ స్టార్ హీరో అంటే చాలా ఇష్టం

టాలీవుడ్ యువ నటుడు అశోక్ గల్లా ప్రధాన పాత్రలో రూపొందిన దేవకి నందన వాసుదేవా అనే చిత్రంతో మానస వారణాసి తెలుగు సినీ పరిశ్రమలోకి ఎంట్రీ ఇచ్చింది. ఈ సినిమా పెద్ద స్థాయి విజయాన్ని సొంతం చేసుకోలేదు. దానితో ఈ బ్యూటీకి ఈ మూవీ ద్వారా పెద్దగా గుర్తింపు దక్కలేదు. ఈ సినిమా తర్వాత ఈమెకు కాస్త ఎక్కువగానే గ్యాప్ వచ్చింది. తాజాగా ఈమె సంతోష్ శోభన్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన కపుల్ ఫ్రెండ్లీ చిత్రంలో హీరోయిన్గా నటించింది. తాజాగా విడుదల అయిన ఈ సినిమాకు మంచి టాక్ రావడం జరిగింది. ఈ చిత్రంలో ఈమె తన నటనతో ప్రేక్షకులను బాగా ఆకట్టుకోవడం వల్ల ఒక్కసారిగా మానసకి టాలీవుడ్ ఇండస్ట్రీలో మంచి గుర్తింపు దక్కింది. ప్రస్తుతం కపుల్ ఫ్రెండ్లీకి మంచి ప్రేక్షకాదరణ దక్కుతుండడంతో ఈ ముద్దుగుమ్మ ఈ సినిమాకు సంబంధించిన ప్రమోషన్లను పెద్ద ఎత్తున నిర్వహిస్తూ వస్తుంది. తాజాగా ఈమె ఓ ఇంటర్వ్యూలో పాల్గొంది. అందులో ఈమెకు తెలుగు సినిమా పరిశ్రమలో ఏ నటులు అంటే ఇష్టం? ఎవరితో సినిమా చేయాలని ఉంది అనే విషయాలను తెలియజేసింది. తాజాగా మానస వారణాసి మాట్లాడుతూ... నేను చిన్న వయసు నుండి టాలీవుడ్ స్టార్ హీరోలు అయినటువంటి మహేష్ బాబు, నాగార్జున, వెంకటేష్ సినిమాలు చూస్తూ పెరిగాను. వారి నటన చాలా ఇష్టం. వారిపై నాకు ఎంతో గౌరవం ఉంది. ఇక నాకు మహేష్ బాబు గారు అంటే చాలా చాలా ఇష్టం. ఆయనతో కలిసి నటించే అవకాశం వస్తే బాగుంటుందని అనుకుంటున్నట్లు ఈమె తాజాగా చెప్పుకొచ్చింది.

# నటుడిని కాబట్టే బతికిపోయాను

టాలీవుడ్ హీరో రానా దగ్గుబాటి హీరోగా, విలన్‌గా నటించి ఎంతోమంది ప్రశంసలు పొందారు. బాహుబలి చిత్రాలతో దేశవ్యాప్తంగా గుర్తింపు పోందారు. 'బాహుబలి 2' ఘనవిజయం తర్వాత రానా కెరీర్ పీక్స్‌లో ఉన్న సమయంలోనే ఆయన అనారోగ్యం బారిన పడ్డారు. తాజాగా, రానా తన ఆ చేదు అనుభవాలను ఓ పాడ్‌కాస్ట్‌లో వెల్లడించారు. అమెరికాలో కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స చేయించుకుని ప్రాణాలతో తిరిగి రావడం ఒక ఎత్తైతే, ఆ తర్వాత శారీరకంగా వచ్చిన మార్పులను అంగీకరించడం మరో ఎత్తని చెప్పుకొచ్చారు. ఒకప్పుడు కండలు తిరిగిన భల్లాలదేవుడిగా కనిపించిన తాను, చికిత్స తర్వాత నీరసించిపోయి గుర్తుపట్టలేనంతగా మారిపోయానని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సమయంలో తన రూపం మారిపోవడంతో, అప్పటికే సంతకం చేసిన భారీ సినిమాల అడ్వాన్స్‌లను వెనక్కి ఇచ్చేసినట్లు రానా వెల్లడించారు. అసలు తనను తానే గుర్తుపట్టలేని స్థితికి చేరుకున్నట్లు తెలుపుతూ.. "ఆ సమయంలో నేను కేవలం బతికి బయటపడాలనే ఆలోచనతోనే ఉన్నాను. కానీ ఏడాది తర్వాత అద్దంలో చూసుకుంటే నా పాత రూపం కనిపించలేదు. ఒక భారీ రెజ్లర్ కథతో సహా మరికొన్ని పెద్ద సినిమాలు చేయాల్సి ఉంది. కానీ అద్దంలో కనిపిస్తున్న వ్యక్తి ఏమాత్రం ఆ పాత్రలకు సరిపోయేలా లేదు. అందుకే నేను 'హాట్ గాయ్' ఇమేజ్ కోల్పోయానని భావించి, ఆ నిర్మాతలకు డబ్బులు తిరిగి ఇచ్చేశాను" అని రానా తెలిపారు.



# చీరకట్టులో ఆండ్రియా అందాల చిరుజల్లు

మోస్ట్ బ్యూటిఫుల్ సింగర్ మరియు నటి అయిన ఆండ్రియా గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. ఈమె ఎక్కువ తమిళ సినిమాల్లో నటించింది. ఆండ్రియా తెలుగులో తక్కువ సినిమాల్లో నటించినప్పటికీ వాటి ద్వారా మంచి గుర్తింపును సంపాదించుకుంది. ఇప్పటివరకు ఈ బ్యూటీ చాలా సాంగ్స్ పాడింది, స్టేజ్ షోలు కూడా చేసింది. ఈ సింగర్ చాలా సినిమాల్లో తన అందాలతో ప్రేక్షకులను కట్టిపడేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఈ ముద్దుగుమ్మ సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉంటూ వస్తుంది. ఎప్పటికప్పుడు తనకు సంబంధించిన అనేక విషయాలను తన అభిమానులతో పంచుకుంటుంది. దాంతో ఈమెకు సోషల్ మీడియా అకౌంట్లో పెద్ద ఎత్తున ఫాలోవర్స్ ఉన్నారు. వీలు చిక్కినప్పుడల్లా ఈ చిన్నది తనకు సంబంధించిన హాట్ లుక్ లో ఉన్న ఫోటోలను కూడా పోస్ట్ చేస్తూ వస్తుంది. అందులో చాలా వరకు వైరల్ అయిన సందర్భాలు కూడా ఉన్నాయి. తాజాగా ఆండ్రియా ఒక ఫోటోషూట్ ను నిర్వహించింది. అందులో ఈమె బ్లూ కలర్ లో ఉన్న శారీని కట్టుకొని అందుకు తగిన బ్లౌజ్ను ధరించి తన ఫ్రంట్ అండ్ బ్యాక్ అందాలు ప్రదర్శితమయ్యేలా స్టిల్స్ ఇచ్చింది. ఈ ఫోటోలలో ఈమె తన అందమైన లుక్స్ తో చీరకట్టుతో యువతను ఆకట్టుకునే విధంగా ఉంది. దాంతో ఈ హాట్ బ్యూటీకి సంబంధించిన చీరకట్టులో ఉన్న ఫోటోలు తెగ వైరల్ అవుతున్నాయి.



# సత్యదేవ్- ఫరియా కాంబో ఫిక్స్.

హీరో సత్యదేవ్ తన కొత్త చిత్రానికి శ్రీకారం చుట్టారు. ఈ ప్రాజెక్ట్ ఆయన 15వ ప్రాజెక్ట్‌గా రాబోతుండగా.. వర్కింగ్ టైటిల్‌తో త్రిశూల్ విజినరీ స్టూడియోస్ బ్యానర్ పై బి.నరేంద్ర రెడ్డి నిర్మిస్తున్నారు. కంప్లీట్ ఎంటర్‌టైనింగ్ స్క్రిప్ట్‌తో దర్శకుడు లక్ష్మీనారాయణ పుట్టంచెట్టి తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో ఫరియా అబ్దుల్లా నాయికగా నటిస్తోంది. తాజాగా, హైదరాబాద్ రామానాయుడు స్టూడియోలో ఈ మూవీ పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. ఈ ప్రారంభోత్సవానికి బ్లాక్ బస్టర్ డైరెక్టర్ అనిల్ రావిపూడి ముఖ్య అతిథిగా హాజరై హీరో హీరోయిన్లపై క్లాప్ ఇచ్చారు. యంగ్ ప్రొడ్యూసర్ వంశీ నందిపాటి కెమెరా స్విఛ్ ఆన్ చేయగా.. లక్ష్మీనారాయణ ఫస్ట్ షాట్‌కు డైరెక్షన్ చేశారు. ఈ సందర్భంగా అతిథిగా వచ్చిన ప్రొడ్యూసర్ వంశీ నందిపాటి మాట్లాడుతూ.. నా స్నేహితుడు ప్రొడ్యూసర్ నరేంద్ర మరో మంచి చిత్రాన్ని చేస్తున్నారు. హీరో సత్యదేవ్ గారు ఒక ఔట్ అండ్ ఔట్ ఎంటర్ టైనర్ లో నటిస్తున్నారు. ఈ సినిమా ఆయనకు బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ అవుతుంది. ఈ సినిమా సాధించబోయే విజయం గురించి తర్వాత మళ్లీ మాట్లాడుతాను. డైరెక్టర్ లక్ష్మీనారాయణకు కూడా ఈ సినిమా మంచి పేరు తీసుకొస్తుంది. ఈ టీమ్ అందరికీ కంగ్రాట్స్ చెబుతున్నా. అన్నారు. డైరెక్టర్ లక్ష్మి నారాయణ పుట్టంచెట్టి మాట్లాడుతూ.. మా సినిమా జానర్ ఏంటి అని అందరూ అడుగుతున్నారు. అందరి పెదాలపై నవ్వుల పూయించే చిత్రమిది. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్‌కు వెళ్తున్నాం. రామ్ మిరియాల అన్న మా సినిమాకు మంచి మ్యూజిక్ చేస్తున్నారు. ఫస్ట్ టైమ్ ఒక కంప్లీట్ మూవీకి ఆయన సంగీతాన్ని అందిస్తున్నారు. సత్యదేవ్ గారి కెరీర్ లో ఇదొక పెద్ద హిట్ కావాలని కోరుకుంటున్నా. మాకు సపోర్ట్ చేసేందుకు ఇక్కడికి వచ్చిన అతిథులకు, మీడియా మిత్రులకు థ్యాంక్స్ చెప్పారు.



## టోల్ ప్లాజాల్లో నగదు చెల్లింపులు బంద్



జాతీయ రహదారులపై ప్రయాణించే వారికి ఇది అత్యంత కీలకమైన అప్‌డేట్. దేశవ్యాప్తంగా ఉన్న టోల్ ప్లాజాల్లో నగదు రూపంలో రుసుము చెల్లించే విధానానికి స్వస్తి పలకాలని కేంద్ర ప్రభుత్వం గట్టిగా యోచిస్తోంది. అన్నీ అనుకున్నట్లు జరిగితే, 2026 ఏప్రిల్ 1వ తేదీ నుంచి టోల్ ప్లాజాల వద్ద నగదు చెల్లింపులు పూర్తిగా రద్దు కానున్నాయి. ఆ తర్వాత టోల్ రుసుములను కేవలం ఫాస్టాగ్ లేదా యూపీఐ వంటి డిజిటల్ మార్గాల ద్వారానే చెల్లించాల్సి ఉంటుంది. ఈ మేరకు రోడ్డు రవాణా మరియు రహదారుల మంత్రిత్వ శాఖ సంకేతాలు ఇచ్చింది. ఎలక్ట్రానిక్ టోల్ కలెక్షన్ వ్యవస్థను మరింత బలోపేతం చేసి, టోలింగ్ ప్రక్రియను అత్యంత సమర్థవంతంగా, పారదర్శకంగా మార్చడమే ఈ ప్రతిపాదన ముఖ్య ఉద్దేశమని ప్రభుత్వం స్పష్టం చేసింది. గత కొన్నేళ్లుగా ఫాస్టాగ్ వినియోగం అనూహ్యంగా పెరిగింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 98 శాతానికి పైగా వాహనదారులు ఫాస్టాగ్ ద్వారానే టోల్ చెల్లిస్తున్నారు. ఈ విజయమే నగదు రహిత విధానం వైపు అడుగులు వేయడానికి ప్రభుత్వానికి ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది. ఫాస్టాగ్‌తో పాటు, దేశంలోని అన్ని టోల్ ప్లాజాల్లో యూపీఐ ద్వారా చెల్లించే సౌకర్యం కూడా అందుబాటులో ఉంది. ఇది ప్రయాణికులకు తక్షణ చెల్లింపునకు మరో మార్గాన్ని అందిస్తోంది. ప్రస్తుతం, వాహనం విండ్‌స్క్రీన్‌పై అతికించిన ఫాస్టాగ్ స్టిక్కర్ ద్వారా టోల్ ప్లాజా వద్ద ఆగకుండానే రుసుము ఆటోమేటిక్‌గా ఖాతా నుంచి కట్ అవుతోంది. ఈ విధానం దేశంలోని అన్ని జాతీయ రహదారులతో పాటు, 100కి పైగా రాష్ట్ర రహదారుల టోల్ ప్లాజాల్లో విజయవంతంగా అమలవుతోంది. ఇప్పటికే ప్రభుత్వం డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటోంది. ఫంక్షనల్ ఫాస్టాగ్ ఉండి కూడా నగదు చెల్లిస్తే రెట్టింపు రుసుము, యూపీఐ ద్వారా చెల్లిస్తే 1.25 రెట్లు రుసుము వసూలు చేస్తున్నారు. తాజా ప్రతిపాదన అమలైతే, టోల్ ప్లాజాల వద్ద వాహనాల రద్దీ, ట్రాఫిక్ జామ్‌లు గణనీయంగా తగ్గుతాయి. ప్రయాణికులకు విలువైన సమయం ఆదా అవుతుంది. టోల్ ఆపరేటర్లకు నిర్వహణ ఖర్చులు తగ్గడంతో పాటు, టోల్ వసూళ్లలో ఆడిట్ నియంత్రణ మరింత సులభతరం అవుతుంది. నగదుపై ఆధారపడటాన్ని పూర్తిగా తగ్గించి, టోలింగ్ వ్యవస్థను 100 శాతం డిజిటలైజ్ చేయడమే లక్ష్యమని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ తెలిపింది. ఈ ప్రతిపాదనకు ఆమోదముద్ర పడితే, 2026 ఏప్రిల్ నుంచి జాతీయ రహదారులపై ప్రయాణం పూర్తిగా క్యాష్‌లెస్ అనుభవంగా మారనుంది.

## ఈసీకి సహాయం చేయడానికి జ్యుడిషియల్ అధికారులను నియమించాలి



బంగాల్‌లో నిర్వహిస్తున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)పై సుప్రీం కోర్టు అసాధారణ నిర్ణయం తీసుకుంది. ఎన్నికల కమిషన్‌కు సహాయం చేయడానికి జిల్లా ప్రస్తుత, మాజీ న్యాయమూర్తులను నియమించాలని కోల్‌కతా హైకోర్టును ఆదేశించింది. ఈ వ్యవహారంపై ఈసీ, బంగాల్ ప్రభుత్వం పరస్పరం ఆరోపణలు చేసుకోవటం దురదృష్టకరమని పేర్కొంది. బంగాల్ ప్రభుత్వం తగిన సంఖ్యలో గ్రేడ్-ఎ అధికారులను నియమించకపోవటాన్ని సీరియస్‌గా తీసుకున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్ మాల్య బాగ్చి సారథ్యంలోని ధర్మాసనం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది.
అదేవిధంగా, ఈనెల 28వ తేదీ నాటికి ఓటరు జాబితా ముసాయిదాను ప్రచురించేందుకు అనుమతి ఇచ్చింది. అనుబంధ ఓటరు జాబితా తర్వాత ప్రకటించాలని సూచించింది. ఎస్ఐఆర్‌లో పాల్గొనే జ్యుడీషియల్ అధికారులకు రవాణా సదుపాయంతోపాటు భద్రత కల్పించాలని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలకు ఆదేశాలు జారీ చేసింది.

## పెళ్లి అయ్యే వరకు ఫోన్ మాట్లాడంపై నిషేధం- వధూవరులిద్దరికీ ఆ కమ్యూనిటీ వింత షరతు!

ప్రస్తుత కాలంలో పెళ్లి కుదిరిందంటే చాలు కాబోయే వధూవరులిద్దరూ ఫోన్‌లో ముచ్చట్లు మొదలుపెట్టేస్తున్నారు. వివాహానికి ముందే అన్ని విషయాలను పంచుకుంటున్నారు. అందుతో తమ వ్యక్తిగత, కుటుంబ విషయాలు కూడా ఉంటున్నాయి. ఈ క్రమంలో మనస్పర్థలు, అనుమానాలు, అపోహలతో చాలా మంది పెళ్లికి ముందే విడిపోతున్నారు. నిశ్చితార్థం (ఎంగేజ్‌మెంట్) అయినప్పటికీ వివాహం వరకు బంధం కొనసాగట్లేదు. ఈ నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్‌లో సేన్ కమ్యూనిటీ (సమాజం) కీలక నిర్ణయం తీసుకుంది. తమ సామాజిక వర్గానికి చెందిన వధువరూలిద్దరూ నిశ్చితార్థం తర్వాత తమకు కాబోయేవారితో ఫోన్ మాట్లాడడంపై నిషేధం విధించింది.

### ఏకగ్రీవంగా నిర్ణయం

నిశ్చితార్థం తర్వాత చాలా పెళ్లిళ్లు ఆగిపోవడాన్ని బలోద్ జిల్లాలోని సేన్ కమ్యూనిటీ చాలా సీరియస్‌గా తీసుకుంది. ఈ క్రమంలోనే నిశ్చితార్థం అయిన తర్వాత పెళ్లి వరకు తమకు కాబోయే భాగస్వామితో వధూవరులిద్దరూ రహస్యంగా ఫోన్‌లో మాట్లాడకూడదని నిర్ణయించింది. కాబోయే భర్త లేదా భార్యతో కుటుంబ సభ్యుల సమక్షంలో మాట్లాడొచ్చని స్పష్టం చేసింది. కాబోయే భార్యాభర్తలు ఒకరితో ఒకరు రహస్యంగా ఫోన్‌లో మాట్లాడడంపై నిషేధం విధించింది. ఈ మేరకు సేన్ కమ్యూనిటీ ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకుంది. ఆధునిక యుగంలో ఫోన్లు కుటుంబాలను విచ్ఛిన్నం చేస్తున్నాయని సేన్ కమ్యూనిటీ బరోద్ జిల్లా అధ్యక్షుడు సంతోష్? కౌశిక్ అభిప్రాయపడ్డారు. అందుకే మళ్లీ పాత విధానాలను అనుసరిస్తున్నామని పేర్కొన్నారు. నిశ్చితార్థం అయిన తర్వాత వివాహం వరకు కాబోయే వధూవరులిద్దరూ ఫోన్‌లో రహస్యంగా మాట్లాడకూడదని నిర్ణయించామని తెలిపారు. ఇటీవల కాలంలో తమ సామాజిక వర్గానికి చెందిన నిశ్చితార్థమైన చాలా జంటలు పెళ్లికి ముందే విడిపోయానని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మొబైల్ ఫోన్‌లో గంటల తరబడి మాట్లాడటం వల్ల కుటుంబ సంబంధాలు దెబ్బతింటున్నాయని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు.

### 'నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం'

తమ సామాజిక వర్గం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నానని సేన్ కమ్యూనిటీ కార్యదర్శి సీమా కౌశిక్ తెలిపారు. సుదీర్ఘమైన ఆలోచనల తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు.

# చైనా, బంగ్లాలకు భారత్ చెక్


ఒకే ఒక్క కీలక ప్రాజెక్టుతో చైనా, బంగ్లాదేశ్‌లకు భారత్ చెక్ పెట్టబోతోంది. దేశంలోనే తొలిసారిగా అసోంలోని బ్రహ్మపుత్ర నది కింద ట్విన్ ట్యూబ్ అండర్ వాటర్ రోడ్ అండ్ రైల్ టన్నెల్ నిర్మాణానికి భారత్ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. మన దేశ భద్రతకు ఈ ప్రాజెక్టు అత్యంత కీలకమైంది. ఇటీవలే ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశంలో ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఇంజినీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) మోడల్ కింద దాదాపు రూ.18,662 కోట్లతో ఈ టన్నెల్ ప్రాజెక్టును నిర్మించనున్నారు. పొరుగున ఉన్న చైనా, బంగ్లాదేశ్ నుంచి వచ్చే ముప్పులను ఎదుర్కోవడానికి ఇదెలా సహాయపడుతుంది ? ఈ ప్రాజెక్టు వల్ల బార్డర్‌లో భారత ఆర్మీ బలం ఎంతమేర పెరుగుతుంది? సిలిగురి కారిడార్ (చికెన్ నెక్ కారిడార్) భద్రతను ఈ టన్నెల్ ఎలా బలోపేతం చేస్తుంది? ఈశాన్య రాష్ట్రాలకు కలిగే ప్రయోజనాలేంటి? ఈ కథనంలో తెలుసుకుందాం.

### 36 కి.మీ.లో 15.79 కిలోమీటర్లు నది అడుగునే

ట్విన్ ట్యూబ్ అండర్ వాటర్ రోడ్ అండ్ రైల్ టన్నెల్ అంటే రెండు టన్నెల్స్ పక్కపక్కనే ఉంటాయి. ఒక టన్నెల్‌లోని రైలుపట్టాల మీదుగా రైళ్లు రాకపోకలు సాగిస్తాయి. మరొక టన్నెల్‌లోని రోడ్డు మీదుగా వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. బంగాల్ రాష్ట్రంలో ఉత్తర దినాజ్‌పుర్ జిల్లాలోని తీన్ మిలే హాత్ నుంచి డార్జిలింగ్ జిల్లాలోని సిలిగురి నగరానికి 11 కిలోమీటర్ల దూరంలోని రంగపాణి పట్టణం వరకు 36 కిలోమీటర్ల పరిధిలో ట్విన్ ట్యూబ్ టన్నెల్‌ను నిర్మించనున్నారు. ఈ టన్నెల్ రోడ్డు, రైలు మార్గాల్లో బంగాల్‌తో అసోం, అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, ఇతర ఈశాన్య రాష్ట్రాలను కనెక్ట్ చేస్తుంది. కీలకమైన విషయం ఏమిటంటే, ఈ సొరంగంలోని మొత్తం 36 కిలోమీటర్ల విస్తీర్ణంలో 15.79 కిలోమీటర్ల విభాగాన్ని అసోం రాష్ట్రంలో బ్రహ్మపుత్ర నది కింద నీటి అడుగున నిర్మిస్తారు. అసోంలో బ్రహ్మపుత్ర నది ఉత్తరం ఒడ్డున ఉన్న గోహ్‌పుర్ పట్టణం నుంచి బ్రహ్మపుత్ర నది దక్షిణం ఒడ్డున ఉన్న నుమాలీఘర్ వరకు నది కింద అండర్ వాటర్ టన్నెల్ నిర్మాణం జరగనుంది.

### రెండు జాతీయ రహదారులు, రెండు రైల్వే లైన్లు అనుసంధానం

రోడ్ అండ్ రైల్ టన్నెల్ నిర్మించనున్న 36 కిలోమీటర్ల మార్గంలో ప్రస్తుతమున్న రెండు ట్రాక్‌ల రైల్వే లైన్‌ను నాలుగు ట్రాక్‌లుగా మారుస్తారు. ఈ టన్నెల్ ప్రాజెక్టు ఎన్‌హెచ్-15, ఎన్‌హెచ్-715 జాతీయ రహదారులతో పాటు, రెండు రైల్వే లైన్లకు కలుపుతుంది. నార్త్ ఈస్ట్ ఫ్రాంటియర్ రైల్వే జోన్ పరిధిలోని రంగియా డివిజన్‌లో గోహ్‌పుర్ వైపునున్న రంగియా-ముకోంగ్సెలెక్ రైల్వే లైన్, తీన్‌సుకియా డివిజన్‌లో



నుమాలీఘర్ వైపునున్న ఫుర్కేటింగ్-మరియాని లూప్ లైన్‌లను ఈ ప్రాజెక్టు కనెక్ట్ చేస్తుంది.

### 240 కి.మీ దూరం 34 కి.మీకు తగ్గిపోతుంది!

ప్రస్తుతం జాతీయ రహదారి మార్గంలో అసోంలోని నుమాలీఘర్ – గోహ్‌పుర్ పట్టణాల మధ్య 240 కిలోమీటర్ల దూరం ఉంది. ఈ దూరాన్ని వాహనంలో ప్రయాణించడానికి సగటున 6 గంటల టైం పడుతుంది. అండర్ వాటర్ రోడ్, రైల్ టన్నెల్ అందుబాటులోకి వచ్చాక నుమాలీఘర్, గోహ్‌పుర్ మధ్య కేవలం 34 కిలోమీటర్ల దూరమే ఉంటుంది. నుమాలీఘర్ నుంచి గోహ్‌పుర్‌కు 20 నిమిషాల్లోనే వెళ్లొచ్చు.

### బ్రహ్మపుత్ర తీరప్రాంతం దశ తిరుగుతుంది!

అసోంలోని నుమాలీఘర్ అనేది ప్రధాన పారిశ్రామిక కేంద్రం. నుమాలీఘర్ రిఫైనరీ లిమిటెడ్ అనే ప్రభుత్వరంగ చమురు కంపెనీ అక్కడ కార్యకలాపాలు నిర్వహిస్తోంది. నుమాలీఘర్, గోహ్‌పుర్‌ల మధ్య రైల్, రోడ్ కనెక్టివిటీ పెరిగితే అసోం రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు, వ్యాపార వికాసం రెక్కలు తొడుగుతాయి. అండర్ వాటర్ రోడ్, రైల్ టన్నెల్ అనేది అసోంలోని 11 ఆర్థిక కేంద్రాలు, 3 సామాజిక కేంద్రాలు, 2 పర్యాటక కేంద్రాలు, 8 లాజిస్టిక్స్ కేంద్రాలను కలుపుతుంది. రాష్ట్రంలోని 4 ప్రధాన రైల్వే స్టేషన్లు, 2 విమానాశ్రయాలు, 2 లోతట్టు జలమార్గాలకు మెరుగైన కనెక్టివిటీని అందిస్తుంది. దీనివల్ల వస్తు,ఉత్పత్తులు, ప్రయాణికుల రాకపోకలు వేగవంతం అవుతాయి. మొత్తంమీద ఈ టన్నెల్ ప్రాజెక్ట్ అసోం పరిధిలో దాదాపు 80 లక్షల రోజుల ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలను సృష్టిస్తుంది. అసోం సహా ఈశాన్య రాష్ట్రాల్లో వరదలు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు వేగంగా సహాయక సామాగ్రిని, రెస్క్యూ టీమ్‌లను తరలించే వీలు కలుగుతుంది.

### చైనా, బంగ్లాదేశ్‌లకు చెక్- భారత సైన్యానికి కొత్తమార్గాలు

ట్విన్ ట్యూబ్ అండర్ వాటర్ రోడ్ అండ్ రైల్ టన్నెల్ బంగ్లాదేశ్ సరిహద్దులోని రెండు సైనిక స్థావరాల దాకా వెళుంది. ఆ స్థావరాలకు శరవేగంగా సైనికులు, ఆయుధాలను చేరవేసే వీలు కలుగుతుంది.
బంగ్లాదేశ్ సరిహద్దు సమీపంలో మరో మూడు కొత్త సైనిక స్థావరాలను భారత సైన్యం నిర్మిస్తోంది. వీటిలో ఒకటి బిహార్‌లోని కిషన్‌గంజ్‌లో, మరొకటి బంగాల్‌లోని చోప్రాలో, ఇంకొకటి అసోంలోని ధుబ్రిలో ఉన్నాయి.
వీటికి చేరువగా ఈ రైలు-రోడ్డు మార్గం వెళుతుంది. నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్‌ల అంతర్జాతీయ సరిహద్దులు ఈ రైలు-రోడ్డు సొరంగ మార్గానికి చాలా దగ్గరగా ఉంటాయి. సైనిక ఘర్షణలు తలెత్తితే, ఈ టన్నెల్ మార్గంలో వేగంగా మూడు దేశాల సరిహద్దుల సమీపం వరకు భారత్ ఆయుధాలు, సైనికులను తరలించగలదు.
బంగాల్‌లోని సిలిగురి కారిడార్‌ను చికెన్ నెక్ కారిడార్ అంటారు. ఇది నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్, చైనాలోని చుంబీ లోయలకు అత్యంత సమీపంలో ఉంటుంది. సిలిగురి నగరం పరిధిలోని బాగ్ డోగ్రా విమానాశ్రయం సమీపం నుంచే ఈ టన్నెల్‌ను నిర్మించనున్నారు.
బంగాల్‌లోని సిలిగురి సమీపంలోనే భారత సైన్యానికి బెంగ్ డుబి సైనిక స్థావరం ఉంది. సిలిగురి కారిడార్ భద్రతకు ఇది కీలకమైంది. ఈ సైనిక స్థావరానికి కూడా చేరువగానే రోడ్ – రైల్ టన్నెల్ ఉంటుంది
బంగాల్‌లోని సుక్నాలో భారత ఆర్మీకి చెందిన 33వ కార్ప్స్ ప్రధాన కార్యాలయం ఉంది. దీన్నే త్రిశక్తి కార్ప్స్ అంటారు. ఇది కూడా టన్నెల్‌కు చేరువగానే ఉంటుంది. అత్యవసరాలు, యుద్ధ పరిస్థితుల్లో త్రిశక్తి కార్ప్స్ దళాలు ఈ టన్నెల్ మీదుగా రైళ్లు, వాహనాల ద్వారా సరిహద్దుల దాకా చేరుకోగలుగుతారు.
ప్రపంచంలో నీటి అడుగున రైల్వే సొరంగాలు ఎక్కడున్నాయి? డెన్మార్క్, స్వీడన్ దేశాలు భారత్ కంటే ముందే నీటి అడుగున రోడ్ కమ్ రైల్ టన్నెల్‌ను నిర్మించాయి. నీటి అడుగున నిర్మించిన అతి పొడవైన రైల్వే సొరంగంగా ఓరెసుండ్ టన్నెల్ రికార్డును సాధించింది. దీని మొత్తం పొడవు 16 కి.మీ. ఇందులో దాదాపు 4 కి.మీ భాగాన్ని సముద్రం కింద నిర్మించారు. ఈ టన్నెల్ డెన్మార్క్‌లోని కోపెన్ హగెన్ నగరాన్ని, స్వీడన్‌లోని మాల్మో నగరంతో అనుసంధానిస్తుంది. 2000 సంవత్సరంలోనే దీని నిర్మాణం పూర్తయింది. ఈ టన్నెల్‌లో మొత్తం 5 ట్యూబ్‌లు ఉన్నాయి. వీటిలోని రెండు ట్యూబ్‌లలో నాలుగు లేన్ల రోడ్లు ఉన్నాయి. మిగతా రెండు ట్యూబ్‌లలో రైళ్లు రాకపోకలు సాగిస్తాయి. ఇంకొక ట్యూబ్‌లను అత్యవసరాల కోసం సిద్ధంగా ఉంచారు. ఈ సొరంగంలో వెంటిలేషన్, లైటింగ్, అధునాతన సెక్యూరిటీ ఫీచర్స్ ఉన్నాయి. అసోంలో బ్రహ్మపుత్ర నది కింద టన్నెల్ నిర్మాణం పూర్తయ్యాక భారత్ పేరు కూడా డెన్మార్క్, స్వీడన్ లాంటి దేశాల సరసన చేరనుంది.

# ఏఐ ఫలాలను ప్రతి ఒక్కరికి, ప్రతిచోటుకు చేరవేద్దాం

'ఇది వేగవంతమైన పురోగతి, కొత్త ఆవిష్కరణల యుగం'అని గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ అన్నారు. అయితే వీటితో అత్యుత్తమ ఫలితాలే వస్తాయని కచ్చితంగా చెప్పలేమని ఆయన అభిప్రాయపడ్డారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) లాంటి కొత్త ఆవిష్కరణలతో అత్యుత్తమ ఫలితాలను సాధించేందుకు అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఏఐ ఫలాలు ప్రతి ఒక్కరికి, ప్రతిచోటుకు చేరేలా చేయాల్సిన బాధ్యత మనపై ఉందని సుందర్ పిచాయ్ పేర్కొన్నారు. అమెరికా సారథ్యంలోని టెక్ కూటమి 'పాక్స్ సిలికా'లో భారత్ చేరికపై దిల్లీలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్, అమెరికాల మధ్య టెక్ భాగస్వామ్యం అత్యంత కీలకమైందన్నారు. 'పాక్స్ సిలికా' కూటమిలోకి భారత్ చేరనున్న నేపథ్యంలో ఆ కూటమిలోని అన్ని దేశాలకు పిచాయ్ అభినందనలు తెలిపారు. అమెరికా సారథ్యంలోని 'పాక్స్ సిలికా' కూటమిలో చేరిక వల్ల ఏఐ టెక్నాలజీ, సెమీ కండక్టర్లు, అరుదైన ఖనిజ నిక్షేపాలతో ముడిపడిన అంతర్జాతీయ సప్లై చైన్లకు భద్రత, రక్షణ లభిస్తాయన్నారు.

### భారత ప్రభుత్వంతో కలిసి ఏఐ యాప్స్ తెస్తాం

'ఏఐ విభాగంలో భారత్ అసాధారణమైన భవిష్యత్తును చూడబోతోంది. ఇందుకోసం మేం కూడా పూర్తి సహకారాన్ని అందిస్తాం. కొత్త ప్రోడక్ట్స్, సామర్థ్యం పెంపు, మౌలిక వసతుల పెంపు ద్వారా చేయూతను అందిస్తాం. భారతీయ కస్టమర్లు, వ్యాపారాలు, డెవలపర్ల కోసం ఏఐ ప్రోడక్ట్స్, సాఫ్ట్‌వేర్లను తయారు చేసే దిశగా ప్రస్తుతం కసరత్తు చేస్తున్నాం. ఏఐ కోచ్ సాఫ్ట్‌వేర్ కోసం 22 గెమ్మా ఓపెన్ సోర్స్ లార్జ్ ల్యాంగ్వేజ్ మోడల్స్‌ను ఇప్పటికే విడుదల చేశాం' 'కొత్త ఏఐ ప్రోడక్ట్స్ అభివృద్ధి విషయంలో మేం భారత ప్రభుత్వంతోనూ కలిసి



పనిచేస్తున్నాం. రైతులకు సకాలంలో వాతావరణ సూచనలను అందించే, రోగుల్లో డయాబెటిక్ రెటినోపతిని గుర్తించే ఏఐ యాప్‌లను ప్రభుత్వంతో కలిసి తీసుకురాబోతున్నాం.వీలైనన్ని ఎక్కువ భారతీయ భాషల్లో ఈ యాప్‌లు అందుబాటులోకి తేవాలని లక్ష్యంగా పెట్టుకున్నాం' అని గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ తెలిపారు.

### ఆ ఫీచర్లను భారత్‌లోనే ఎక్కువ వినియోగిస్తున్నారు

'సర్కిల్ టు సెర్చ్, లెన్స్ లాంటి గూగుల్ స్కామ్ డిటెక్షన్ ఫీచర్లను ప్రపంచంలో ఎక్కువగా భారత్‌లోనే వినియోగిస్తున్నారు. జెమిని యాప్ వినియోగం యావత్ ప్రపంచంలో శరవేగంగా పెరుగుతోంది. ఆ యాప్ 10 భారతీయ భాషల్లో అందుబాటులో ఉంది. ఎంతోమంది భారతీయ కంటెంట్ క్రియేటర్లు యూట్యూబ్ ద్వారా ప్రపంచానికి భారతీయ సంగీతం, కళలు, సంస్కృతిని చూపిస్తున్నారు' 'భారతీయులకు ఏఐ స్కిల్స్‌ను నేర్పడంపైనా మేం ఫోకస్ పెట్టాం. ఇందుకోసం గూగుల్ ఏఐ స్కిల్స్ ప్రోగ్రాం నడుస్తోంది. కోటిమంది భారతీయులకు ఏఐ టూల్స్‌పై అవగాహన కల్పించాలని మేం టార్గెట్‌గా పెట్టుకున్నాం. విద్యార్థులు, కొత్తగా టెక్ ప్రొఫెషన్స్‌లోకి ఎంటరయ్యే వారికి గూగుల్ ఏఐ సర్టిఫికెట్లను జారీ చేసేందుకు మేం వాధ్వానీ ఏఐ కంపెనీతో కలిసి పనిచేస్తున్నాం. ఈ వారం ఆరంభంలోనే దీనిపై నిర్ణయం జరిగింది' అని గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ చెప్పారు.

### సముద్ర గర్భ ఫైబర్ ఆప్టిక్ కేబుల్స్‌కు గేట్‌వేగా విశాఖపట్టణం

'భారత్‌లోనే తొలి ఫుల్ స్టాక్ ఏఐ హబ్‌ను ఆంధ్రప్రదేశ్‌లోని వైజాగ్‌లో ఏర్పాటు చేయబోతున్నాం. ఇందుకోసం రూ.1.36 లక్షల కోట్ల పెట్టుబడి పెడతాం. ఆ ఏఐ హబ్ సామర్థ్యం గిగావాట్ల స్థాయిలో ఉంటుంది. దానివల్ల దేశవ్యాప్తంగా ప్రజలకు ఉద్యోగాలు, ఏఐ టెక్నాలజీ ఫలాలు, కొత్త వ్యాపార అవకాశాలు లభిస్తాయి. భారత్, అమెరికాల మధ్య డిజిటల్ ట్రేడ్ రూట్ల ఏర్పాటులోనూ గూగుల్ కీలక పాత్ర పోషిస్తుంది. ఇరుదేశాల నడుమ వారధిగా పనిచేస్తుంది. అందుకోసం విశ్వసనీయమైన డిజిటల్ ప్రోడక్ట్స్, సముద్రగర్భ కేబుల్స్, ఏఐ హబ్‌లు అవసరం' 'ఇండియా- అమెరికా కనెక్ట్ కార్యక్రమాన్నీ మేం ఇప్పటికే ప్రకటించాం. దీనిలో తొలి ప్రధాన అంతర్జాతీయ సముద్ర గర్భ గేట్‌వేగా విశాఖపట్నం నిలుస్తుంది. వైజాగ్ నుంచి సింగపూర్, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా దేశాల వరకు సముద్ర గర్భ ఫైబర్ ఆప్టిక్ కేబుల్స్ కనెక్ట్ అవుతాయి. ముంబయి టు పశ్చిమ ఆస్ట్రేలియా వరకూ సముద్ర గర్భ కేబుల్స్ ఏర్పాటు అవుతాయి. కొత్తగా అమెరికా ఏర్పాటు చేసిన పాక్స్ సిలికా కూటమి ఈవిధమైన సప్లై చైన్ల భద్రతకు హామీ ఇస్తోంది' అని గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ వివరించారు.

# రిటైర్ అవుతారా? రిటర్న్ అవుతారా?- రాజ్యసభ పోల్స్ వేళ శరద్ పవార్ ప్లాన్ ఏంటి?

మహారాష్ట్ర రాజకీయాల్లో మరో కీలక పరిణామం జరగబోతోందనే సంకేతాలు కనిపిస్తున్నాయి. లేదు లేదు, కాదు కాదు అంటూనే రాజ్యసభ ఎన్నికల బరిలోకి దిగేందుకు ఎన్‌సీపీ (ఎస్‌పీ) అధినేత శరద్ పవార్ రెడీ అవుతున్నారనే టాక్ వినిపిస్తోంది. రాష్ట్ర రాజకీయాల్లో విస్తృతమైన పరిచయాలతో పాటు సుదీర్ఘ అనుభవం, జాతీయ స్థాయిలో పేరు కలిగిన 85 ఏళ్ల శరద్ పవార్‌ను రాజ్యసభకు పంపాలని యోచిస్తోంది. మహారాష్ట్రలోని 7 రాజ్యసభ సీట్లకు మార్చి 16న ఎన్నికలు జరగనున్నాయి. రాష్ట్రంలోని ఎమ్మెల్యేల సంఖ్యాబలం పరంగా మహా వికాస్ అఘాడీ (ఎంవీఏ) కూటమి ఒకే ఒక్కరిని రాజ్యసభకు పంపగలుగుతుంది. ఆ ఒక్క అవకాశాన్ని శరద్ పవార్ పొందబోతున్నారనే చర్చ జరుగుతోంది. అయితే దీన్ని కాంగ్రెస్‌లోని ఓ వర్గం వ్యతిరేకిస్తోంది.

### వరుసగా మూడోసారి రాజ్యసభకు శరద్ పవార్

రాజ్యసభకు వెళ్లాలనే కోరిక తనకు లేదని శరద్ పవార్ ఇంతకుముందే పలుమార్లు స్పష్టం చేశారు. అయితే, అజిత్ పవార్ మరణంతో రాష్ట్ర రాజకీయ సమీకరణాలు మారిన దృష్ట్యా ఆయన రాజ్యసభకు వెళ్లేందుకు మొగ్గుచూపుతారనే అంచనాలు వెలువడుతున్నాయి. తన పార్టీ ఎన్‌సీపీ (ఎస్‌పీ) కోసం కాకుండా, ప్రతిపక్ష ఎంవీఏ కూటమి భవిష్యత్తు కోసం రాజ్యసభ ఎన్నికల బరిలోకి దిగేందుకు శరద్ పవార్ సిద్ధం అవుతున్నారనే ప్రచారం జరుగుతోంది. గత ఆరు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్న శరద్ పవార్, ఇప్పటివరకు కేవలం రెండుసార్లే రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించారు. 2014లో భారత రాజకీయాల్లో బీజేపీ ప్రభంజనం మొదలయ్యాక, శరద్ పవార్ రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేయాల్సిన అనివార్య పరిస్థితి ఏర్పడింది. ఈవిధంగా 2014, 2020లో రాజ్యసభకు ఆయన ఎన్నికయ్యారు. ప్రస్తుతం రాజ్యసభ సభ్యుడిగా ఉన్న శరద్ పవార్ పదవీకాలం 2026 ఏప్రిల్?తో ముగియనుంది. దీంతో వరుసగా మూడోసారి ఆయన్ను రాజ్య సభకు పంపి, జాతీయస్థాయిలో ప్రతిపక్ష ఇండియా కూటమి వాణిని బలోపేతం చేయాలని విపక్షాలు భావిస్తున్నాయి.
రాజ్యసభ ఎన్నికల షెడ్యూల్‌ను ఫిబ్రవరి 18వ తేదీన కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. మహారాష్ట్రలో మొత్తం 288 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. రాజ్యసభ ఎన్నికల్లో ఒక సీటును గెలవాలంటే కనీసం 37 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. ప్రస్తుతం ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ కూటమిలో శరద్ పవార్ ఎన్‌సీపీ, కాంగ్రెస్, ఉద్ధవ్ శివసేన ఉన్నాయి. ఈ కూటమికి 50 మంది ఎమ్మెల్యేల బలం ఉంది. అత్యధికంగా ఉద్ధవ్ శివసేనకు 20 మంది, కాంగ్రెస్‌కు 16 మంది, శరద్ ఎన్‌సీపీకి 10 మంది, సమాజ్ వాదీ పార్టీకి ఇద్దరు, పీజాంట్స్ అండ్ వర్కర్స్, సీపీఐ పార్టీలకు చెరొక ఎమ్మెల్యేలు ఉన్నారు. 7 రాజ్యసభ సీట్లకు ఎన్నికలు జరగనున్నాయి. వీటిలో ఒకే ఒక సీటును గెలిచే బలం మహా వికాస్ అఘాడీ కూటమికి ఉంది. ఇటీవలి కాలంలో శరద్ పవార్ ఎన్‌సీపీ, బీజేపీ మధ్య పెరుగుతున్న సాన్నిహిత్యంపై రాజకీయ వర్గాల్లో హాట్ డిబేట్ నడుస్తోంది.

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137